

ఆంధ్రపత్రిక
సచిత్రవారపత్రిక
4 అణాలు
7-2-'51

విషయానుక్రమణిక

7 ఫిబ్రవరి 1951

సీరియల్:

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో—అలెగ్జాండర్ డ్యూమా 4

వ్యాసాలు:

కాంగ్రెస్: చేతకాని సమస్య—సీతారామ్ 7

అమెరికన్ సమరవ్యూహం—సూర్యనారాయణ 8

కథలు:

కాలంతోపాటు—శ్రీ పినపాల వెంకటేశ్వరరావు 9

గత్తుకులదారి—శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు 13

ఐస్ ఫ్రూట్—"రాజ్ పాల్" 16

నాటిక:

పెండ్లిమాటలు—ఆంటన్ చెకోవ్ 18

సినిమా:

సోవియట్ సినిమా కళాపరిణామం—వి. పుడోవ్కిన్ 24

బొమ్మరిల్లు:

టామ్ సాయర్ (సీరియల్)—మార్క్ ట్వేన్ 28

తెల్లదొర...దుంగదొర—శ్రీ అక్కాల బాబురావు 32

తండ్రిప్రేమ—శ్రీ మైలవరపు వెంకటేశ్వరరావు 33

గేయం:

మా చెల్లాయి—శ్రీ అడివి బాపిరాజు 27


ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును
Founder: K. NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 21

వికృతి సంవత్సర మాఘ శుద్ధ పాడ్యమి బుధవారము



నాడిపరీక్ష:
ఆహారధాన్యాలను భారతప్రభుత్వం కోరినందువల్ల భారతదేశంలోని ఆహారపరిస్థితి ఎలావుందో, తెలపాలని అమెరికన్ ప్రభుత్వం చెప్పింది.

కౌంట్ ఆఫ్ మాంటిక్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

5

నాడు ప్రభాతం కలకల లాడింది. సాగరతరంగాల అంచుల నురుగులు ప్రభాకరుని తొలికిరణాలలో కెంపుల తోరణాల వలె ప్రకాశించాయి. రిజర్వ్ హోటల్లో విందు సిద్ధపరచబడింది. అయిదారు కిటికీలవల్ల వెలుగు నిండారిన ఒక పెద్ద గదిలో విందు జరుగుతుంది. కిటికీలప్రక్క గదిపొడుగునా వరండా ఒకటి ఉంది. భోజనాలు జరగవలసినది మిట్ట మధ్యాహ్న వేళ. కాని పదకొండు గంటలకే వరండా అతిథులతో నిండిపోయింది. అతిథులలో చాలమంది ఫరావో నావికు లున్నారు. డాంటీమిత్రులైన కొందరు సిపాయి లున్నారు. నౌకయజమానికూడా విందుకు రాగలడని అతిథులలో వదంతి బయలుదేరింది. అయినా డాంటీకి ఇంత సత్కారం జరుగుతున్నదంటే చాలమంది నమ్మలేకపోయారు. చివరికి మారెల్ ప్రవేశించగానే నావికు లంతా సంభ్రమంతో స్వాగత మిచ్చారు. డాంటీ కెప్టెన్ కాగలడనే వదంతి, మారెల్ రాకతో ధృవపడింది. డాంటీ అంటే నావికులకు ప్రీతి. మారెల్ రాగానే కరతాళధ్వనులతో హర్షం ప్రకటించారు.

మారెల్ రాగానే వరుని తీసుకురావడానికి డాంగ్లర్, కాడరూస్ పంపబడ్డారు. ఇద్దరూ పరుగుమీద బయలుదేరారు. నూరు గజాలలో వారికి ఒక చిన్న ఊరేగింపు ఎదురయింది. నలుగురు కాటలన్ యువతులు అనుసరించగా, మర్సిదా డాంటీలు చెయ్యీచెయ్యీ కలిపి నడిచి వస్తున్నారు. డాంటతండ్రి వధువు ప్రక్క నడుస్తున్నాడు. అందరకూ వెనకగా ఫెర్నాండో నడుస్తున్నాడు. అతని ముఖంలో వికృత మందహాసం ద్యోతక మౌతున్నది. ఎదురువెళ్ళిన ఇద్దరూ తమపని చెప్పి, వారితో తిరిగి వెనక్కి బయలుదేరారు. డాంగ్లర్ ఫెర్నాండోప్రక్క నడుస్తున్నాడు. కాడరూస్ వృద్ధునిప్రక్క నడుస్తున్నాడు. వృద్ధుడు చక్కని టఫేటాసిల్కు కోటు ధరించాడు. తెలుపునీలపు రంగుల రిబ్బన్లు ముడివేసిన మూడంచుల టోపీ పెట్టుకున్నాడు. చిత్రమైన వంకర చేతికర్ర మోపుకుంటూ నడుస్తున్న వృద్ధుని చూస్తే, లగ్జెంబర్గ్ ఉద్యానవనాల్లో విహరిస్తున్న శతాబ్దంనాటి విలాసపురుషులు జ్ఞప్తికి వస్తారు. మృష్టాన్నంకోసం తహతహలాడుతున్న కాడరూస్ వృద్ధునితో స్నేహం కలిపాడు. అతని మనస్సులో ఒకమూల నిన్నటి సంఘటన మెదుల్తూనే ఉంది.

ఫెర్నాండో ప్రక్క చేరిన డాంగ్లర్ భగ్నప్రేమికుని ఓరకంట కనిపెట్టి చూశాడు. అతని ఉనికినే మరచి, దృష్టినంతా ప్రియునిపైనే లగ్నంచేసిన మర్సిదా వెనక అభగ్నప్రేమికుడు నెమ్మదిగా నడుస్తున్నాడు. కాటలన్ యువకుడు మాటిమాటికి మార్సెల్స్ నగరంవంక చూస్తున్నాడు. తలవని తలంపుగా ఏదో వచ్చిపడగలదని నిరీక్షిస్తున్నట్లు క్షణక్షణానికీ కంపించిపోతున్నాడు.

వాణిజ్యనౌకలో ఉద్యోగిగా తనకనువైన నిరాడంబరమైన దుస్తులనే డాంటీ ధరించాడు. వధువువంక తదేకంగా చూస్తున్న అతని సుందరవదనంలో అపార ఆనందానుభవం, గర్వం ప్రతిఫలిస్తున్నాయి. గ్రీక్ వనితల సౌందర్యానికి దీటురాని మర్సిదా, నీలినేత్రాలు, కెంపు పెదవులు ఆమె అందాన్ని ఇనుమడింపచేయగా, సముద్రతీరవాసుల సహజస్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ప్రకటిస్తూ ఠీవిగా నడుస్తున్నది.

ఈ బృందం రిజర్వ్ హోటల్‌కి అల్లంత దూరంలో కనిపించగానే, మారెల్ ఎదురువెళ్లాడు. మారెల్ వెంట కొందరు సిపాయిలు, నావికులూకూడా బయలుదేరారు. ఫరావో కెప్టెన్‌గా నియమించగలడని డాంటీకి చేసిన వాగ్దానాన్ని మారెల్ అతిథులకు అప్పుడే ప్రకటించిఉన్నాడు. మారెల్ సమీపించగానే ఎడ్మండ్ వధువుచేతిని మారెల్ చేతిలో ఉంచాడు. మారెల్ ఆమెను హోటల్లోకి నడిపించుకు వెళ్లాడు.

విందుమేజావద్ద మధ్యలో నిలిబడి, మర్సిదా వృద్ధుడైన డాంటీతండ్రిని తన కుడిప్రక్కకు పిలిచి కూర్చోబెట్టుకుంది. "నాకు సోదరసమానుడైనవాడు నా ఎడమప్రక్క కూర్చుంటాడు" అని ఫెర్నాండోను పిలిచింది. ఆమె పిలుపులోని మాధుర్యం ఫెర్నాండో హృదయంలో శూలమై గ్రుచ్చుకుంది. అతని ముఖం పాలిపోయింది. హృదయా వేగం అధికమయింది. డాంటి మారెల్‌కీ డాంగ్లర్‌కీ మధ్య చేరాడు. అందరూ కూర్చోవచ్చునని చేసంజ్ఞ చేశాడు. రకరకాల పాకవిశేషాలను అతిథులు రుచితో భుజిస్తున్నారు: "ఆహా! ఎంత నిశ్శబ్దంగా ఉంది" అన్నాడు వృద్ధుడు, సారాయం రుచిచూస్తూ; "ఉల్లాసంగా గడపడానికి ముప్ఫయిమంది జనం ఇక్కడున్నారని ఎవరనుకుంటారు?"

"అవును. కాని భర్తకాబోతున్న యువకుడు నవ్వుతూ పేలుతూ ఉండడుగా!" అన్నాడు కాడరూస్.

"అసలువిషయమేమిటంటే, నేను నవ్వుతూ పేలుతూ ఉండగల స్థితిలో లేను. ఆనందం అతిశయంగా ఉన్నందువల్ల నిర్వా

అనువాదం: సీతారామ్

క్కగా ఉన్నాను" అన్నాడు డాంటి. "నువ్వు ఆ అర్థంతో అన్నట్లయితే, అది నిజం. దుఃఖంమాదిరిగానే ఆనందంకూడా ముప్పిరిగొన్నప్పుడు అలాగే ఉంటుంది."

డాంగ్లర్ ఫెర్నాండో వంక చూశాడు. ప్రతి మాటకీ, ప్రతి అలికిడికీ కాటలన్ యువకుడు ఉలికులికిపడుతున్నాడు. డాంగ్లర్ డాంటీతో అన్నాడు: "అయితే దేనికో సంకోచిస్తున్నట్లున్నారెందుకు? మీరు ఉచ్చదశలో ఉన్నారుగదా?"

"అవును. సరిగ్గా అదే కారణం" అని జవాబిచ్చాడు డాంటీ. "మనిషై పుట్టినవాడు ఇంత సులువుగా, ఇంత ఆనందాన్ని పొందలేడని నా ఉద్దేశం. అదృష్టసంపదని పొందలేకపోయేవాడు, పోరాడిసాధించాలి. నిజం చెప్పాలంటే, మర్సిదాకి భర్త కాగలిగిన సౌభాగ్యం నాకు ఎట్లా ఎందుకు లభించిందో తెలియటం లేదు."

"భర్త అంటున్నావేమిటోయ్ అప్పుడే?" అన్నాడు కాడరూస్ పకపక నవ్వుతూ. "అప్పుడే అనకోయ్, కెప్టెన్. పక్కనున్నవాళ్లని చూసి మరీ మాట్లాడు."

మర్సిదా ముఖం రాగరంజితమయింది.

ఫెర్నాండో కుర్చీలో స్థిమితంగా కూర్చోలేకపోతున్నాడు. చిన్న సవ్వడి వినిపించినా ఉలికిపడుతున్నాడు. మాటిమాటికీ నుదుట చెమట తుడుచుకుంటున్నాడు.

డాంటీ అన్నాడు: "సరేలేవోయ్ కాడరూస్. ఇంత చిన్నవిషయంకోసం నాతో వాదించడం ఎందుకు చెప్పు? మర్సిదా ఇంకా నా భార్య కానిమాట నిజమే. అయితే ఇంకెంతసేపు?" జేబులోనుంచి గడియారం తీసి చూసి, "ఇంక గంటన్నరలో అవుతుంది."

ఈ మాటలు వినేసరికి, అందరూ ఆశ్చర్యచకితులైనారు; ఒక్క డాంటీ తండ్రి మినహా. ఆ వృద్ధుడు సంతోషం పట్టలేక నవ్వేశాడు. మర్సిదా చిరునవ్వు నవ్వింది. ఫెర్నాండో చెయ్యి కత్తిపిడిమీద వాలింది.

"గంటలోనా?" అన్నాడు డాంగ్లర్ తెల్లబోతూ; "ఎలాగ చెప్పండి?"

డాంటీ చెప్పాడు: "అవును. నా తండ్రితరవాత తండ్రిగా ఎంచదగిన మారెల్ దయవల్ల, వ్యవహారమంతా సులువైపోయింది. లైసెన్సు తీసుకునే పనికూడా పూర్తి అయింది. విల్లాహోటల్ వద్ద మనకోసం మేయర్ నిరీక్షిస్తూ ఉంటారు. ఇప్పుడు సరిగ్గా ఒంటిగంటంపావు అయింది. కాబట్టి నే చెప్పినదాంట్లో ఆట్టే తప్పు లేదు. సరిగ్గా గంటన్నరలో మర్సిదా, మదాం డాంటి పేరు స్వీకరిస్తుంది."

"శుభకార్యాలంటే ఇల్లా సానుకూలపడాలి" అన్నాడు డాంటీతండ్రి. "కాలం రవంతైనా నష్టం కాలేదని ఒప్పుకుంటారా లేదా? నిన్ననే ఓడ దిగడం; ఇవాళ మధ్యాహ్నం మూడు గంటలకల్లా పెళ్లిఅయిపోవడం! ఇంత చక్కగా తరుణం కని పెట్టిన మరొక నావికుణ్ని చూపండి నాకు?"

"మరి మిగతా తతంగంమాట? కంట్రాక్టు? మిగతా ఏర్పాట్లు?" అని ప్రశ్నించాడు డాంగ్లర్, కొంచెం సంకోచంతో.

"కంట్రాక్టా?" అన్నాడు డాంటీ నవ్వుతూ. "కంట్రాక్టు కేముంది? అన్నీ నిర్ణయమైపోయినాయి. ఆస్తిపాస్తులేవీ నాకూ లేవు, మర్సిదాకీ లేవు. కమ్యూన్ (లోకల్ బోర్డువంటిది) ఆధ్వర్యం కింద పెళ్లి జరుగుతుంది. అదంతా నిర్ణయమైపోయింది. వ్రాతకోతలకి ఆట్టేసేపు పట్టలేదు. డబ్బువసూళ్లు ఆట్టే ఉండవు."

"అంటే ప్రధానపు విందని మే మనుకుంటున్నది, నిజంగా పెళ్లివిందన్నమాట? అంతేనా?" అన్నాడు డాంగ్లర్.

"అంతమాత్రానికి మీ కొచ్చిన నష్టమేమీ లేదు. ఇటు వినండి. నేను రేపు బయలుదేరి పారిస్ వెడుతున్నాను. వెళ్లడానికి నాలుగురోజులు, తిరిగి రావడానికి నాలుగురోజులు, నా కర్తవ్యాన్ని తృప్తిగా నిర్వహించడానికి ఒకరోజు పడుతుంది. అంటే పదిరోజుల్లో తిరిగి వస్తాను. ఆ మర్నాడు అసలు పెళ్లిసంతర్పణ జరుగుతుంది."

ఇంకో విందుమాట వినగానే అతిథుల సంతోషం రణగొణ



"మా కుక్క నేమీ అనకండి. ముందు మొదలుపెట్టింది మీ అమ్మాయే!"

ధ్వనులతో మిన్నుముట్టింది. ఆ రొదలో వధూవరులకు వృద్ధుడు పలికిన ఆశీర్వచనాలు మణిగిపోయాయి.

ఎడ్మండ్ ప్రేమపూర్వకంగా తండ్రివంక చూశాడు. మర్సిడా చిన్న గడియారంవంక చూసింది. విందు ముగిసే వేళకి రణగొణధ్వని మరింత ఎక్కువయింది. ఎవరికి వారు గుంపులుగుంపులుగా చేరి సంభాషణ కుపక్రమించారు.

ఫెర్నాండో మనస్సులోని ఆందోళన అధికం కాసాగింది. డాంగ్లర్ కూడా ఆందోళనకు గురైనాడు. కాటలన్ యువకుని హృదయజ్వాలలధికమైనకొద్దీ, అటూ ఇటూ పచారు చెయ్య నారంభించాడు. గాలిపాటలను, హర్షధ్వానాలను, గ్లాసుల మోతలను చెవుల పడనీయలేక, వీలైనంత దూరంలో ఉండడానికి ప్రయత్నిస్తున్నాడు. కొంతసేపటికి కాడరూస్ అతన్ని సమీపించాడు. అదే సమయానికి డాంగ్లర్ కూడా అక్కడికి చేరాడు. ఇంతవరకూ డాంగ్లర్‌కు దూరంగా ఉండాలని ఫెర్నాండో ప్రయత్నిస్తున్నాడు.

డాంటీ ప్రియవర్తన, మధురసారాయాలవల్ల, అతనిపట్ల వైరభావాన్ని నిశ్శేషంగా చెరిపివేసుకున్న కాడరూస్ ఇలా అన్నాడు: "నిజంగా ఉన్నమాట చెప్పకోవాలోయ్! డాంటీ మహా మంచివాడు. ప్రేయురాలిప్రక్క కూర్చున్న అతన్ని చూస్తుంటే, నిజంగా నన్న నువ్వు పన్నిన దుస్తంత్రం సిగ్గుచేటైన దనిపిస్తోంది."

"కాని అదేం జరగలేదని నీకు తెలుసుగా! పాపం! ఈ ఫెర్నాండో దీనస్థితి చూస్తే మొదట జాలివేసింది. కాని ప్రత్యర్థి పెళ్ళిలో మర్సిడా తనక్కూడ ప్రధానవ్యక్తిగా ఉండడానికి అతను నిశ్చయించుకోగానే ఇంక నేను చెప్పవలసిం దేముందని మానుకున్నాను."

ఇంతలో మర్సిడామాటలు వినిపించాయి. "ఇంక మనం బయలుదేరి వెడదామా? అప్పుడే గంట కొట్టింది. మనం రెండుగం టావుకి అక్కడికి వస్తామని నిరీక్షిస్తుంటారు."

"అవునవును. వెడదాం" అంటూ డాంటీ సంభ్రమంతో లేచాడు.

"నడవండి" అన్నారు అతిథులంతా ఏకకంఠంతో.

సరిగా ఆ క్షణంలో, కిటికీఅంచు నానుకొని నిలబడిఉన్న ఫెర్నాండో కనుగ్రుడ్లు వెళ్ళబెట్టి, విపరీత భయాందోళనలతో కంపించి, వెనక్కు ఒరిగిపోవడం డాంగ్లర్ చూశాడు. వెంటనే బైట పెద్ద సవ్వడి, బరువైన అడుగుల చప్పుళ్లు, కత్తుల ఖణఖణధ్వనులు, తొందరమాటలు వినవచ్చినాయి. ఈ సవ్వడిలో అతిథుల ఆందోళిత స్వరాలు మణిగిపోయాయి. మూడుసార్లు తలుపుపై తట్టినట్లు వినరాగానే, గదిలో నిశ్శబ్దం అలుముకొంది.

"రాజోద్యోగుల ఆజ్ఞ. తలుపు తెరవండి" అని ఒక కంఠం పలికింది.

ఎవ్వరూ సమాధాన మివ్వలేదు. తలుపులు తెరుచుకున్నాయి. ఒక పోలీసుఅధికారి ప్రవేశించాడు. అతనివెంట అయిదుగురు సాయుధులైన పోలీసు లున్నారు.

అధికారితో కొద్ది పరిచయం కల ఓడయజమాని ముందుకు వచ్చాడు. "మీ రేంపనిమీద వచ్చారు? తప్పకుండా ఎక్కడో పొరపాటు జరిగిఉంటుంది," అన్నాడు.

"పొరపాటు జరిగివున్నట్లయితే తప్పకుండా దిద్దుకోబడుతుందని నమ్మండి మారెల్. నావద్ద అరెస్టు వారంటుంది. నాకు ఇష్టంలేకపోయినా, నా కర్తవ్యం నెరవేర్చాలి. మీలో ఎడ్మండ్ డాంటీ ఎవరో తెలుపుతారా?" అన్నాడు అధికారి.

"నేనే. మీ కేం కావాలి?"

"ఎడ్మండ్ డాంటే! ప్రభుత్వాజ్ఞప్రకారం నేను మిమ్మల్ని అరెస్టుచేస్తున్నాను."

"నన్ను అరెస్టుచేస్తారా? ఎందుకు?" అన్నాడు ఎడ్మండ్ తెల్లబోతూ.

"అది నేను చెప్పలేను, విచారణలో మీకే తెలుస్తుంది."

ఇంక చెయ్యగలిగేది ఇప్పుడేదీ లేదని మారెల్ గ్రహించాడు. అరెస్టుచెయ్యడానికి వచ్చిన వ్యక్తి సామాన్యుడు కాడు. అధికారదత్తమైన దుస్తులు ధరించిన న్యాయశాసన ప్రతినిధి. కన్నులు, చెవులు, నోరు మూసుకుని కర్తవ్యాన్ని నిర్వహించ వలసినవాడు. పుత్రప్రేమ మూర్తీభవించినట్లున్న వృద్ధునికి హఠాత్సంఘటనలో ఇది తెలియరాలేదు. అధికారిసమీపానికి దూసుకువెళ్లాడు. దీనంగా ప్రార్థించాడు. కాని అతని ప్రార్థనలు, కన్నీరు వ్యర్థమైనాయి.

అధికారి ఇలా చెప్పాడు: "మీరు శాంతించండి. ఓడ దిగినప్పుడు మీ కుమారుడు ఏ నియమాన్నో పాటించక చిన్న తప్పిదం చేసిఉంటాడు. అవసరమైన సమాచారం అడిగి తెలుసుకుని, బహుశా అతన్ని విడిచిపెట్టవచ్చును."

"ఏమి టిదంతా?" అంటూ వచ్చాడు కాడరూస్. ఫెర్నాండోకోసం చుట్టూ చూశాడు. కాని అతడు కనిపించలేదు. అదృశ్యుడైనాడు. గడిచిన సాయంకాలపు దృశ్యమంతా అతని కళ్లకి కట్టినట్లు కనిపించింది. అప్పటి చైతన్యం తప్పినస్థితిలో అలుముకున్న మాయతెర, ఈ దుర్ఘటనతో తొలగిపోయింది. "అయ్యయ్యో! నిన్నటి పరిహాసానికి ఇదా ఫలితం డాంగ్లర్? ఎంత దుర్మార్గానికి ఒడిగట్టావు? వాడి సిగ్గు కాల!"

"అదేం కాదోయ్!" అంటూ గట్టిగా అరిచాడు డాంగ్లర్. "ఆ కాగితాన్ని నేను చింపివెయ్యడం నువ్వు చూశావుగా?"

"నువ్వు చింపి పారెయ్యలేదు. మూల పడేశావు. అంతే. ఏడీ ఫెర్నాండో?"

"నా కేం తెలుసు? అతని పనుల్లో అత నున్నాడనుకుంటాను. మన మింక ఇల్లా నాదించుకోవడం మానేసి, పాపం వాళ్లని పరామర్శచేద్దాం రా."

వీరిద్దరి సంభాషణ ఇక్కడ జరుగుతుండగా డాంటీ చిరునవ్వుతో మిత్రులందరివద్దా సెలవు తీసుకుని అధికారిముందు నిలబడ్డాడు. "అదంతా పోనివ్వండి. ఇప్పుడు ఈ వ్యవహార మేదో తేలిపోడానికి ఆట్టేసేపు పట్టదు. బహుశా నన్ను జైలుకి పంపడం కూడా జరగదనుకుంటాను."

"అబ్బెబ్బే. దానికి నేను జవాబుదారీ" అంటూ డాంగ్లర్ అక్కడ చేరాడు.

అధికారి ముందు నడవగా, సాయుధభటులమధ్య నడుస్తూ డాంటే మెట్లు దిగాడు. ద్వారంవద్ద ఒక బండి నిలిచి ఉంది. డాంటీ బండెక్కి కూచున్నాడు. అతని ప్రక్కనే అధికారి కూచున్నాడు. ఇద్దరు భటులుకూడా కూచోగానే బండి మార్సెల్స్‌నగరముఖంగా బయలుదేరింది.

మర్సిడా వరండాచివర నిలబడి ప్రియునికి వీడ్కోలు ఇచ్చింది. "వెళ్లిరా డాంటే" అంటూ చెయ్యి ఊపింది. ఆమె పలుకులు ఖైదీకి ఆక్రందనవలె వినవచ్చినాయి. అతను బండిలోనుంచి తల బైటికి వొంచి చూసి, "మళ్ళీ వస్తాను మర్సిడా" అన్నాడు

(42-వ పేజీ చూడండి)

అమెరికన్ సమర వ్యూహం



బి. ఎన్. రావు

"ప్రపంచం వినాశానికి సిద్ధపడుతున్న సమయంలో, నిరోధించడానికి ఆసియా దేశాలు చేశక్తులాకృషి చేసినాయన్న సత్యాన్ని లిపిబద్ధం చెయ్యాలని మా కోరిక" అన్నారు భారతదేశ ప్రతినిధి బి. యన్. రావు ఐక్యరాజ్యసమితి రాజకీయ సంఘంలో. కోరియాలో మధ్య సరిహద్దును దాటవద్దని బి. యన్. రావు ఇచ్చిన సలహాను పాటించక, కోరి పరాజయాన్ని తెచ్చుకున్న అమెరికన్, యూరోపియన్ దేశాల ప్రతినిధులు ఈసారికూడా హెచ్చరికను చెవిపెట్టలేదు. కాని ప్రపంచమంతటా ప్రజలకీ మాటలు గింగుర్లెత్తుతున్నాయి.

చేసిన తప్పిదాలు సరిదిద్దుకోవడం చేతగాక, దురభిమానంతో అమెరికా పట్టుపట్టింది. కేవలం అమెరికన్లని తృప్తిపరచడానికి పశ్చిమయూరప్ అగాధంలోకి దూకుతోంది. ఇషం లేకపోయినా పశ్చిమ యూరోపియన్ రాజ్యాలు చీనాపై నేరమారోపించే తీర్మానాన్ని బలపరిచాయి. తమ దేశాల ఆర్థికవ్యవస్థ కూలిపోక తప్పదని తెలిసికూడా, పశ్చిమ యూరోపియన్ ప్రభుత్వాలు, అమెరికా కోరినప్రకారం సైనికబల సంపత్తిని వృద్ధిచేసుకోడానికి నిర్ణయించాయి.

చీనాపై దురాక్రమణ నేరాన్ని ఆరోపిస్తూ అమెరికా ప్రతిపాదించిన తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ఆమోదించింది. ముఖ్యమైన ఏడు రాజ్యాల ప్రతినిధులను సమావేశపరిచి; మొదట కోరియా యుద్ధవిరమణ సమస్యను, తరువాత తూర్పు ఆసియా సమస్యలను చర్చించాలని సూచిస్తూ, పన్నెండు ఆసియా అరబ్ దేశాలు ప్రతిపాదించిన తీర్మానం నిరాకరించబడింది.

సమితి ఆమోదించిన అమెరికన్ తీర్మానంలో ముఖ్యాంశాలు: కోరియాలో సమితి సేనల నెదిరించి పోరాడుతున్న చీనా కమ్యూనిస్టుసేనలు యుద్ధం మానాలి. సమితి సేనలు పోరాటాన్ని కొనసాగించాలి. ఎట్టి చర్యలు తీసుకోవాలో నిర్ణయించే కమిటీ సమావేశమై చీనాపై తీసుకోవలసిన చర్యల్ని సమితికి సూచించాలి. సమితి అధ్యక్షుడు, ఇద్దరు సభ్యుల సహాయంతో శాంతి రాయబారాలకు కృషిచెయ్యాలి.

ఈ తీర్మానాన్ని ఆమోదించిన బ్రిటన్ మొదలైన దేశాలు చీనాపై ఎట్టి చర్యనూ తీసుకోనడానికి అంగీకరించరాదని నిర్ణయించుకున్నాయి. రాయబార సంఘం ద్వారా శాంతికి కృషి చెయ్యాలని ఈ దేశాల యత్నం. కాని అమెరికా తీర్మానాన్ని ఆమోదించినట్లయితే, శాంతిరాయబారాలు అసంభవమని చీనా ముందే స్పష్టపరిచింది.

అందువల్ల అమెరికా తీర్మానంలో సూచించబడిన రెండు కర్తవ్యాలూ నెరవేరవు. రాయబారాలు జరగవు. చర్య తీసుకోడానికి బ్రిటన్ మొదలైన దేశాలు అంగీకరించవు. కాబట్టి చర్యలు తీసుకోడానికి బ్రిటన్ మొదలైన దేశాల్ని అమెరికా ఒత్తిడి చేసే వరకూ, ఈ తీర్మానం నిష్ప్రయోజనంగా ఉండిపోతుంది.

అయితే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టి, ఇతరదేశాలపైన అమెరికా ఒత్తిడి తేవడం చప్పగా ఊరుకోడానికేనంటే నమ్మలేని విషయం. తూర్పు ఆసియాలో అమెరికా ఏమి సాధించదలచిందో నాయకుల ప్రకటనలవల్ల వెల్లడౌతోంది.

జర్మనీ, జపాన్ల సైనిక, ఆయుధబల సంపత్తిని పునరుద్ధరించడానికి అమెరికా కార్యక్రమాలు సిద్ధంచేసింది. ఫార్మోజా ద్వీపాన్ని తమ యుద్ధవ్యూహం దృష్ట్యా తన అధీనంలోనే ఉంచుకోడానికి నిర్ణయించుకుంది. చీనాపై యుద్ధానికి బర్మా, ఇండోచీనాల నైసర్గిక ప్రాధాన్యతనుబట్టి, ఆ దేశాలతో వ్యవహారాలను నిర్వహించడానికి సంకల్పించింది.

"పారిశ్రామిక యంత్ర నిర్మాణంలో ఔన్నత్యం పొందిన పశ్చిమయూరప్, కమ్యూనిస్టుల వశమైనట్లయితే, ఆఫ్రికా, మధ్య ఆసియా, తూర్పు ఆసియాలసంపద మనకు దక్కదు. మన మనుగడకు ప్రాణావసరమైన ముడివస్తువులకు మనం దూరమైపోవలసివస్తుంది." అని జనరల్ ఐసెన్‌హోవర్ యూరప్ పర్యటనానంతరం అమెరికాలో నివేదించాడు.

అమెరికా స్వబలరక్షణకు ఫార్మోజా జపాన్లు అవసరమని సమితిలో అమెరికన్ ప్రతినిధి వర్గానికి చెందిన ఎర్నెస్ట్ గ్రాస్ అన్నాడు.

జపాన్ సైనికరక్షణబాధ్యత అమెరికాపై ఉందని, జపాన్‌లోని అమెరికన్ శాంతి సమాలోచన రాయబారి ఫాస్టర్ డల్లెస్ అన్నాడు.

ఇండోచీనాలో పదహారో అక్షాంశాన్ని దాటి దిగువకు చేరితేగాని ఫ్రెంచిసైన్యాలకు ముప్పు తప్పదని మొన్నమొన్నటి వరకూ సలహా ఇచ్చిన అమెరికన్లు, ఇప్పుడు ప్రాణాలొడ్డైనాసరే ఎర్రనది డెల్టాను కాపాడాలని ఫ్రెంచి అధికారులకు ఆదేశమిచ్చారని 'న్యూస్టేట్స్మన్ అండ్ నేషన్' పత్రిక తెలుపుతోంది. "కమ్యూనిస్టు చీనాను మనం జయించాలంటే, ఈ దక్షిణరంగం మనచేతుల్లో ఉండాలి. ఉత్తరోత్తరా ఫార్మోజాలోని చియాంగ్ సైన్యాలను దక్షిణచీనాపై దండయాత్రకు పంపడానికి ఇది అవసరం" అని అమెరికన్లు చెప్పారట. బియ్యాన్ని అపారంగా పండించే బర్మాదేశాన్ని కమ్యూనిస్టుల చేతుల్లో పడకుండా కాపాడే అవసరం తమకున్నదని అమెరికా సూచిస్తోంది కూడా. ఫార్మోజాలోని చియాంగ్ ప్రభుత్వానికి నూరుకోట్ల డాలర్ల సహాయం ఇస్తోంది.

ఇవన్నీ చూసినతరవాత, "చీనాదేశాన్ని చుట్టుముట్టి ఆక్రమించడానికి అమెరికా ప్రయత్నిస్తోంది" అని పెకింగ్ ప్రభుత్వం ఆరోపిస్తున్నదంటే, బ్రిటిష్‌వారుకూడా ఇప్పుడు నమ్ముతున్నారు. కోరియా సమస్యని అమెరికా స్వప్రయోజనం నిమిత్తమే, శాంతియుతంగా పరిష్కారం కాకుండా నిరోధించిందని ప్రపంచానికి స్పష్టమయింది

[సూర్యనారాయణ]

కాంగ్రెస్: తెగని సమస్య

"తుదియత్నం" కాంగ్రెస్ సంస్థలో పుట్టిన చీలికలు క్రమక్రమంగా పెరిగి, సంస్థ నాశనం కాకుండా కాపాడడానికి "తుదియత్నంగా", ఐక్యతావశ్యకతను నిరూపిస్తూ, అఖిలిండియా కాంగ్రెస్ కమిటీ ఒక తీర్మానాన్ని పండిట్ నెహ్రూ ప్రతిపాదనపై చర్చించింది.

ప్రస్తుత సాంఘిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి అభిప్రాయభేదాలకు తావు లేకపోలేదని అంగీకరిస్తూ, అన్నివర్గాల వారూ సహకరించడానికికూడా వీలుందని తీర్మానంలో చెప్పబడింది. ఆహారాది సకల వస్తువుల ఉత్పత్తినీ వృద్ధిచెయ్యడానికి ముఖ్యంగా ప్రభుత్వానిదే బాధ్యతైనప్పటికీ, ప్రజల తోడ్పాటు లేనిదే ఏ కార్యమూ కొనసాగదనీ, ఆ తోడ్పాటు లభించాలంటే కాంగ్రెస్ కమిటీలు కృషి చెయ్యాలనీ తీర్మానంలో చెప్పబడింది. కాంగ్రెస్‌వాదులు అభిప్రాయభేదాల మూలంగా పరస్పర సహకారాన్ని మానుకున్నట్లయితే, ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల తోడ్పాటు ఎలా లభింపచెయ్యగలుగుతారు? కాబట్టి అభిప్రాయభేదాలు ఎన్ని ఉన్నప్పటికీ, కాంగ్రెస్‌లోని అన్ని వర్గాలవారూ సహకారం నేర్వాలని తీర్మానం సూచిస్తున్నది.

తీర్మానాన్ని ప్రతిపాదించిన పండిట్ నెహ్రూ, కాంగ్రెస్‌లో పాక్షిక విరోధాలకి చిన్నవర్గాలే కాకుండా, కాంగ్రెస్ కమిటీలలో పెత్తనం చెలాయిస్తున్న పెద్ద వర్గాలుకూడా బాధ్యులన్నారు. అభిప్రాయభేదాలు వచ్చినా, తగవులు వచ్చినా అంగబలం అధికంగా కల వర్గం చిన్న వర్గాలపైన క్రమశిక్షణ చర్యలుతీసుకోడం, కొందరిని కాంగ్రెస్‌సంస్థనుంచి వెళ్లగొట్టడం పరిపాటయింది. కాని అన్ని విషయాల్నీ మెజారిటీ గ్రూపుల వోటింగ్ బలంతో నిర్ణయించ పూనుకోడంవల్ల, అసలు లక్ష్యాలు కర్తవ్యాలు విస్మరించబడతాయని నెహ్రూ హెచ్చరించారు. వాస్తవానికి కాంగ్రెస్ సంస్థలు ఈ పెడదారులు తొక్కి చాలా దూరం నడిచాయని చెప్పకోవాలి. మొక్కగా ఉన్నప్పుడు వంచలేదు. ఇప్పుడు మానై ఊరుకుంది. అందువల్లనే నెహ్రూ కాని మరొకరుకాని, అన్నివర్గాల వారూ కాని ఎంతచిత్తశుద్ధితో కృషిచేసినా, కాంగ్రెస్‌లో కక్షలనేవి తెగని సమస్యలుగా ఉండిపోతున్నాయి.

కాంగ్రెస్‌లో చేరడానికి ప్రాణాలకు తెగించవలసిన రోజులు దాటిపోగానే, అన్నిరకాలవారూ స్వార్థాశయాలకోసం సంస్థలోకివచ్చి పడ్డారు. కాని సత్యాగ్రహాలలో సర్వం త్యజించి, నీతికీ, దేశభక్తికీ ఆదర్శంచూపిన అనేకమంది వృద్ధనాయకులుండికూడా ఈనాడు కాంగ్రెస్ నిర్జీవంగా ఉన్నదని నెహ్రూ అన్నారు.

ఈ పరిస్థితికి వాపోవడం అనవసరమనీ, తప్పనిసరి అనీ ఆచార్య కృపలానీవాదం. అధికారాన్ని హస్తగతం చేసుకున్నవర్గం సర్వవ్యవహారాల్నీ యథాతథంగా ఉంచడానికే కృషి చేస్తున్నందువల్ల, దేశసమస్యలలో ఒక్కటి పరిష్కారం కావడంలేదని కృపలానీ వాదిస్తున్నారు.

ఇంతకాలానికి ఒక ముఖ్యవిషయాన్ని కాంగ్రెస్‌లో కొందరుపెద్దలు గ్రహించగలిగారు. సంస్కరించవలసినదీ, మరమ్మతు చెయ్యవలసినదీ కాంగ్రెస్ సభ్యత్వనియమావళిని కాదనీ, దేశసమస్యలపట్ల, కార్యక్రమాలపట్ల, రాజకీయాలపట్ల కాంగ్రెస్ నాయకుల వైఖరినే అనీ గ్రహిస్తున్నారు.

వారసత్వం. కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశసమస్యల్ని పరిష్కరించలేకపోడానికీ, తమతమ కార్యక్రమాల నిర్వహణంలో ప్రజల తోడ్పాటును పొందలేకపోడానికీ హేతువుల్ని కనిపెట్టడంకోసం ఆర్థిక శాస్త్రవిదుల్నీ, సంఘనీతినీ తరిచేముందు, వాస్తవంగా ఈనాడు పాలనాధికారం ఎవరిచేతులలో ఉందో కనిపెట్టాలి. పరిపాలిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వాలు కాదనడంలేదు. కాని కాంగ్రెస్‌లోకి పిలపిలా వచ్చిచేరిన సమూహంలో ఏ వర్గాలు అధికారం చెలాయిస్తున్నాయని చూడాలి

నేటి స్వతంత్ర భారతదేశంలో, కాంగ్రెస్ పరిపాలనవల్ల లబ్ధిపొందనవారెవరు? ఇదివరలో లేని సుఖసంపదల్ని అనుభవిస్తున్న వారెవరు? ప్రజాసామాన్యానికెటువంటిలబ్ధీ కలగలేదన్న సంగతి అందరికీ తెలిసినదే. వ్యాపారులు, పారిశ్రామికులలో కొన్నివర్గాలవారు, టోకువర్తకులు, చిల్లర వర్తకులు యావన్మందీ తమతమ సంపదల్ని వృద్ధిచేసుకున్నారు. క్రమక్రమంగా భూములు, ఇళ్లు, వెండి బంగారాలు అన్యుల వద్దనుంచి వారివద్దకు చేరుకున్నాయి. ఇంక కాంగ్రెస్ కమిటీలలోనూ, శాసనసభల్లోనూ చేరినవ్యాపారులు, వర్తకులమాట చెప్పనక్కరలేదు. వర్తకవ్యాపారాలతో సంబంధం లేని శాసనసభ్యులు, మంత్రులలోకూడా బాగుపడినవారు లేకపోలేదు.

ఏ వూరు వెతికినా, ఏ రాష్ట్రప్రభుత్వాన్ని చూసినా, ఎవరిమాట చెల్లుతున్నదో గమనించినట్లయితే, మనకి ఒక్క విషయం బోధపడుతుంది. సత్యాగ్రహాల కాలంలో దేశౌన్నత్యంగురించి కలలుగన్న వారొక్కరూ లేరని స్పష్టపడుతుంది. ఇతరులువచ్చి అధికారాన్ని హస్తగతం చేసుకున్నారని విశదమౌతుంది.

దేశంలో వస్తూత్పత్తి నానాటికీ తగ్గిపోతున్నప్పటికీ, వర్తక వ్యాపారుల లాభాలు బలుస్తున్నాయి ప్రజల జీవనం నానాటికి హీనమౌతున్నది.

అంటే దీనిఅర్థం దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాలున్నప్పటికీ, వాస్తవంగా ఆర్థికరంగంలోగాని, రాజకీయరంగంలోగాని అరాచకస్థితి ఏర్పడిపోయిందన్నమాట, లేదా ప్రభుత్వాల్ని వాస్తవంగా నడిపిస్తున్నవారు వర్తకులు, వ్యాపారులై ఉండాలి.

కాంగ్రెస్ ప్రభుత్వాలు శాసనాల్ని తేగల తంపరగా తయారుచేసి పోస్తున్నాయి. ప్రభుత్వాజ్ఞలు, ఉత్తరువులు, నియమ నిషేధాలు వరదలైవచ్చి ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కాని ఇవేవీ స్వార్థాశయపరుల్నీ, అవినీతిపరుల్నీ నిరోధించలేకున్నాయి. అంటే శాసనాలలో బలం లోపించి ఉండాలి - లేదా వాటిని అమలు జరపవలసిన వేలాది ప్రభుత్వోద్యోగులు అసమర్థులై ఉండాలి.

పాలనాధికారం గాంధీజీసిద్ధాంతాలను అనుష్ఠించే వారి చేతుల్లో లేదన్నది నిర్వివాదాంశం. దేశంలోని వస్తుసంపదని సర్వవర్గాలకూ అందే వ్యవస్థ స్థాపించగోరే వారి చేతుల్లో లేదు.

(46-వ పేజీ చూడండి)



కాలంతో పాటు

రామదాసు ఎప్పుడో దేశభక్తుడు కావల్సింది! ఆ 'ఎప్పుడో' అయ్యాడనే నేనూ అనుకోవటం. కాని కాలేదని కొందరంటున్నారు. గనుకనే 'ఎప్పుడో' కావల్సిం దన్నాను. ఈ అంటానికి ఆయన సలహాగూడ వుందిలెండి! ఆయనా అంగీకరించాడు. కాలంతోపాటు అర్థాలుగూడ మారిపోతాయిగావాలు తగలడి నాకేం తెలుసు మరి! మారకపోతే అంత తెలివితక్కువగా ఆయనమాత్రం ఎందు కంగీకరిస్తాడుగనుకా? నలుగురి కెదురునిలవటం కార్యసాధన కాదనుకున్నప్పుడు నలుగుర్లో కలిసి ముందు నిలబడగలిగిన ప్రతిభ ఆయన్లో వుంది. వేడిపాలల్లో మజ్జిగచుక్క కల్సిపోతాడు! వాళ్లని మెదలంట విరిచేసి తను అనుకుందేదో సాధించి తీర్తాడు. కాలంతో పాటు సాగేవాడు రామదాసు! ఈ సాగటం ఒకప్పుడు కుంటుపడిందని కొందరంటారు. ఆయన సలహా మీదే ఎందుకైనా మంచిదని, నేనూ అన్నాను కుంటుపడిందని. దీర్ఘదర్శి! పైగా కాలంతోపాటు సాగిపోవటం నేర్చినవాడు రామదాసు!! ఆయన సలహా పాటించకుండావుండటం ఎవరికి మాత్రం ఏమంత మంచిది? ఎవరికీ మంచిది కాదనుకున్నప్పుడు నాకుమాత్రం ఎలా అవుతుంది మంచిదీ? అందులో ఆయన చేతి క్రిందివాణ్ని! మోచేతిక్రిందివాణ్నే అన్నా పర్వాలేదు వున్న విషయం గనుక!

నిజం చెప్పాల్సివస్తే కాలంతోపాటు సాగటం, మారటం వేరు వేరు! ఆయనెప్పుడైనా కాలంతోపాటు సాగాడేగాని మారలేదు. ఈ మారటం అంటే మాటలా? అడ్డంకు లనేకం! లాఠీదెబ్బలు, నిరసన వ్రతాలు, సత్యాగ్రహాలు, జైళ్లు, వురికంబాలు! సిమెంటుగోడ్డప్రక్కన అలా కనిపిస్తూవుంటే కావాలని ఎవరు పడతాడు గనుక ముళ్లబాట, రామదాసు పడటానికి? పోనియ్యి అలా పడదామన్నా, అదంతా దేశభక్తేనని ఆరోజు సర్ ఆర్థర్ హోప్ గారనలేదు. అధికారంలో లేనప్పుడు అరవై అరంటారు ఎవరైనా! అవన్నీ చెవికెక్కించుకుంటే ఎలా? అందుకే కాలంతోపాటు సాగాడు రామదాసు! ఆరోజు వార్ కంట్రాక్టులన్నీ రామదాసుపేరే మంజూరు చేయగలిగిందంటే ప్రభుత్వం, అది యీ సాగటం విశేషమే!

రచన:

శ్రీ పినపాల వెంకటేశ్వరరావు

పోనీ కాలంతోపాటు మారదామని యీరోజు రామదాసు తీర్మానించుకుందామనుకున్నా, ఇవ్వాళ ఆ అర్థం మారిపోయిందని చెప్పనే చెప్తూవుండిరి. ఎవరో చెప్తే రామదాసు వినేవాడా? ఆ రోజు సాక్షాత్తు 'అరవై ఆరు' అన్నవాళ్లే చెప్తూవుండిరి! పెడచెవిని పెడదామన్నా - ఏమన్నా అధికారంలో లేనివాళ్ళా? విన కేంజేస్తాడు పాపం రామదాసు! వీటి దుంపతెంచుకొని కాలంతో పాటు అర్థాలే మారిపోతూ వుంటే! ఇక రామదాసు కాలంతోపాటు సాగక ఏం జేస్తాడు చెప్పండి పాపం; చస్తాడా?

రోడ్లు లేని మారుమూలప్రాంతాలకుగూడ రోడ్లు పడిపోతున్నాయి. బస్సులు తిరుగుతున్నాయి. ప్రయాణసౌకర్యాలు అవిచ్ఛిన్నంగా సాగిపోతున్నాయి. ఇవన్నీ యిలా సాగిపోవటానికి కారణం రామదాసు కాలంతోపాటు సాగిపోవటమే! మారుమూలపల్లెల్లోగూడ పోలీస్టేషన్లు వెలిశాయంటే, పల్లెలుగూడ ఎర్రబుట్టల్తో పట్టణాల్లాగ కళకళ్లాడుతున్నాయంటే అదంతా వారి సేవే! ఒక మంత్రిగా యిప్పుడు వారి సేవకి మనం నోచుకోలేకపోయినప్పటికి వారి సేవాఫలం మనం అందరం చవిచూస్తూనేవున్నాం. వారిసేవకి రాబోయే ఎన్నికల్లో అయినా వార్ని వుచితరీతిని సత్కరించాల్సిన బాధ్యత మనయందున్నదన్న విషయం ఎవరూ విస్మరించరన్న నమ్మకం నాకుందని వేరే చెప్పాల్సిన అవసరం అట్టే కన్పించదు! నీడల్లే ఆయన్నంటిపెట్టుకునుండే నాకు, ఆయనచుట్టూ ఎరిగిపోయే ప్రజలమన్ననల్ని ఆయన ఎంతగా పొందుతున్నాడో ఒకళ్లు చెప్పాలా? ఓరోజు ఆయనిచ్చిన డిన్నర్లో ఆయన త్యాగాన్ని కోటయ్య ఎన్నివిధాల పొగిడాడు: 'ఆ జైలు మొక్కుగూడ తీరినట్లయితే రామదాసుగారు ఓ మంత్రి అయేవారంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం అట్టే లేదు!' అనిగూడ కీర్తించాడు. కోటయ్య ఎవరికి వాళ్లే యిది ప్రజాభిప్రాయం అని ప్రకటించుకునే యీ రోజుల్లో వెనకబడ్డ జాతులు బ్రహ్మరథంపడుతున్నారని చెప్పుకుంటున్న కోటయ్య అభిప్రాయం ప్రజాభిప్రాయం కాకుండా ఎలాపోతుంది? కోటయ్యరుణంమాత్రం వుంచుకున్నాడా రామదాసు? రూట్ యిప్పించటంకోసం ఆయన శాయశక్తులా పడ్డాడు. వెనకబడ్డ జాతులకి నాయకుడనిగూడ బొంకాడు. "కోటయ్యని కట్టుకోకపోతే ఎలా, రాబోయేది ఎన్నికలు-ఏడ్చి వయోజనువోటింగై ఆలోచించండి-" అని గూడా పాపం రామదాసు మంత్రిగారికి హెచ్చరిక చేసివచ్చాడు మద్రాసుదాక పోయి! తిరుగు టపాలోనే కలెక్టర్‌గారికి హుకుం! ఏదైనా పనిగావాలంటే రామదాసుగారే తలపెట్టాలని మరి వూరికే అంటారా నలుగురు? అది ప్రజాభిప్రాయం. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకం ఏముంది గనుక?

ఓరోజు ఏదో మాటలసందర్భంగా వచ్చి "ఏవో నాలుగు బస్సురూట్లు, నాలుగు కంట్రాక్టులు నాపేర మంజూరుచేసిందే అనుకో ప్రభుత్వం; అంతమాత్రాన మన కొరిగిందేముంది చెప్పండి మీకు తెలియకుండ"" అన్నాడు రామదాసు పీలుస్తున్న హుక్కా ఆపి, నా కళ్లల్లోకి జూస్తూ, పడకకుర్చీలో పడుకొని లేస్తూ.

"వొరగటాని కేముందిలెండి నాకు తెలియకుండ" అని, చేతిలో పత్రిక తిరగేస్తూ "వచ్చే మంత్రులకి, పొయ్యే మంత్రులకి డిన్నర్లతో సరిపెట్టుకుపోతూవుంటే - ఆ వెనక కూడబెట్టుకున్న దేదో వూడకుండా వుంటే వొరిగినంత ఫలం" అన్నా.

"అంతే, అంతే-మాబాగా అన్నావ్." అన్నాడు రామదాసు లేని నవ్వు తెచ్చుకొని.

బాగా అనకుండా వుంటం మన వునికే ప్రమాదం!

"ఏమండోయ్!వీడి తలపొగురు చూడండి ఏమి రాస్తున్నాడో మిమ్మల్ని గురించి—" అన్నా.

'రామదాసుగారి జన్మపురాణం' అన్న శీర్షిక ఏదో భద్రాచల రామదాసుదేమో నని యూదాలాపంగా పత్రికలో చదువుతూ.

"ఏదేది ఏమి రాశాడో చదవండి—" అన్నాడు రామదాసు మొఖంలో కండల్ని అలలు తేలుస్తూ.

చదవసాగాడు: రామదాసుగారిలాంటి స్వార్థరహితు లుండబట్టే దేశం రోజాఅల్లే శాయములేని యిరుసుమీద తిరుగుతూ వుంటం! సేరు రూపాయి ధర-రైతుకే గిట్టుబాటయేట్టు చూట్టం!

"ఆపండి, ఆపండి-" అన్నాడు.

ఆపాను.

"అక్కడ స్వార్థరహితు లంటాడు-" అన్నాడు రామదాసు.

"అదా—అది వ్యంగ్యంలెండి. అంటే మాటలు తియ్యగా వుంటయి. అర్థం విపరీతం—"

"అదా! ఏడ్చాడు. వెధవ తెలివితేటలు వాడూను" అన్నాడు పత్రిక నాచేతుల్లోంచి తీసుకుంటూ.

మొహం మరమేకల్లే పెట్టి "ఏవో నాలుగు కారుకూతలు పత్రికల్లో రాయంగానే సరిపోతుందీ? ఈ రూట్లకని, కంట్రాక్టులకని, డిన్నర్లకని ఎంత డబ్బు, ఎంత డబ్బు తగలేసింది? ఈనాడు వదిలేస్తాను. ఆ మగాడెవడో వచ్చి నిర్వహించమను చూస్తాను. అది చేత గాదు-" అన్నాడు రామదాసు పత్రిక విసిరికొట్టి.

వారి ఆగ్రహం ఎలాంటిదో నాకు తెలుసు. అలాంటప్పుడు సరైన సలహా చెప్తేనే మనచేతులు తడయ్యేది.

"ఎవడొస్తాడండి? మాటలకి,వాటికి పేదరిక మేముందీ?మాన్నష్టందావా పడేస్తే సరి, చమ్చారుకుంటారు వాళ్ల బ్రతుక్కి. వాళ్ల దేముంది వదిలెయ్యండి. యీ ఎక్కిన మంత్రుల్లో ఒక్కడికుందా అంట - ఇంత పెట్టుబడి పెట్టగలిగిన సత్తా-పేరు కింగను వున్నయి పదవులు ఆహారశాఖామంత్రని, కరువుశాఖామంత్రని!" అన్నా ధీమాగా.

"అనగూడదు గాని, యిందులో ఎంత మందికి ఎన్ని వాటాలు? పాపాలకల్లా భైరవుడిలా నేనొకణ్ణి వున్నానని అడ్డమైన వెధవల్లా అన్నీ నా నెత్తినే రుద్దేస్తారు" అన్నాడు రామదాసు పడకకుర్చీలో జేరగిలబడి.

"ఆ ధాన్యంసంగతి అలాగే రాశారా, రైతులకిద్దామని తెచ్చిన బండిపట్టాలసంగతీ అంతే అయిందా" అన్నాడు తిరిగి.

మాట్లాడుతున్నా మనస్సులో అనేకమైన వూహాలు అలలల్లే బయలుదేరాయి. ఇరవై సంవత్సరాలనుంచి ఆయన కొలువు చేస్తున్న నాకే వాటా లేదు! ఇంకొకళ్లకుందంటే ఆయన తత్వం తెలిసినవాడెవడూ నమ్మడన్న విషయం తిరిగి చెప్పాల్సిన అవసరంగూడా లేదు. అసలు ఆయన చెప్పటంగూడ నమ్మటంకోసమే చెప్పడు. మంత్రులకి డిన్నర్లు చేస్తే గుల్లయిపోతాననే నమ్మకం ఆయన కేమాత్రం లేదు. నాకుందని కాదు. నే నన్నానంటే అంటంకోసమే అన్నా. ఐతే యింత గట్టిగా ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే గుల్లయిపోయే విషయాలజోలికి ఆయ నెప్పుడూ జారడుగనుక. ఆ విషయం నాకు బాగా తెలుసుగనుక అన్నా. ఆకాలంలో తెల్లగవర్నర్లకి డిన్నర్లు చేస్తే పాతిక లక్షలదాకా మూలిగాయని వినికిడి! లక్షలు మూలగటానికి యీ డిన్నర్లకి ఏదో సంబంధం—రంకులాంటిదే ఏదో వుందని రామదాసు ఆకాలంలోనే గ్రహించాడు! ఈ మధ్య అడ్డమైన మంత్రులకల్లా ఆహ్వానాలే!! వ్యక్తులిచ్చే అహ్వానా లందుకోవద్దని యీ మంత్రు

లకి ఎవరో విజ్ఞప్తి చేసినట్లుగాగూడ పత్రికల్లో ఎక్కడో చదివినట్లుగా గుర్తు. అయినా మన మంత్రులు వీటన్నిటినీ లక్ష్యపెట్టేంత అల్పులా? రామదాసు అతిధ్యాన్ని వొచ్చినప్పుడల్లా అందుకుంటూనే వున్నారు!

"కుక్కలు అనేకం మొరుగుతాయి ఏనుక్కేం?" అన్నా వారి రేవిని కళ్లకి గట్టినట్లు చూపుతూ.

"అంతే, అంతే" అన్నాడు రామదాసు.

"ఇదంతా ఎందుకు? అసలు ఆరోజు ఆ ప్రతిబంధకాలే లేకపోనూ-మీరూ కాలంతో పాటు మారిపోయేవుండేవారు. ఈ రోజు ఓ మంత్రయినా అయివుండేవారు. మీరు కాలేదంటే అదంతా మా దురదృష్టం!" అన్నా.

"అంతే, అంతే" అన్నాడు. ఏదో యాదాలాపంగా వుంది. "ఆఁ ఆఁ ఏమన్నారు, మంత్రి నయేవాణ్నే నంటారా?" అన్నాడు తిరిగి తెప్పరిల్లుకొని.

"అయ్యేవాణ్నా అని చిన్నగా అంటారే-అయ్యేవారా అయితీరేవారా?" అన్నా చేతిలోని వొంకికర్ర నేలమీద గట్టిగా కొట్టి.

"ఆ మంత్రిగా గున్నారే-మొన్నొచ్చినాయన-పాపం అప్పుగు 'ఫ' క్లాసు యిప్పిస్తానని ఎంతగా పోరుకులాడాడనీ. పోయినట్లయితే ఆ మొక్కకూడా తీరిపోయేది. వీటి దుంప తెంచుకుని ఎక్కడలేని వార్ కంట్రాక్టులన్నీ నా నెత్తినే రుద్దికూర్చుండిరి. నాటినుండి బయటపడటం ఎంత కష్టమైందో మీకుమాత్రం తెలియందా ఏమండి?"

"అమ్మో! ఎంతమాట, ఎంతమాట! నాకు తెలియకపోవట మేముందిలెండి ఇందులో! ఈసారి కేదో పోయిందిగాని, ఎన్నికలు దగ్గరబడుతుండె. యీసారి కాకెక్కడికి పోతారూ!"

"అవుతా నంటారు."

"అవుతారా, అయి తీరతారా! ఈ సారయినా మిమ్మల్ని మంత్రిని చేసుకోకపోతే వాళ్ల గతులు కుక్కలుగూడ పడవంటే నమ్మండి. ఐదు వేల బస్తాలు-యిచ్చే రేషన్ చాల్లేదని ఎగబడితే-యీ నెత్తిమీటలకే కొల్పామే - కొలిస్తే వచ్చినదే అనకోండి ఏదో మాటవరసకి ఓ పాతిక వేలు! 'నెగవ డబ్బులు పోతే నేమయ్యా - ఎనిమిది గిద్దల కాడి కయితేమటు కేమయ్యా - ప్రాణాలు నిల్పాడని'- ఎంతమంది మీ పేరు చెప్పుకోవటం! ఈసారయినా మిమ్మల్ని మంత్రిని చేసుకోకపోతే-ఇదిగో యిప్పుడు చేసుకున్న వాళ్లతో సుఖపడుతున్నారుగా - అంతే!"

"కాని ఒక్కొక్కళ్లు అనేమాటలు వింటుంటే వొళ్లు మండిపోతుందంటే నమ్మండి. యాటంబాంబుకి అమెరికా అర్ధరివ్వాలనిగూడ అనిపిస్తుంది!"

"అంతపని జేసేరు కొంప ముంచి. కొత్తనీళ్లతోపాటే పాతనీళ్లు, వాళ్లతోపాటే మనమూ, మన పెట్టుబడి, మన మంత్రిపదవులూను. సరిపడని వాళ్లనేకం అంటారు. అవన్నీ వినిపించుకుంటే ఎలా. వాళ్ల పనేదో అమెరికాయే పడుతుంది. చూస్తూవుండండి! వాళ్ళందర్నీ ఒకచోట జేర్చి ఎలాగు యాటంబాంబు ప్రయోగించితీరుతుంది! ఒకచోట జేరటానికే యింతవరకూ వేచివుంది అమెరికా! చైనాని ఎప్పుడో జేర్చిందా? మిగతా దేశాల్ని త్వరలోనే జేర్చేస్తుంది. రష్యాని బలపర్చేవాళ్లు ప్రతిదేశంలోనూ వుంటమే పెద్ద చిక్కయిపోయింది. ఇంతాలశ్యానికి కారణంగూడ అదే. ఏదేశంలో అయినా వాళ్లని ఎక్కడికక్కడ విసిరేసి యాటంబాంబు ప్రయోగిద్దామంటే వీలుపడకనే-ప్రతిదేశం పూర్తిగా రష్యాతరఫున చేరిపోయేదాక వేచివుంటే-అప్పుడు ఒక దేశమే వుంది చూడండి - అందర్నీ ఒకచోట జేర్చినట్టుగా-ఎక్కడికక్కడ విసిరేసే పనిగూడ లేకుండ ప్రయోగించవచ్చునే అమెరికా యింతవరకూ వేచివుంది! అన్ని కోట్ల డాలర్లు ఖర్చు పెట్టిన యాటంబాంబుకి ఆమాత్రం మర్యాద జరక్కపోతే అమెరికా ప్రతిష్ఠకే భంగం కదండి!"

"హాఁహాఁ ఏమండి వాడి కుబేరనీతి!"

"మన నీతి తక్కువ దంటారు? ఈ ఎన్నికలే దగ్గరపడనియ్యండి. అమెరికావాడి ఎత్తులు మనముందు ఓ ఎత్తులా అని మీనోటి మీదగనే అనకపోతా రేం చూస్తాను!"

"ఎన్నికలంటే జ్ఞాపకం వచ్చింది— మనం కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడటానికి పార్లమెంటరీబోర్డు వొప్పుకుంటుం దంటారా మరి? అమెరికాని తలదన్నే మీ నీతి ఏమిటో యిప్పుడే చూస్తాను!"

"అలా అన్నారు బాగుంది. వొప్పుకోకపోతుందీ, దాని గురదృష్టమనుకోనేది. పోతే కాంగ్రెస్ పేరే పారేసేది! ఏ కాంగ్రెస్ అన్నా మనం అనుకున్న ప్రకారం చెల్లించినపుడు మనం గెలవటం ఖాయంగదా!"

"అసలు పార్లమెంటరీబోర్డు ఎవరి పలుకుబడిలో వుంటుందా అని"

"ఎవరి పలుకుబడిలో వుంటే వాళ్లనే బలపరుద్దాం. మన ఎత్తు పారిందా మిమ్మల్నే నియమిస్తుంది. నియమించరూ, మనం అనకోనే అనుకున్నాం. గెలవటమే ఖాయమైనపుడు, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీలో జేరటమే ఖాయం. జేరటమే ఖాయమైనపుడు మంత్రిగా రావటమే ఖాయం. మనం ఎన్ని కాంగ్రెసుల్లో దూరినా స్వప్రయోజనం లేకుండా దూరం గదా. పోటీకాంగ్రెస్ పెట్టినా అందుకే. లెజిస్లేచర్ పార్టీలో తిరిగి జేరినా అందుకే! కొంపముంచి దగ్గర్లో ఎవరూ లేరుగదా?" అన్నా అటుయిటు జూస్తూ.

తెల్లవాళ్లు తట్టబుట్ట కట్టేస్తారనే నమ్మకం నిశ్చయమైంతరువాత ఎన్నికల కార్యక్రమానికి రంగాగారు ఓ రోజు ఆ గ్రామం రావటం తటస్థించింది! వారికి విందు చేశాడు రామదాసు. బహిరంగసభలో వారి త్యాగాన్ని వేనోళ్ల పొగడాడు. ఈనాటినుండి సర్వసంగపరిత్యాగం చేసి నేను నా పరివారంతో పాటు కాంగ్రెసులో చేరిపోతున్నానని ఆవేశంగా ఆనందబాష్పాలు గురిపించాడు. ఆరోజున రంగాగారు పట్ట సంతోషానికి అంతంటూ లేదు. ఆత్మపరివర్తన అని ఆయన్ని స్తుతించాడు. కాంగ్రెస్ లోకి స్వీకరించా నన్నాడు. తన జన్మ పావనమైం దన్నాడు ఆరోజు రామదాసు.

కాలంతోపాటు సాగలిగినవాడు గదా రామదాసు ఎంత చెడ్డా? ఈసారి ఆ లెజిస్లేచర్ పార్టీలోనే ఆరోజు వస్తే అలాటిదే ఓ చిన్న వుపన్యాసం యివ్వలేకపోడు! ఆత్మపరివర్తన అని తిరిగి ఎవరో అనకా మానరు. దాన్ని బలపరచకా మానరు! ఇక ఆయన దేశభక్తుడు కాడని ఎవరుమాత్రం ఎలా నిర్ణయిస్తారు? అసలు యిదంతా ఎందుకు-ఆరోజు ఆ వార్ కంట్రాక్టులే లేకపోతే-గుర్దినట్లు రైలుకెల్లిన ముద్దర వుండనే వుండేది - ఈపాటి జేంది - ఆ రోజే అయేవాడా? కావటం పూరికే దేశభక్తుడా, విప్లవకారుడే అయేవాడు. ఆ సంఘటనలు చెప్పాలంటే నాతల్లో పేలన్నీ చెప్పొచ్చు. వెంట్రుకలకంటె తల్లో పేలే ఎక్కువ ఉన్నాయనే నమ్మకం నాకు.

ఓరోజు కార్లో వెళ్తున్నాం రామదాసు, నేను. ఓ పెద్ద వూరేగింపు బజార్లు పోర్లి

ప్రవహిస్తూవుంది. ఎక్కడ జూచినా మూడు రంగుల జండాలే. ఆ నినాదాలకి భూనభోంతరాలు దద్దరిల్లి పోతున్నాయి. రోమాలు నిక్కపొడ్చాయి నాకుమట్టుకు నాకు. మా కారు ముందుకు పోయే మార్గం కన్పించలేదు. ఓ మూల ఆగిపోయింది కారు. మా కళ్ళెదుటే లాఠీచార్జీలు, ఫైరింగులు జరిగిపోయాయి. ఎక్కడి జనం అక్కడే అదృశ్యమైపోయింది.

ఎవరో మఫ్టీలో వున్న పోలీసుఇన్స్పెక్టర్ రామదాసుగార్ని జూచి శల్యూట్ జేసి కారుదగ్గర కొచ్చి ఆగాడు. బహుశ కారుపోయే మార్గం చూపెట్టటానికే నేమొ!

"ఆఁ యిలా బజార్న బడి అరుచుకుంటే ఏమొస్తుంది" అన్నాడు కార్లో వుంటే రామదాసు మఫ్టీతో.

"అంతే, అంతే. ఉత్త పిచ్చిగాకపోతే ఏమున్నా వుపయోగం వుందీ దీనివల్ల" అని, తిరిగి మోతాదుతోనే "అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకోవటంమాత్రం కనిపిస్తుంది! తిరగబడితే తుపాకులు తీసుకొని తిరగబడాలి. ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవాలి. అంతేగాని యీ రకంగా బజార్న బడి గావుకేక లేసుకుంటే ఏమొస్తుంది?" అన్నాడు మఫ్టీ రామదాసు మొహంలోకి జూస్తూ.

"అంతే, అంతే. యీరకంగా ఏమొస్తుంది? నీవన్నట్లు తుపాకులు తీసుకొని తిరగబడితేనే ఏమన్నా ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకుంటే—ఈ రకంగా వచ్చేది నా ఒగాడిదే" అన్నాడు రామదాసు.

మఫ్టీతో ఆయనలా మాట్లాడటం నిజంగా నాకు భయంవేసింది. కారు సాగింది. "మీరలా మాట్లాడారని రిపోర్టు చేస్తాడేమో లేనిపోయింది?" అన్నా సందేహిస్తూ.

"వస్తే దెవరు?" అన్నాడు రామదాసు.

నిజంగా రామదాసు అన్నాడంటే నమ్మటం కష్టమే!

"మరి మీరలా ఎందుకన్నట్లు నిజంగా?" అన్నా తిరిగి.

"ఎందుకేముంది? తిరగబడితే సరిగా తుపాకులు తీసుకు తిరగబడాలి. లాఠీ ఆడితే పారిపోయే ఆ వీరుల్ని చూశారుగా? ఈ గాంధీవాదంతో నటయ్యా వచ్చేది స్వతంత్రం? మంత్రాలకే చింతకాయలు రాలితే యిక అయినట్లే!" అన్నాడు అసంతృప్తిగా.

ఆ ఒక్క సంఘటనే చాలు ఆయన్ని విప్లవకారుడంటానికి! ఒక్క జైలు కెళ్లని లోటు దప్పితే ఏ లోటూ ఆయన్లో లేదు. మిగతా ఏ కాంగ్రెసువాడికి ఆయన వేషభాషల్లో తీసిపోడు. ఖర్చుపెట్టవలసివస్తే రెండుచేతులా ఖర్చుపెట్టగలడు. ఇదే అందరికంటె ఆయన్లో ఎక్కువగా వున్న సుగుణం! ఈ మధ్య తుఫాను వచ్చి అవస్థలు పడ్డవాళ్లందరికి దగ్గరుండి చందాలిచ్చి వచ్చాడు రామదాసు రాబోయేవి ఎన్నికలు గదా అని! కంట్రాక్టు చేసి వేయించిన రోడ్లా అనేకం యీ కాంగ్రెస్ ప్రభుత్వహయాంలోనే. మారుమూలపల్లెలకిగూడ బస్సులు తిరుగుతున్నాయంటే అది వారి పుణ్యమే. పల్లెటూళ్లలోగూడ పోలీసుస్టేషన్లు వెలిశాయంటే అది వారి ప్రకటన్ల ప్రభావమే. హరిజనులు సాగుజేసుకుంటున్న బంజర్లు ఏమైనా రాజకీయబాధితుల చేతుల్లోకి పొయ్యాయంటే అది వారి పలుకుబడే!

ఇంత త్యాగానికి వారు కోరుకుంది ఓ మంత్రిపదవి! బహుముఖాలయిన వారి సేవను చవిచూసిం తరువాతైనా—యిప్పుడు కాదనుకో — వచ్చే ఎన్నికల్లోఅయినా వారికి తగిన మర్యాద జరక్కపోతే వాటి పాట్లు అనుభవించేదీ మనమే అన్న విషయం మర్చిపోరనుకుంటాను! మంత్రిపదవిమీద యీ ఆకాంక్షయినా దేశానికి సేవచెయ్యాలనే గదా!

ఓ రోజు మాటలసందర్భంగా కమ్యూనిష్టుల ప్రస్తావన వస్తే "ప్రభుత్వంమీద సాయుధతిరుగుబాటు చేస్తే మాడ్చేయక ఏం జేస్తుంది?" అన్నాడు వుగ్రుడై. "వాళ్లకేదయినా కార్యక్రమం వుంటే గాంధీగారి మార్గాన్ని అనుసరించి సాధించుకోమను. ఎవరు కాదంటారు?" అన్నాడు తిరిగి రామదాసు.

"నిజం అంతే!" అన్నా ఆలోచించకుండ.

చింతకాయలు రాల్చటానికే గులకరాళ్లు కావాలే, మరి ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకోను మంత్రాలు ఎలా పనిజేస్తాయా అనిపించింది లోపల! అనిపించినా ఆలోచించాల్సిన పని నాకు అసలు లేదు!!

కొలువు చాలించి బయలుదేరా....

వాకిట్లో కుక్క మొరిగింది!

ఆగి, "జాగ్రత్తగా వుండండి చీకటి కాలం!" అన్నా.

గుడ్లగూబ కూసింది ఎక్కడో...

కుక్కలు మొరుగుతూనే వున్నాయి తెల్లవార్లు......

* * *

కాలంతోపాటు సాగ్గలిగినవాడే మరి రామదాసు! కాని యీ సాగటం ఎల్లకాలం ఒకే స్వరూపంలో సాగదని పాపం రామదాసు అనుకున్నాడా? రామదాసు కాలంతోపాటే సాగాడు — కాని భేదమల్లా స్వరూపంలోనే!

———

గతుకుల దారి

టేకుమళ్ల కామేశ్వరరావు

3

ఆమె చెప్పింది జాగ్రత్తగా విన్నాడు సీతామనోహరుడు. అతనికి ఉపన్యాసాలలో సామాన్యంగా అనుభవానికి వస్తూన్న ఒక విషయం స్ఫురణకి వచ్చింది. "నేను కూడా ఒక చిన్న సంగతి చెప్పతాను వింటారా? ఒక పెద్దమనిషి బల్లగుద్ది ఏది గట్టిగా చెప్పితేఅది నమ్ముతారు ప్రజలు" అన్నాడు.

"నేను ప్రజలు అనడంలో విద్యా విహీనులైనవారిని అందులో చేర్చడం లేదు. ప్రజానాయకులని, విచక్షణాపరులైన మనుష్యులని వీరినే ముఖ్యంగా ప్రజలని పరిగణిస్తున్నాను" అంది.

"అయితే వీరేశలింగంగారు చెప్పినట్లల్లా ప్రజలు ప్రవర్తించేరనే మీ అభిప్రాయమా?" అన్నాడు సంఘసంస్కర్త.

"అబ్బే! అదేంతమాత్రము కాదు. ఒక మనిషిగొంతుక ఎంత గట్టిగా చించుకొన్నా ప్రజలు వింటారుగాని తటాలున మనస్సుకి పట్టించుకోరు. దానివల్ల మంచికి మంచీ ఉంది, చెడ్డకి చెడ్డా ఉంది. మంచిది వెంటనే గ్రహించి ఆచరించకపోడంవల్ల నష్టం లేదా? చెడ్డది వెంటనే ఆచరించక పోడం లాభమే అనుకోండి. అది అలాగు ఉంచండి. దానికి మళ్లీ కారణ మేమిటంటే ఒక కొత్తభావం అదివరకున్న భావాలతో సర్దుకోకుండా మనిషి సర్వసామాన్యంగా ఆచరించడు. అందుచేత ప్రతివిషయం కొంతకాలం తీసుకోక తప్పదు. అది మనుష్యస్వభావం" అంది.

దానికి తానే నిదర్శనమని సీతమనోహరుడు మనస్సులో భావించుకొన్నాడు.

ఒక పెద్ద జడివాన కురిసి వెలిసినట్లుగా పాపారావు తలపోశాడు. జయంకోసం ఆగుర్దాపడుతున్నాడు.

సీతామనోహరుడు "ఇది మనస్సులో జీర్ణమవడానికి కొంత వేళ కావాలి, కాబట్టి దీనినిగురించి వాదన మనకి వద్దు. ప్రస్తుతం ముఖ్యమైన అంశాన్ని తెలుసుకొందా" మని ఆలోచించి, పైకి "వితంతువివాహాలని గురించి మీ అభిప్రాయ మేమిటి?" అని సూటిగా ప్రశ్నించాడు.

ఇంతసేపటికి మనకి సంబంధించిన ప్రశ్న వచ్చిందికదా అని పాపారావు ఒక దీర్ఘ నిశ్వాసం తీశాడు. నోరుతెరుచుకు కూర్చున్నాడు.

పార్వతమ్మ "లోకంలో ఆ సంస్కరణ బహుమతమైనది. వీరేశలింగంగారి కాలంలో బాల్యవివాహ దురాచారకారణంగా బాలవితంతువులు అధికంగా ఉండేవారు. కాబట్టి అప్పటిలో ఆ సంస్కరణకి కొంత అవకాశం కలిగింది. ఇప్పుడు ప్రభుత్వశాసనంవల్ల బాల్యవివాహాలు ఇంచుమించుగా రూపుమాశాయి. కాని వయస్సు వచ్చిన, వయస్సు మీరిన వితంతువులు ఎప్పుడూ ఉండనేఉంటారు. లోకంలో అట్టివారిలో ఇష్టపడినవారు సాహసించి వివాహం చేసుకోవచ్చు. కాని అది తప్పనిసరి అని భావించే సంస్కర్త వట్టి మూర్ఖుడు," అంది.

తన మిత్రుడు ప్రశ్న వెయ్యడం, జవాబుగా పార్వతమ్మ ఉపన్యసించడం చూడగా పాపారావుకి తాను ఎదురు చూస్తూన్న విజయం సందేహాస్పదంగా కనపడింది.

"అలాగు అనకండి! అది చాల అవసరం" అని సంఘసంస్కర్త తన స్థిరాభిప్రాయం వెలువరించాడు.

పార్వతమ్మ "పిడుగుకి, బియ్యానికి ఒకటే మంత్రం పనికిరాదు. ఇప్పుడు మీ తల్లి గారి సంగతే తీసుకొందాం. ఆమె వితంతువు కదా! ఆమెకి మీరు తిరిగి వివాహం ఎప్పుడు చేస్తారు?" అని గడుసుతనంగా ప్రశ్నించింది.

"ఛ! ఛ! అదేమన్న మాట!" అన్నాడు సంఘసంస్కర్త అసహ్యంతో.

"చూశారా మరి! వీరేశలింగంగారి కాలంనాటి స్థితిగతులు మనం విచారించాలి. అప్పటి విదేశప్రభుత్వం, ప్రజల విద్యావిహీనత, స్వమతప్రశస్తి ఎరుగక పోడం, ఇటువంటి అనేక కారణాలవల్ల వీరేశలింగంగారు పూనుకొన్న సంస్కరణ గొప్పదిగా కనపడ్డదికాని అది నిజంగా చిన్నదైన సంస్కరణ. దానిని గాంధిమహాత్ముడు సరియైన ఉరవులో పరిగణించాడు" అంది ఆమె.

సీతామనోహరుడు సంఘసంస్కరణలో ఉండే కష్టసుఖాలు ఎరిగినవాడు కాబట్టి "సంఘంలో ఉన్న ఒక లోపం ఎరిగినంత మాత్రాన ప్రజలు సాహసించి, సంఘాన్ని ఎదిరించి, ఆచరించగలరా? ఆ పనికి ఒక మహానుభావుడు అవసరం కాదా? దేశానికి స్వాతంత్ర్యం లేదని మన దేశప్రజలు ఎరుగుదురు. అంతమాత్రంచేత ప్రజలు స్వరాజ్యాన్ని సాధించగలిగారా? దానికి గాంధీ మహాత్ముడు అవతరించి దారి చూపించవలసివచ్చింది కాదా? అలాగే వీరేశలింగంగారు కూడ సంఘసంస్కరణానికి దారి చూపించాడు" అన్నాడు సీతామనోహరుడు.

"ఒక వ్యక్తి ఏదో నాలుగు తన చేతితో చేసినంతమాత్రాన పని పూర్తిగా అయిపోదు. నాలుగు డబ్బులు డబ్బీలో వేసి దానికి 'లోకనిధి' అని పేరుపెట్టినందువల్ల లాభం లేదు. దేశంలో ఒక పనికి అవసర

మైన ప్రబోధం చెయ్యాలి. ఒక్క వ్యక్తి వల్ల అంత ప్రబోధం జరగదు. పదిమందిని కూడగట్టుకోవాలి, పని చెయ్యాలి. ప్రజలని స్వతంత్రయోచనాపరులుగాను, విద్యావంతులుగాను చెయ్యాలి. ఈరీతిగా తయారుచేస్తే ప్రజలే తమకి అవసరమైన సంస్కరణలు తామే సాధించుకొంటారు. మానవసంఘం సాధారణ జంతుసంఘంలాంటిది కాదు. దీనికి నీతి నియమాలున్నాయి. వ్యక్తికి పూర్తిస్వేచ్ఛ అనేది లేనేలేదు. హక్కులతో పాటు ధర్మాలున్నాయి. ఇంతకీ వీరేశలింగంగారు సంఘంలోని దురాచారాలకి మూలకారణం మతమని భావించాడు. అట్లు తలపోసి ఆయన మతసంస్కరణ ప్రారంభించాడు. అదే ఆయనలోని గొప్ప లోపం. మతంపేరట కొన్ని కొన్ని దురాచారాలు బయలుదేరవచ్చు. కాని, వాటికి మతం కారణం కాదు. ప్రజలు, విద్యావిహీనత, అజ్ఞానం కారణాలు. వీరేశలింగంగారు మతం మూలకారణం అనుకోడంబట్టి సంఘసంస్కరణనుంచి మతసంస్కరణలోకి దూకాడు. హిందూమతం వదిలి, బ్రహ్మసమాజమతం అన్నాడు. ఈ రకం తప్పుదారి పట్టాడు. మతంలో జోక్యం పెట్టుకొన్నందువల్ల ఆయనసంస్కరణ వృద్ధి పొందలేదు. ఇలాంటి అవకతవకలవల్ల ఆయన నాలుగోతరగతి సంఘసంస్కర్త కాని, మొదటి కాదని నేను మీకు నచ్చజెప్పడం" అంది.

"మీ అభిప్రాయం చాలా సంకుచితంగా ఉంది." అన్నాడు సీతామనోహరుడు తన వాదన నిలబెట్టుకోడంకోసం.

"అభిప్రాయభేదాల కేమిటిలెండి? దేశంలో అనేకమైన సంస్కరణలు ఎప్పటికప్పుడే అవసరమవుతాయి. నేటి రాజకీయశాసనాలు చూడండి. ఇవీ ఒకరకమైన సంస్కరణలే! కాని, అంతమాత్రంచేత వాటిని మతసంస్కరణగా ఎవ్వరూ భావించడం లేదు. సంఘసంస్కరణకూడా అట్టిదే," అంది ఆమె.

"ఇదేదో ఆలోచించి చూడవలసిన విషయం," అని సీతామనోహరుడు గొణుగుకొన్నాడు.

"ఈ సంగతికూడా కొంత దయచేసి వినండి. శ్రమపడ్డవాళ్లు ఎలాగూ శ్రమపడ్డారు. మిమ్మల్ని శ్రమపెట్టినందుకు నేను చాల విచారిస్తున్నాను," అంది ఆమె.

"అబ్బె! ఎంత మాట! దాని కేముంది! మీరు చెప్పింది వింటాం. దానివల్ల దోషం ఏముంది. గ్రహించడమనేది వేరేసంగతి," అన్నాడు సంఘసంస్కర్త.

పాపారావు కళ్లు అప్పచెప్పి కూర్చున్నాడు. ఇదంతా ఏదో మాయలాగు కనబడుతూంది. ఇందులో అసలుసంగతి ఎక్కడా బయటపడడం లేదు.

ఆమె మళ్ళీ "గాంధిమహాత్ముని విషయం చూడండి. ఆయనకూడ వితంతువివాహం అంగీకరించాడు. కాని, అది స్త్రీయొక్క స్వేచ్ఛానిర్ణయానికి విడిచిపెట్టమన్నాడు. అంతేకాని ఇతరులని ఒత్తిడిచేసి చెయ్యమని చెప్పలేదు. దేశంలో నిజమైన సంఘసంస్కరణ గాంధీమహాత్ముడితోనే ప్రారంభమయింది," అంది ఆమె.

సీతామనోహరుడు ఆశ్చర్యపోయి విన్నాడు. చివరికి తన మిత్రుడు ఏవిషయమై ఇక్కడికి తనని తీసుకువచ్చాడో ఆ విషయం ఇంకా ఎత్తనేలేదన్న సంగతి స్ఫురణకి రాగా, అతను "ప్రకృతం మీమాట ఏమిటి?" అన్నాడు సూక్ష్మంగా.

"నామాట నా ఇచ్ఛే. ఆ భగవంతుడే నాకు సర్వమున్నూ. ఆయనకంటె నాకు కావలసిన ఐహికవాంఛ లేదు," అంది.

సంఘసంస్కర్తకి ఏమీ మాట్లాడడానికి తోచలేదు. "ఎవరి ఇష్టం వారిది. ఎవరి దృష్టి వారిది. మీ స్వేచ్ఛని భంగం చెయ్యడం నా కిష్టంలేదు. కాని, మా మిత్రుని కోరిక మీరు ఎరిగేఉన్నారు. వీలయినంత మట్టుకు నిరాకరించవద్దు," అన్నాడు తాను చెప్పతూన్నదానిలో ఎంతమాత్రం నమ్మకం లేకపోయినా.

ఆ మాటలు విని పాపారావు బ్రహ్మానందపడ్డాడు.

"మీ మిత్రుని వివాహానికి ఆయన తండ్రిగారే తాపత్రయపడుతున్నాడు. గట్టి ప్రయత్నం చేస్తున్నారు. కాబట్టి, ఆయననిగురించి మనం ఎంతమాత్రమూ ఆందోళనపడనక్కరలేదు," అంది పార్వతమ్మ అభయహస్తం ఇచ్చినట్లు.

సీతామనోహరుడు ఆమెని ఆశ్చర్యపడి చూశాడు. ఆమె సంభాషణవల్ల తనకికూడ కనువిప్పయినట్లుగా కనపడింది. ఇంక వాదించవలసిన అవసరం లేదనుకొంటూ

అతను లేచి, నమస్కరించి "అమ్మాయీ! వెళ్ళివస్తానమ్మా!" అన్నాడు.

పాపారావుకూడా "వెళ్ళి వస్తాను," అని నిద్రలోంచి లేచినట్టుగా లేచాడు.

వాళ్ళు వెళ్ళిపోయారు.

వాళ్ళతో వాదించడానికి తన కింత ధైర్యం ఇచ్చినందుకు పార్వతమ్మ భగవంతుణ్ణి, సాధువమ్మనికూడ బహువిధాల స్తుతించింది.

దారిలో వెళుతూండగా పాపారావు సీతామనోహరుడితో "చివరికి ఏమయినట్లు?" అని ప్రశ్నించాడు. సంగతేదో తేల్చుకొందామని.

"మన లెక్కేమీ లేదయ్యా!" అన్నాడు మిత్రుడు.

"అయితే మీరు చేసుకొన్న వివాహాన్ని కూడ త్యణీకరించినట్లేనా?" అన్నాడు పాపారావు.

"లేదు. ఎవరి స్వేచ్ఛానిర్ణయం వారిది అని తేల్చడంవల్ల నాకుకూడా దారి చూపించింది," అన్నాడు సంఘసంస్కర్త.

"మీరు ఒప్పిస్తాను, చేస్తాను, చెంకుతాను అన్నారు మరి?" అన్నాడు పాపారావు అమాయకంగా.

"సరి! బాగానే ఉంది. ఆవిడ మనకే చదువుచెప్పుతూంటే, మనం ఆవిడకి బోధించేది ఏమిటయ్యా! మనకన్న ఎక్కువ తెలిసిన ఘటంకాని సామాన్య కాదు. నా సంగతి మొదట ఏమి తెలుస్తుంది! దిగితేగాని లోతు, తింటేగాని రుచి తెలియదన్నారు శాస్త్రకారులు," అన్నాడు సీతామనోహరుడు.

"అయితే, నా కేమిటి దారి?" అని మతిపోయినట్టుగా కనపడ్డాడు పాపారావు.

"నీదారికూడా ఆమెనే అడుగు. కాని ఆమెదగ్గిర వెర్రివేషాలుమట్టుకు వెయ్యకు!" అని సలహా ఇచ్చాడు మిత్రుడు.

"అల్లాగే!" అన్నాడు పాపారావు.

ఎవరి ఇంటికి వారు వెళ్ళిపోయారు.

ఆ మర్నాడు పాపారావు పార్వతమ్మ ఇంటికి తిరిగి వెళ్ళాడు. ఆమె పను లేవో చేసుకొంటూ, అతన్ని చూసి చిరునవ్వు నవ్వుతూ కుర్చీమీద కూర్చోమంది. వెళ్ళి కాఫీకి నీళ్ళు కుంపటిమీద పడవేసింది.

పాపారావు యోచనానిమగ్నుడై ఉన్నాడు. మధ్యమధ్య అతని దృష్టి ఆమెవైపు అందని పండుని చూసినట్టు చూస్తూంది. ఒకవైపు ఆశ్చర్యం, ఒకవైపు ఆకర్షణం, మరొకవైపు విచారం ఇన్ని భావాల మధ్య సుడిగుండంలో పడ్డట్టుకొట్టుకొంటున్నాడు; పార్వతమ్మచర్యలవైపు చూస్తున్నాడు.

"ఏమిటి విశేషాలు?" అంటూ పార్వతమ్మ సంభాషణ కదిపింది.

ఆమె తలకి నూనె రాసుకొని, వాలుగా తల వంచి, పన్నితో దువ్వుకొంటూండగా, ఆమె మనోహరాకారాన్ని అతను చూసి ఆనందిస్తూ, "నీ వ్రతం ఆఖరయిందా ఏమిటి?" అని కొంటెప్రశ్న వేశాడు.

"ఏమి వ్రతం?" అని నవ్వింది.

"తల చింపిరిగా పెట్టుకోడం, నూనె రాసి తలదువ్వుకొని జడ వేసుకోకపోడం. చేతినుండి వెండిగాజులు తీసివెయ్యడం, కాషాయవస్త్రాలు దాల్చడం ఇత్యాది వికారలక్షణాలుగల దుష్టవ్రతం," అన్నాడు పాపారావు పూర్తి అక్కసుతో.

ఆమె ముత్యాలు ఒలికేటట్లు నవ్వి "నేను నీతో చెప్పేనా వ్రతంచేస్తున్నానని?" అంది.

"దొంగవాడు దొంగతనం చేస్తున్నానని చెప్తాడూ! వాడి వాలకం చూసి మనమే గ్రహించాలిగాని."

"నువ్వు నిజంగా తెలివైనవాడివే గాని, బుద్ధి మధ్యమధ్య అడ్డదోవలు పట్టిస్తూ ఉంటుంది," అంది ఆమె జడ అల్లుకొంటూ.

"అయితే నేను అన్నమాట నిజమేనంటావా?"

"నిజమే నని నేను చెప్పేనా?"

"ఏదయితేయేం మా స్నేహితుణ్ణి కూడ హాస్యలగొట్టేశావు. నీ వేషమూ, నువ్వునూ!"

"నా కేం తెలుసు, అదంతా సాధువమ్మ ప్రజ్ఞ. జ్ఞాననేత్రం తెరిపించినందుకు ఆమెకి రెండుచేతులూ ఎత్తి మొక్కాలి," అని రెండుచేతులూ ఎత్తి మొక్కింది.

"నేనుకూడా మొక్కుతాను," అంటూ అనుసరించాడు. "సరేకాని నామాట ఏం చెప్పావు?" అని ప్రశ్నించాడు.

"ఏం మాట?"

"ఏం మాటా! నేను ఇలా చివికి చావవలసిందేనా?"

"నీ కేం రాచబిడ్డడివి! కో అంటే కోటిమంది, చక్కని రత్నాలగనిలాంటి పిల్లని తెచ్చుకొంటావు; సుఖపడతావు!" అంది ఆమె ఉత్సాహంగా.

"నువ్వే మెచ్చుకోవలసిందే నా బతుకుని," అని విచారంగా కనపడ్డాడు.

"ఎన్నడూ అలాగు నిరుత్సాహపడవద్దు" అని ఆమె ధైర్యం చెప్పింది.

"ఆ విషయంలో నువ్వు కలుగచేసుకొంటే నే నేను ఈ మనుష్యులమధ్య మెలగడం. లేకపోతే ఏ ఆశ్రమమో—"

అతని మాటలకి పార్వతమ్మ అడ్డువచ్చి, "ఛీ! ఛీ! అటువంటి అవాచకాలు రానియ్యకు. శుభ్రపదంగా జీవించక నీ కేమి లోటోయి! నీ వయస్సుకి, నీ మనఃస్థితికి ఆశ్రమా లేమిటి! నువ్వు ఒకవేళ చేరినా ఆ మర్నాడే మళ్ళీ ఇంటికి పరుగెత్తుకొని చక్కా వస్తావు. అనుభవం గలిగి, వైరాగ్యం పుట్టినవాళ్ళకి ఆశ్రమాలు, యోగాభ్యాసాలు కాని నీవంటివాళ్ళకా! అయ్యో!" అంది.

ఆమె అతని చేతికి కాఫీకప్పు అందించగా అతను రుచి చూస్తూ "అంటే నీవంటి వాళ్ళకి మాత్రమే! ఏమంటావు?" అని వెటకారంగా అన్నాడు.

"నావంటివాళ్ళకి అన్నమాట యథార్థమే. మంచో, చెడ్డో ఒకమాటు జరిగిపోయిన నాకు కాకపోతే మరెవరికి! నీ లేత వయస్సుకిమాత్రం అటువంటి ఆలోచనలు తగవు," అంది.

ఇంతలో ఎవరో పనిమీద ఇంటిలోకి వచ్చారు. పైగా పాపారావు "జరూరుపని ఒకచోట ఉంది. దాని మాటే మరిచిపోయాను," అంటూ లేచి గబగబా పరుగెత్తాడు.


నాలుగునాళ్ళయింది. పేరయ్య సంబంధం ఒకటి పాపారావుకి చూసుకొని వచ్చాడు. ఆ పిల్లతండ్రి పెద్ద వకీలు. పిల్ల బాగా చదువుకొంది. పదహారేళ్ళుంటాయి. కట్నం కానుకలలో ఎట్టి లోపమూ లేదు. పైగా అందకత్తె. ఈ సంబంధంగురించి తహసిల్దారుగారికి తెలుపగా ఆయన చాల సంతోషించాడు. ఈమధ్య వచ్చిన అభాండాలు తలపోసి, కుమారుడియొక్క ఇష్టాయిష్టాలుఅడగకుండానే పెళ్ళి చేద్దామనుకొన్నాడు. కాని ఈ కాలపు ఆచారాన్ని మాటవరసకేనా అనుసరిద్దామని తలచి పిల్లని పాపారావుకి చూపించ నిశ్చయించుకొన్నాడు.

కిందటిమాటు ఎక్కువసేపు కూర్చుని పార్వతమ్మతో కబుర్లు చెప్పుకోకపోవడంచేత పాపారావు ఏరోజు కారోజే ఆ అమ్మాయిఇంటికి ప్రయాణంకడుతున్నాడు. కాని, ఏదో అభ్యంతరం వస్తూనేఉంది. ఈరోజున వెళ్ళక తప్పదనుకొని బయలుదేరాడు. పార్వతమ్మ ఇంటిలోనే ఉండగా సంతోషించాడు. అతన్ని చూసి పార్వతమ్మ సంతోషించి, "దర్శనాలే అరుదయ్యేయేమి?" అంది.

"ఎప్పుడూ తలచుకొంటూండబట్టి అసలే కనకపడింది," అన్నాడు.

(37-వ పేజీ చూడండి)

ఐస్ ఫ్రూట్



ఏమైనా మాటునా తండ్రి, గోపన్నని ఏదో విధంగా కేకలేస్తూ వుండేవాడు. యీ సారి మాత్రం ఎదురుగానే అనడం మొదలెట్టేడు—"సంపాదన లేకుండా వుంటే ఎల్లాగరా? పొట్టపోషణ జరగడం ఎట్లాగా" అన్నమాటలు గోపన్నని ఆవేదనపరుస్తూవుండేవి. గోపన్న తండ్రికి ఏదురుసమాధానం చెప్పలేకపోతూవుండేవాడు. తన జీవితమంతా వృథా అనుకున్నాడు ఆ చిన్న వయస్సులోనే. ఎవ్వరితోటి చెప్పకుండా వెళ్లి రైలుకింద తలకాయ పెట్టాలనుకున్నాడు. కాని వాళ్ల అమ్మావాళ్లు తనకోసం బాధపడతారని గోపన్న తెలుసుకుని అటువంటి ఆలోచనల్ని దూరంగామాత్రం తరిమేసేడు.

మామూలుగా తండ్రి అంటున్న మాటలు గోపన్నని ఆవేదనపరుస్తూనే వున్నాయి. గోపన్న కోపం పట్టలేక ఆఖరకి ఒకసారి అన్నాడు - " థర్డుఫారంఅన్నా పూర్తిగా చెప్పించేవా? ఏదో మాస్టరీఅన్నా చేసి డబ్బు సంపాదించేవాడిని గా" అన్నాడు. తనుచేసిన తప్పు పనికి తండ్రి తలకాయ వంచుకొన్నాడు. గోపన్న జీవితంలోని ప్రకాశ కిరణాల్ని అడ్డుపెట్టిన తండ్రి గోపన్న ఎదురుగా నిలబడి మాట్లాడలేకపోయాడు తండ్రి చాలా వ్యథతో ఏడ్చేడు. గోపన్న కూడా చాలా బాధపడ్డాడుఎట్లాగా సంపాదించడమని.

అసలే గోపన్నకుటుంబం చాలా బీదవాళ్లు. తండ్రి బండికట్టి డబ్బుసంపాదిస్తాడు. ఎంత డబ్బు సంపాదించినా తన డబ్బంతా తాగుడికి, పేకాట్లకి అయిపోతుంది. యిప్పుడు తాగుడు లేకపోయినా తనడబ్బు పేకాట్లకి పాడుచేస్తున్నాడు.

ఒకరోజున తండ్రిని అడిగేడు ఎట్లాగా సంపాదించడమంటూ. తండ్రికి తనలో వుత్సాహం వుబికింది. కొడుకు అభిప్రాయానికి చాలా మెచ్చుకున్నాడు. తన కష్టాలన్నీ ఒక్కసారి నెరవేరేయి అనుకున్నాడు.

తండ్రి సంతోషంపట్టలేక "ఏదోవిధంగా సంపాదించవచ్చు సంపాదించాలనే ఆశ వుండాలికాని" అన్నాడు.

తండ్రి ఆలోచించేడు బాగా—గోపన్నని ఏ పనిలో ప్రవేశపెట్టిద్దామా? అని. చుట్ట కాల్చుకుంటూ ఆలోచించి ఆలోచించి అన్నాడు - "వారం వారం డబ్బులిస్తారు, సంచులఫాక్టరీలోకి వెళ్తా వేమిరా?" అని.

ఇల్లు వూడుస్తున్న గోపన్న తల్లి ఒక్క అంగలో తనభర్తను సమీపించి "యింకా యినుప యంత్రాలలోకి పంపిస్తానన్నారు కాదు...నయం." అన్నది. అంతటితో విరమించుకోక "వేసంకాలం - సంచుల మిల్లులలోకి వెళ్తే గోపన్న బతకాలా? యింకా పధ్నాలుగేళ్లన్నా నిండలేదు. చాల్లెండి మీ సంపాదనా? మీరూ?" అన్నది గోపన్నతల్లి.

గోపన్నతండ్రి మాట్లాడలేకపోయేడు. అతనిలో ఆ క్షణంలో అనేకరకాల వృత్తులు, సంపాదనలు కూడా బండి చక్రంలా గిర్రున తిరిగేయ్. ఆలోచించి ఆఖరికి అన్నాడు - గోపన్నతండ్రి "ఐస్ అమ్ముతావేమిరా? గంట వాయించుకుంటూ గొప్పమ్మట తిరగవచ్చు" అన్నాడు. గంట వాయించుకుంటూ తిరగవచ్చు అన్నది రెచ్చగొట్టింది గోపన్నను.

"సరే ఐస్ అమ్ముతాను" అన్నాడు గోపన్న.

"అల్లాగైతే రేపు ఐస్ తెస్తానుండు" అన్నాడు తండ్రి.

తన చిన్నలాగూ పైకిలాక్కుంటూ, గాలికెగిరే క్రాపుతో యింటిదగ్గర అరచేడు 'ఐస్‌ఫ్రూట్' అని. వెంటనే గంట వాయించేడు. అప్పగారు వేళాకోళంగా అన్నది -- "ఏయ్...అబ్బాయ్ ఇల్లారా" అంటూ. గోపన్న చిరాకుతో 'కొనని బేరం ఎందుకమ్మా' 'అని వెంటనే నవ్వాడు.

తిరిగేడు వీధులన్నీ 'ఐస్ ఫ్రూట్' అని అరుచుకుంటూ సగం అమ్మడైపోయింది. వుత్సాహంతో యింటికి వచ్చేడు. అమ్మ చాలా సంతోషించింది.

రోజులు గడుస్తున్నాయి. అరుస్తున్నాడు 'ఐస్‌ఫ్రూట్ అంటూ. గంట కొడుతున్నాడు గట్టిగా. యిళ్లల్లోంచి పిల్లలు చంకలు కొట్టుకుంటూ వస్తున్నారు. లడ్డూలు మాదిరిగా అమ్ముతున్నాడు ఐస్‌ఫ్రూట్. తినే

—————

"రాజ్ పాల్'

స్తున్నారు సంతోషంగా. ఎండ తీవ్రంగా వుంది. చెమట్లు కారుతున్నా... కాళ్లు కాలుతున్నా తిరిగేడు రోజంతా. అరుస్తున్నాడు వుత్సాహంతో 'ఐస్'... 'ఐస్ ఫ్రూట్' అని. అయిపోతోంది ఐస్. యిల్లు చేరుకుంటున్నాడు డబ్బులతో.

యిల్లు చేరుతూనే ఒక రోజున అన్నాడు- 'తలకాయ నొప్పిగావుంది కాళ్లు కాలుతున్నాయి' అని.

"మరీ అంత ఎండలో వెళ్తే తలకాయ నొప్పికాకపోతే ఏమిటే? రేపు మాడు కొడితేనే కానీ బైల్దేరకు" అన్నది గోపన్న తల్లి.

అమ్మ చెప్పినప్రకారం మర్నాడు మాడింటికి బైల్దేరేడు- 'ఐస్ ఫ్రూట్' అంటూ, తిరుగుతూంటే అంత కాళ్లు కాలటం లేదు. హాయిగా అరుస్తూ గంటకొడుతూ తిరిగేడు. తిరిగిన వీధే మళ్లీ తిరిగేడు. రోజూ కొనేవాళ్లు కూడా కొనలేదు. తన చిన్న మనస్సుకి అనేకములైన ఆలోచనలు తట్టేయి. తనలో తనకే భయమేసింది. చీకటిపడేంతవరకూ తిరిగేడుగంట వాయించుకుంటూ. నోరు ఆర్చుకు పోయింది. డబ్బాలోకి డబ్బులురాలేదు. లోతుకు పోయిన పొట్టలోని యెముకలమీదకి లాగూ పైకి లాక్కుంటూ యిల్లు చేరుకున్నాడు.

అమ్మతో అన్నాడు-"యీ వేళ అమ్మకం లేదే"అని.

"పోనీ లే అమ్మా... లేకపోతే లేక పోయింది" అన్నది.

అన్నంతిని పడుకున్న గోపన్నని నిద్ర నుండి లేపిఅర్ధరాత్రి యింటికి ఆలస్యంగా వచ్చినతండ్రి అమ్మకం గురించి అడిగేడు. కళ్లు నలుపుకుంటూ"యీ వేళ అమ్మకం తగ్గింది" అన్నాడు.

తండ్రికి కోపం ఎక్కువైంది. పక్కనే భార్య వుంది. గోపన్నని ఏమీ అనలేకపోయాడు. ఆఖరికి అన్నాడు- "అమ్మకం ఎక్కువ అవ్వాలంటే ఒక్కరహస్యం వుంది" అని.

"ఏమిటా రహస్యం" అన్నాడు గోపన్న ఆతృతతో.

"మధ్యాహ్నం ఒంటిగంటకు అమ్మడం మొదలెట్టాలి. ఎవరూ అమ్మకుండా నువ్వు ముందుగాగంటవాయించుకుంటూ అమ్మాలి" అన్నాడు గోపన్నతండ్రి.

గోపన్న పట్టరాని సంతోషంతో రేపటి నుంచీ అల్లాగే చేస్తాలే అన్నాడు.

మర్నాడు మండుటెండలో బైల్దేరేడు. కాళ్లు కాలిపోతున్నాయి. డబ్బాడబ్బులతో నిండుతుందనే ఆశతో అరుస్తూ తిర్గేడు వీధులన్నీ. డబ్బా నిండుతోంది డబ్బులతో. కాని కాళ్లు కాలిపోతున్నాయి. తడిసిన చొక్కాతోటే మొహం తుడుచుకుంటూ నోట్లోకి వెళ్ళే చెమటను బైటికి వుమ్మేస్తూ ఓపికతో తిరిగేడు. సంతోషంగా తింటున్నారు ఐసు! తను కూడా వాళ్లతో నవ్వుదాం అనుకున్నాడు... ఎక్కడి నుంచి వస్తుందీ నవ్వు?


యిల్లుచేరుకున్న గోపన్న మాట్లాడలేక పోయేడు. రాని నవ్వు తెచ్చుకుంటూ "ఐస్ అంతా అమ్మేసేనేఅమ్మా"అన్నాడు నీరసంగా.

తల్లి తనసంతోషాన్ని తెల్పింది. లోతుకు పోయిన పొట్టని చూడగానే తల్లిమనస్సు చివుక్కు మన్నది. పక్కింటి ప్లీడరుగారు పెట్టిన అన్నం; చారు... కూర గోపన్న ముందు పెట్టింది. అన్నం తింటూనే అన్నాడు—

"అమ్మా కాళ్లు కాలుతున్నాయే... జైరుచెప్పు లన్నా కొనకపోతే లాభంలేదు. చూడు కాళ్లు ఎల్లా కాయలు కాసేయో" అన్నాడు. తల్లిమనస్సు నొచ్చుకుంది. తన బీదరికానికి తిట్టుకుంది,... "ఎంతడబ్బు సంపాదించినా చాలటంలేదు. మీ నాన్న చూస్తే ఆవిధంగా ఖర్చుపెడుతున్నాగు. యింతవయస్సు వచ్చినా యింకా తెలియకుండావుంది. యిల్లా అవుతే ఎంత డబ్బు సరిపోతుంది" అన్నది. గోపన్న మాట్లాడలేకపోయేడు. అలసిపోయిన శరీరాన్ని నులకమంచంమీద వాల్చేడు.

సగంరాత్రి గడిచిపోయింది. గోపన్న అరుస్తున్నాడు నిద్రలో "ఐస్ ఫ్రూట్"! చల్లగా వుంటుంది... పుల్లగా...

(23-వ పేజీ చూడండి)



పెండ్లి మాటలు

[ఏకాంకిక]

ఆంటన్ చెకోవ్

(ఛుబుకోవ్ యింటిలోని అతిథుల నాహ్వానించే గది - డ్రస్సు జాకెట్టు తొడుక్కొని, తెల్లటి చేతి తొడుగులు తొడిగి లోమోవ్ వస్తాడు. అతన్ని ఆహ్వానించటానికి ఛుబుకోవ్ లేస్తాడు.)

ఛుబుకోవ్: ప్రియమైన ఇవాన్ వాసిలీవిచ్! నువ్వు వచ్చినందుకు సంతోషంగా వుందోయ్. (అతని చేతిని నొక్కుతాడు) ఆశ్చర్యంగా వుందిరా, నాన్నా. యెలాగున్నా వేమిటి?

లోమోవు: బాగానే వున్నా. మీరెలా వున్నారు?

ఛుబుకోవు: యేదో మీ దయా మొదలైనవాటివల్ల, అలా వున్నాంరా, చిట్టిబాబూ. నా మాట విని ముందు కూర్చో... ముందు కూర్చోరా...ఐతే, మీ యిరుగూ పొరుగువాళ్ళని బొత్తిగా మర్చిపోయేవేరా, నాన్నా? సరేగాని, అంత యిదిగా బట్టలూ, చేతొడుగులూ మొదలైనవాటిని వేసుకొచ్చా వేమిటోయ్? యెక్కడికన్నా వెళ్తున్నా వేమిటి?

లోమోవు: లేదండీ. నేను మిమ్మల్ని చూడటానికే వచ్చానండీ.

ఛుబుకోవు: ఐతే నాయనా, సంవత్సరాది పండగనాటికి మల్లే దిరీసు వేశావెందుకోయ్?

లోమోవు: ఆఁ. చూడండీ. అసలు సంగతిదీ. (ఛుబుకోవు చేతిని పట్టుకొంటాడు) నేను మీకోసం, నా మనవి నొకదాన్ని మీకు చెప్పి మిమ్మల్ని శ్రమ పెట్టడంకోసం వచ్చానండీ. తరుచూ, మీ సహాయాన్ని అర్థించే భాగ్యం నాకు యిదివరలో కల్గింది. మీరుగూడా యెప్పుడూ, అంటే...... క్షమించండి. నాకు దడ వచ్చింది. స్టీపన్ స్టెపానోవిచ్ గారూ, కాసిన్ని మంచినీళ్లు తాగుతా నుండండి (తాగుతాడు)

ఛుబుకోవు: (తనలో) అప్పుకోసమే వచ్చాడు! వుహూ. యివ్వనే యివ్వను. (బిగ్గరగా) ఐతే యేమిట్రా అబ్బాయ్ ఆ పనీ?

లోమోవు: చూడండీ, స్టెపానోవిచ్ గారూ. క్షమించండి, స్టీపన్ గారూ...... అంటే, నాకు చాలా దడ వచ్చింది. మీరే చూడవచ్చు...క్లుప్తంలో చెప్పాలంటే— నేను అనర్హుణ్ణే ఐనప్పటికీ, మీ రొక్కరే నాకు సాయం జెయ్యగలరు......

ఛుబుకోవు: నంగి, నత్తులు కొట్టమాకురా, నాన్నా. అదేమిటో బయటికి వూసెయ్యి. సరేనా?

లోమోవు: వొక్క క్షణం...యిప్పుడే చెప్పేస్తా. సంగతేంటంటే, మీ అమ్మాయి నటాల్యాని నాకిచ్చి పెళ్లి చెయ్యమని అడగటాని కొచ్చానండీ.

ఛుబుకోవు: (ఆనందంతో) భలే! శేష్, ఇవాన్ వాసిలీవిచ్! యేదీ మరోసారి చెప్పు ఆ మాట— నేను దాన్ని విన నేలేదోయ్!

లోమోవు: నాకు......అడిగే భాగ్యం...

ఛుబుకోవు: (మధ్యలో ఆపుతూ) నా చిన్ని బాబూ, నాకు చాలా ఆనందంగా వుందిరా...అవును, నిజంగా. (లోమోవుని కౌగలించుకొని ముద్దాడుతాడు) నేను యెంతకాలంనుంచో యీ సమయంకోసం యెదురుచూస్తున్నా. యెన్నాళ్లనుంచో అలా జరగాలని నాకు కోరికగా వుంది. (వొక ఆనందబాష్పం రాల్చుతాడు) అసలు నువ్వే నా కుమారుడివైనట్లుగా, నువ్వంటే నా కెప్పుడూ యెంతో ప్రేమగా వుంటుందోయ్. భగవంతుడు మీ యిద్దరికీ తన సహాయ సానుభూతుల్ని యిచ్చుగాక! నేను చాలా...యెందుకు నేనిలా వెర్రిగా ప్రవర్తించేది? నేను ఆనందంతో వొళ్లు మరిచిపోయా. పూర్తిగా......అబ్బా. మనసారా నాకు......వుండు. నేను నటాషాని పిల్చుకొస్తా నుండు.

లోమోవు: (చాలా ద్రవించిపోయి) ఆమె వొప్పుకుంటుందంటారా, స్టీపన్ స్టెపానోవిచ్ గారూ?

ఛుబుకోవు: అయ్యో నా ముద్దులపట్టీ! యెందుకని ఒప్పుకోగూడదు?... హుఁ... ఆమె ఒప్పుకోనట్లు అంటున్నావే. ఆమె ప్రేమిసున్నది. ఆమె స్థితి విరహతాపంగల పిల్లిస్థితిలాగా వుంది. యిదుగో యిప్పుడే వస్తా నుండు (వెళ్తాడు)

లోమోవు: చలిగా వుంది. నే నేదో పరీక్షకి కూచున్నట్లుగా, నా వొళ్లంతా వొణుకుడు పుడుతున్నది. గొప్ప సంగతేమిటంటే, నిర్ణయం తీసుకోటమనేది. ఆలోచించటానికీ, ముందువెనుకలు చూసి తగ్గటానికీ, వొక ఆదర్శంకోసం, లేదా, నిజమైన ప్రేమకోసం ప్రయత్నించటానికీ, నేను తగిన వ్యవధి తీసుకొన్నానంటే - నే నసలు పెళ్ళి చేసుకోను...బుర్ ర్ ర్... చలిగా వుంది! నటాల్యా ఘనందుగా యింటి పనులు చూసుకోగలమనిషి. యేమంత అనాకారి గాదు.. బాగా చదువుకొంది...నాకింకా యేం కావాలి? కాని, దడమూలంగా నా చెవిలో యేదో బుర్ మని ధ్వని పుడుతోంది. (నీరు తాగుతాడు) నేను పెళ్ళి చేసికోకుండా వుండటమనేది అసంభవం. మొదటి సంగతేమిటంటే, నా కిప్పటికే 35 యేళ్లున్నాయి. నిజం చెప్పాలంటే, అది ఆక్షేపణీయమైన వయస్సే. యిక రెండవ దేమంటే, నేను ప్రశాంతంగా, వొక పద్ధతిప్రకారం జీవితం గడపాలి... నాకు గుండెదడతో బాగా వుంది. అతి తొందరపాటుగా వుంది. అస లెప్పుడూ నేను చాలా తలకిందు లవుతూవుంటాను... యీ క్షణాన నా పెదవులు వణుకుతున్నాయి. కుడి కనుబొమ అదురుతున్నది. ...కాని, అన్నిటికంటే పెద్ద చిక్కేమిటంటే నా నిద్రసంగతి. మంచమెక్కి, పడుకొని కొత్త అలా కన్ను మూస్తుండగానే యెడమ డొక్కలో యేదో పోటువస్తుంది. అదే భుజంలోనూ, తలలోనూ వస్తుంది... అప్పుడు పిచ్చెత్తినవాడిలాగా కిందకి దూకి, కొంచెం అటూ యిటూ నడిచి, మళ్ళీ పడుకొంటాను; కాని, కన్ను మూయంగానే మళ్ళీ యింకోకపోటు వస్తుంది? యిలా రోజూ యిరవైసార్లు......

(నటాల్యా వస్తుంది)

నటాల్యా: యిదా సంగతీ! మీరేనా? మరి నాన్నగారేమో, "సరుకులకోసం వొక వ్యాపారస్థుడొచ్చాడమ్మా" అని అన్నారు! యెలా వున్నారు ఇవాన్ వాసిలీవిచ్ గారూ?

లోమోవు: తమ రెలా వున్నారు?

నటాల్యా: దుమ్ము అదీ కొట్టుకోకుండా నేను మసిగుడ్డ చుట్టుకొన్నా... మరేమీ అనుకోకండి. యెండబెట్టటంకోసం మేము బఠాణీగింజలపొట్టు వొలుస్తున్నాం. ఐతే, యెందుకనండీ మీరు చాలాకాలంనుంచీ యిక్కడికి రావటం లేదూ? కూచోండి...(యిద్దరూ కూచుంటారు) కొంచెం ఫలహారం తీసుకోరూ?

లోమోవు: వద్దండీ. నేను యింటివద్ద తీసుకొనే వచ్చాను.

నటాల్యా: అయితే చుట్ట తాగండి. యిదుగో యిక్కడ అగ్గిపెట్టె వుంది. యివాళ వాతావరణం చాలా బాగుందండీ. కాని, నిన్న జల్లులుపడటంవల్ల పనివాళ్లు రోజంతా వూరికినే కూచున్నారు. యెన్ని బళ్ళగడ్డి మీరు వామివేశారండీ? చూడండీ. నేను ఆశకొద్దీ చేనంతా గడ్డి కోయించాను. కాని నాకేమీ మనస్సు సరిగా లేదు. యెందుకంటే, గడ్డి చెడిపోవచ్చు. యింకా కొంతకాలంపాటు నేను ఆగాల్సిందండీ. అది సరేగాని, యిదేమిటండోయ్? భలే. కొత్తబట్టలు కట్టుకొన్నారేమిటి? భలే. ఆశ్చర్యంగా వుంది! నాట్యానికి యేమన్నా పోతున్నారా యేం? కాని, యీ డ్రెస్సులో మీరు చాలా బాగున్నారనే చెప్పాలి. చెప్పండి. యెందుకనండీ అలా తయారైనారూ?

లోమోవు: (దడలో) చూడండీ, నటాల్యాగారూ...సంగతేమిటంటే, నా విషయం వొకటి మీరు వినాలని మిమ్మల్ని అడుగుదామనుకున్నా...విన్నాక, బహుశా మీకు ఆశ్చర్యం కలగొచ్చు. లేదా, కోపం రావచ్చు... కాని ... (తనలో) వోహ్. చచ్చేంత చలిగా వుంది!

నటాల్యా: విషయ మేమిటండీ అసలూ? (కొంత విరామం)

లోమోవు: కొద్దిలోనే చెప్తాలెండి. ఘనమైన నటాల్యా స్టెపనోవాగారూ, యధార్థంగా, నా చిన్నతనంనుంచీ మీ కుటుంబాన్ని యెరిగివుండే భాగ్యం నాకు కలిగింది. గతించిన మా పెత్తల్లిగారూ ఆమె భర్తగారూగూడా మీతండ్రిగారంటేనూ, చనిపోయిన మీ తల్లిగారంటేనూ అత్యంత గౌరవభావంతో వుండేవారు. మా పెత్తల్లిగారినుంచే నా కిప్పుడున్న భూమిగూడా వచ్చింది. లోమోవువారూ, ఛుబుకోవువారూ యెప్పుడూ గూడా వొకరికొకరి చాలా స్నేహభావంతో - చాలా ప్రేమతోగూడానని చెప్పగలను - వుండేవారు. యిక నాభూమి మీకాడి గట్టునే వుందని మీకు తెలుసు. నా యెద్దులబీడు మీ కొండరావిచెట్లలోపుని ఆనుకొనివున్న దనేసంగతి మీకు గుర్తే ననుకొంటాను.

నటాల్యా: మీమాట కడ్డువచ్చినందుకు క్షమించండి. మీరు "నా యెద్దులబీడు" అని అంటున్నారు. కాని అది మీదా?

లోమోవు: అవును. నాదే.

నటాల్యా: మీరు మాట్లాడేది దేన్ని గురించి? ఆ యెద్దులబీడు మాది; మీది గాదు!

లోమోవు: ఘనమైన నాటాల్యాగారూ, అది నాదేనండీ.

నటాల్యా: సరే. నాకా సంగతి యింతకి ముందు తెలవనే తెలవదే! మీ రెలా తెల్సుకొన్నా రేమిటే?

లోమోవు: యెలాగంటారా? మీకొండ రావిచెట్లతోపుకీ, ఎర్ర నేలకీ మధ్య చీలికగా వున్న యెద్దులబీటినిగురించే నేను చెప్పేది.

నటాల్యా: అవునవును...అది మాదే.

లోమోవు: కాదు. మీరు పొరపాటు పడుతున్నారు, ఘనమైన నటాల్యాగారూ. అది నాది.

నటాల్యా: యేమి టిది, వాసిలీ? యెంత కాలంనుంచీ అది మీదీ?

లోమోవు: యెంతకాలంనుంచా? నాకు వూహ వచ్చినప్పట్నుంచీనీ.

నటాల్యా: నిజంగా అలా నన్ను మీరు నమ్మించగలరా?

లోమోవు: ఐతే మీరు దస్తావేజులు తీసి చూసుకోవచ్చు. వొకప్పుడు యీ యెద్దుల బీడు తగాయిదాకి కారణమైంద నేది యథార్థం; కాని యిప్పుడా బీడు నాదేనని అంతా యెరుగుదురు. యిక అవిషయాన్ని గురించి తర్జనభర్జన పడనవుసరం లేదు. చూడండీ. మా పెత్తల్లిగారియొక్క ముత్తవగారు మీ ముత్తాతగారియొక్క కవులుదార్లకి, వాళ్లామెకి యిటుకలు చేసిపెట్టేందుకని యిచ్చేసింది. మీ ముత్తాతగారి కవులుదార్లు ఆబీటిని 40 యేళ్ళపాటు స్వేచ్ఛగా వుపయోగించుకొని ఆబీడు తమదే ననే భావనలో కొచ్చారు. కాని యింతలో...

నటాల్యా: వుహూఁ, అదేమీ గాదు. మా తాతగారూ, ముత్తాతగారూ ఆపర్ర నేలవరకీ వారి భూమి వుందని లెక్కగట్టారు - అంటే ఆ యెద్దుల బీడుమాదని తెలుతున్నది. యీ భాగ్యానికి వాద నెందుకు చెయ్యాలో నాకు బోధపడకుండా వుంది. వొట్టి అర్థం లేని వాదన!

లోమోవు: నటాల్యాగారూ, మీకు దస్తావేజులు తీసి చూపిస్తానుండండి.

నటాల్యా: మీరు వూరికినే అలా అంటున్నారు. లేదా, నన్ను వేళాకోళంచెయ్యాలని అంటున్నారు...భలే వింత! మూడు వందలయేళ్లనుంచీ ఆ బీడు మాపరంలో వుంది. మరి యిప్పుడేమో అది మాదిగాదట! ఇవాన్ వాసిలీవిచ్, నా చెవుల్ని నేను నమ్మలేకుండా వున్నాను సుమా...యీ బీడంటే నాకొక పెద్ద లెక్కలోది గాదు. మహా అయితే అది నాలుగు మూడెకరాలుంటుంది. బహుశా, యేమూడొందల రూబుల్లో ఖరీదు చెయ్యవచ్చు. కాని, అందుకు గాదు. నేను అన్యాయాన్ని మాత్రం సహించలేను. మీ రేమన్నా అనండి గాని, నేను మాత్రం అన్యాయాన్ని సహించలేను.

లోమోవు: మిమ్మల్ని బతిమాలుకొంటున్నా. నేను చెప్పేదిగూడా కాస్త వినండి. నేను యింతకుముందు తమరితో మనవిచేసినట్లు, మీ ముత్తాతగారి కవులుదార్లు మా పెత్తల్లిగారి అవ్వగారికి యిటుకలు కాల్చియిస్తూండేవాళ్లు. యిక మాపెత్తల్లిగారి అవ్వగారు వాళ్ళకి సంతృప్తి గల్గించేందుకని......

నటాల్యా: యీ పెత్తల్లు లేమిటో అవ్వలేమిటో, తాతలేమిటో, ముత్తాతలేమిటో, తలేమిటో, తోకేమిటో నాకేమీ బోధపడకుండా వుంది. ఆ బీడు మాదీ; అదీ సంగతి.

లోమోవు: నాది.

నటాల్యా: మాది! ఆ విధంగా మీరు రెండురోజులపాటు వాదన చేసినప్పటికీ, మీరు ఒకటిగాదు పదిహేను డ్రెస్ జాకెట్లు తొడుక్కొని వచ్చినప్పటికీ, ఆ బీడు మాది, మాది, మాది అంటాను! మీదేమీ నాకక్కర్లేదు; కాని నాది మాత్రం గడ్డిపరకంతగూడా వదులుకోను. తెల్సిందా? అదీ సంగతి!

లోమోవు: నటాల్యా ఇవానోవ్నా, నాకా బీడేమీ అక్కర్లేదు. కాని, నేను వొక నీతిసూత్రంప్రకారం నడుచుకొంటున్నా. మీకు కావాలంటే ఆ బీటిని బహుమతిగా యిచ్చేస్తా.

నటాల్యా: అది నాదిగాబట్టి, నేనే మీకు దాన్ని బహుమతిగా యిచ్చేస్తా తీసుకోండి! మీ నడతనిగురించి కనీసం చెప్పాలంటే, మీ నడత వింతగా వుంది సుమా! యీ నాటివరకూ గూడా మేము యెప్పుడూ మీది మంచి పొరుగనీ, మీరు మంచి మిత్రులనీ అనుకొన్నాం. కిందటి సంవత్సరం మీకు మా నూర్పిడియంత్రం యిచ్చాం; దానివల్ల నవంబరు వరకూ మా ధాన్యం నూర్పిడి ఆపాల్సి వచ్చింది; ఐనా యిచ్చాం. కాని మీరేమో, మేము యెరుకల యానాదివాళ్లమైనట్లు మమ్మల్ని చూస్తున్నారు. హుఁ నా భూమి నాకే దానమిస్తారట! భలే! వుహూఁ యిదెంత మాత్రమూ గూడా యిరుగు పొరుగువారి కుండాల్సిన లక్షణం గాదు. నావుద్దేశంలో

అది సిగ్గు లేని పని. మీరు తెలిసికోగోరితే......

లోమోవు: అయితే, ఆఖరికి నేను యితర్ల భూమిని మింగే రకాన్నని తేల్చారన్నమాట! యేమండోయ్, కాస్త వినండి. నా జీవితంలో యెప్పుడూ గూడా నేను యెవరి భూమినీ ఆక్రమించివుండలేదు. యెవరన్నా అలా చేశారంటే సహించేది లేదు... (త్వరగా ఒక గాజుకూజావద్ద కెళ్లి, యింకో యెక్కువ నీరు తాగుతాడు). ఆ యెద్దులబీడు నాది!

నటాల్యా: అది నిజంగాదు. అది మాది!

లోమోవు: నాది!

నటాల్యా: అది నిజంగాదు. నేను రుజువుచేస్తా కావాలంటే! యివాళే నేను కోతగోసే వాళ్లని ఆ బీటికి పంపుతా!

లోమోవు: యేమిట?

నటాల్యా: కోతగోసేవాళ్లు యివాళే పోతా రక్కడికి!

లోమోవు: వాళ్ల కాళ్లు విరగ్గొడతా.

నటాల్యా: యెంత ధైర్యం!

లోమోవు (తనగుండెకి చేతి నదుముకొంటూ) యెద్దుల బీడు నాది! తెల్సిందా? నాది!

నటాల్యా: దయవుంచి కాస్త అరవకండి. కావాలంటే, మీయింట్లో మీరు యెంతైనా అరుచుకోండి. కాని యిక్కడ మాత్రం కళ్లెం లాగి పట్టాలిసుమా!

లోమోవు: యేమండోయ్, అమిత బాధ పుట్టించే యీ గుండెదడ లేకపోయినట్లయితే, నా లోపల అంతా తల కిందులు కాకుండా వున్నట్లయితే, మీతో యింకొకరకంగా మాట్లాడివుందును! (బొబ్బరించుతాడు) యెద్దుల బీడు నాది!

నటాల్యా: మాది.

లోమోవు: నాది.

(ఛుబుకోవు వస్తాడు)

ఛుబుకోవు: సంగతేమిటర్రా? అరుచుకొంటున్నా రెందుకూ?

నటాల్యా: నాన్నా. యెద్దుల బీడు మనదో, యీయనదో, యీ పెద్దమనిషికి కాస్త చెప్పవేం.

ఛుబుకోవు: (లోమోవుతో) ఆ యెద్దుల బీడు మాదిరా, చిట్టిబాబూ!

లోమోవు: స్టీపన్ స్టెపానోవిచ్ గారూ. అది మీ దెలా అవుతుందో కాస్తచెప్పండీ. పెద్దమనిషి తరహాగా చెప్పండి. మా పెత్తల్లిగారి అవ్వగారు మీ ముత్తాతగారి కవులుదార్లకి తాత్కాలికంగా యిచ్చిందా భూమి. ఆ కవులుదార్లు నలభైయేళ్ళపాటు దాన్ని వుపయోగపెట్టుకొని, అది తమదే ననే భావనలో కొచ్చారు. కాని, యింతలో యేం జరిగిందంటే......

ఛుబుకోవు: నామాటరా, ముద్దులపట్టి... ఆ కవులుదార్లు మీ అవ్వగారికి మగతా, గిగతా మొదలైనవి చెల్లించలేదనీ, యెందుకంటే, ఆ బీటినిగురించి తగాయిదా, గిగాయిదా అదీయిదీ వున్నందువల్ల నేననీ, నువ్వు మరిచిపోతున్నావురా, బాబూ. అంటే అసలా ప్లానేమిటో నువ్వు చూడలేదన్నమాట.

లోమోవు: అది నాదని నేను రుజువు చెయ్యగలను.

ఛుబుకోవు: నువ్వు రుజువు చెయ్యలేవురా, చిట్టినాన్నా.

లోమోవు: చేస్తాను.

ఛుబుకోవు: చూడూ. యెందుకలా అరుస్తావు? అరిచినంతమాత్రాన నువ్వేమీ ఋజువుచెయ్యలేవు. నీదేమీ నా కొద్దు. కాని, నా దన్నదిమాత్రం నేను వొదులుకోను. అసలెందుకొదులుకోవాలి? చిట్టిబాబూ, యిక నువ్వు యిలాగే వాదన చేస్తానంటే, ఆ బీడు నీ కిచ్చేకన్నా ముందే, కవులుదార్లకే యిచ్చేస్తా. అదీ సంగతి!

లోమోవు: నా కేమీ తెలవటంలేదు. పరాయి సొమ్మును దానమిచ్చేహక్కు మీ కెలా వచ్చింది?

ఛుబుకోవు: ఆ హక్కు నా కుందో లేదో నే నెరుగుదునని గ్రహించు. యెందుకంటే, అలాంటి ధోరణిలో వొకరిచేత చెప్పించుకోటం అదీ యిదీ నాకు అలవాటు లేదురా, పడుచుకుర్రాడా. చూడూ. నీకు రెట్టింపు వయసుగలాణ్ణి నేను. కనక తొందరపాటు మొదలైనవి పడకుండా, నింపాదిగా మాట్లాడమని చెబుతున్నా.

లోమోవు. అసలు సంగతది గాదు. నన్నొక కుంతకింద జమకట్టి, నన్ను బోల్తా కొట్టించాలని మీరు చూస్తున్నారు! నా భూమి మీదని పలికి, పైగా నేను శాంతంగా, వినయంగా మాట్లాడా లంటున్నారు. స్టీపన్ స్టెపానోవిచ్ గారూ - ఒకరి మేలుగోరే యిరుగుపొరుగు వా రెప్పుడూ అలా ప్రవర్తించరు. అసలు మీరు యిరుగుపొరుగువారు గాదు; పరాయిభూమి మింగేవారు!

ఛుబుకోవు: ఏమిటదీ? యేమన్నావూ?

నటాల్యా: నాన్నా, తక్షణమే, కోతగోసేవాళ్లని ఆ బీట్లోకి పంపు!

ఛుబుకోవు: సార్! తమరన్న దేమిటి?

నటాల్యా: ఎద్దుల బీడు మాది. దాన్ని నేను వదులుకోను, వదులుకోను, వదులుకోను!

లోమోవు: సరే అదీ చూస్తాంగా! నేను యీ సంగతి కోర్టుకీడ్చి, ఆ పైన సంగతేమిటో చెపుతా.

ఛుబుకోవు: కోర్టుకా? నువ్వు కోర్టుకీ, గీర్టుకీ తీసుకుపోటం, గీసుకుపోటం అదీయిదీ చేసుకో. వూఁ. చేసుకో. నేను నిన్నెరుగుదును. నువ్వు కోర్టుకి పోవాలని, గీవాలని కనిపెట్టుకుని కూచున్నావు...కోర్టుపక్షీ! అసలు మీ వంశమంతా అలాంటి రకమే! అందరూనూ!

లోమోవు: నా వంశంగురించి శ్రమపడమాకండి. లోమోవు వంశమంటే యెంతో మానమర్యాదలు గలది; నమ్మకద్రోహంకింద మీ తాతకి మల్లే, మావంశంలో యెవరూ బోను యెక్కలేదు!

ఛుబుకోవు: అసలు మీ లోమోవు వంశంలో మీయింట్లో అందరికీ శాదీ చపలమూ వున్నాయి. అందరికీ గూడాను!

నటాల్యా: అందరికీ, అందరికీ, అందరికీ!!

ఛుబుకోవు: మీ తాత వొక తాగుబోతు. మీ చిన్నత్త వొక తాపీమేస్త్రీని తగులుకొని గిగులుకొని పోయింది......

లోమోవు: నీ యమ్మ గూనిముండ (గుండెను గట్టిగా చేత్తో పట్టుకొంటాడు) యేదో లోపల పోటు పుడుతున్నది...నా తల...సహాయం...నీళ్లు.

ఛుబుకోవు: మీ రే. మీ నాన్న వట్టి తాగుబోతు, జూదగాడు.

నటాల్యా: నీ అత్తగుంటంత చాడీకోరు సుబ్బులు యెవరూ లేరు.

లోమోవు: నా యెడంకాలు నిద్రపోతున్నది.. నువ్వు మోసగాడివి... అబ్బా...గుండెలో.. కిందటి యెలక్షన్లకి ముందు నువ్వు లంచ...అనేది పబ్లిక్ రహస్యం...నాకు చుక్కలు కనపడుతున్నాయి...నా టోపీ యేదీ?

నటాల్యా: అలగాజాతి పని! నీతీజాతీ లేని పని!! నీచపు పని!!!

ఛుబుకోవు: నువ్వు రెండునాల్కల విషపురుగువి! అవును, రూఢిగా!!!

లోమోవు: యిదుగో నా టోపీ...నా

గుండెలో...దోవ యేటు ? వాకిలి యెక్కడ ? అబ్బా... నేను చచ్చిపోతున్నా ననుకొంటా...నాకాలు చాలా తిమ్మిరిగా వుంది... (వాకిటివద్ద కెళ్తాడు)

ఘుబుకోవు : (అతని వెంటపోతూ)మళ్ళీ యిక నాయింట్లో, గింట్లో అడుగు పెట్టనీకు !

నటాల్యా : కోర్టుకే తీసుకుపో. అదీ చూస్తాంగా !

(లోమోవు తూల్తూ బయటకి పోతాడు)

ఘుబుకోవు : వీడ్ని భూతం మింగ ! (వుద్రేకంతో, గదిలో అటూ యిటూ తిరుగుతాడు)

నటాల్యా : యెంత ఛండాలుడు ! యిక యింతజరిగినాక, యే యిరుగుపొరుగువాడ్ని నమ్మేటట్లు !

ఘుబుకోవు : ద్రోహి ! దిష్టిబొమ్మ !!

నటాల్యా : రాక్షసుడు ! మన భూమి ఆక్రమించుకొన్నది గాక, పైగా నోటి కొచ్చినట్లల్లా పేల్తున్నాడు.

ఘుబుకోవు : ఆ గుడ్డికోడి, ఆ అనాకారి దెయ్యం, పైగా ప్రతిపాదనా గితిపాదనా తేవటానికిగూడా వెనుకాడలేదు. యేమిట నుకొన్నావు ? ప్రతిపాదన !

నటాల్యా : యేం ప్రతిపాదనా !

ఘుబుకోవు : నిన్ను చేసికొంటానని చెప్పటాని కొచ్చాడు.

నటాల్యా : చేసుకొంటానని చెప్పటానికా? ఐతే, ముందుగా యెందుకని నాకా సంగతి చెప్పలేదూ ?

ఘుబుకోవు : అందుకనే కొత్త బట్టల్తో ముస్తాబయి వచ్చాడు. కుళ్లిపోయినమాంసపు కూర ! పనికిరాని ముసిలితొక్క !!

నటాల్యా : నన్ను చేసికొంటానని చెప్పటానికా ? హబ్బా ! (ఒక ఈజీ ఛైర్‌లో కూలబడిపోయి యేడుస్తుంది) ఆయన్ని వెనక్కి పిల్చుకురండి ! వెనక్కి ! హబ్బా ! ఆయన్ని యిక్కడికి తీసుకురండి.

ఘుబుకోవు : యెవర్ని తీసుకురావాలి ?

నటాల్యా : త్వర త్వరగా, త్వరగా. నాకు జబ్బొచ్చింది ! ఆయన్ని తీసుకురా (మూర్ఛలు వస్తాయి)

ఘుబుకోవు : యేమిటది ? యేమిటమ్మా నీకూ ? (తన తలపట్టుకొంటాడు) హా ! నేను నిర్భాగ్యుణ్ణి ! పిస్తోల్‌తో కాల్చుకొంటా. గురి పెట్టుకొంటా. ఆమెకి యిక మా అవుసరం తీరిపోయింది !

నటాల్యా : నేను చచ్చిపోతున్నా ! ఆయన్ని తీసుకురా.

ఘుబుకోవు : ఛ్ఫూ ! తక్షణమే తీసుకొస్తా. బొబ్బలు పెట్టమాకు.

(బైటికి పరుగెత్తుతాడు. నటాల్యా మూల్గులు పెడుతుంది)

నటాల్యా : నాకేం చేశారు ? ఆయన్ని వెనక్కి పిల్చుకురా. ఆయన్ని తీసుకురా. (కొంత విరామం)

(ఘుబుకోవు లోనికి పరుగెత్తుకొస్తాడు)

ఘుబుకోవు : అతను వస్తున్నాడు గిస్తున్నాడు - వాడ్ని భూతం మింగిపోను ! ఉఫ్ ! నువ్వే అతన్తో మాట్లాడుకో. నేను ......

నటాల్యా : (మూల్గుతూ) ఆయన్ని తీసుకురా !

ఘుబుకోవు : (బొబ్బరించుతాడు), అతనొస్తున్నాడని చెప్పా. భగవంతుడా యీడువచ్చినపిల్ల తండ్రిఅవటం అనేది యెంత తగలాటంరా, బాబూ ! నా గొంతు కోసేసుకొంటా ! నిజంగా కోసేసుకొంటాను. అతన్ని మనం తిట్టాం, తిమ్మాం, అవమానపరిచాం, బైటికి గెంటాం... యిదంతా నువ్వే...నువ్వే...

నటాల్యా : కాదు. నువ్వే !

ఘుబుకోవు : అది నా తప్పుగాదని చెబుతున్నా (లోమోవు వాకిలివద్ద కనిపిస్తాడు) అడుగో. యిక నువ్వు అతన్తో మాట్లాడుకో (వెళ్తాడు).

(పూర్తిగా అలిసిపోయి, లోమోవువస్తాడు)

లోమోవు : నా గుండె విపరీతంగా కొట్టుకొంటున్నది... నా కాలు నిద్రపోయింది...యేదో లోపల పోటు పుడుతున్నది.

నటాల్యా : క్షమించండి ఇవాన్ వాసిలీవిచ్ గారూ. మన మందరమూగూడా కొంచెం వుద్రేకపడ్డాం ...ఆఁ. నా కిప్పుడు జ్ఞాపక మొచ్చింది : యెద్దులబీడు మీదే నండీ !

లోమోవు : నాగుండె విపరీతంగా కొట్టుకుంటున్నది...నాబీడు...నా రెండు కనుబొమలూ అదురుతున్నయ్యి...

నటాల్యా : ఆ బీడు మీదే, అవును, మీదే...నా మాట విని కూచోండి. (యిద్దరూ కూచుంటారు) మనం పొరపాటు పడ్డాం...

లోమోవు : నేను వొక నీతిసూత్రం కోసమే అలా నడుచుకొన్నాను...నా భూమంటే నాకు వొక లెఖ్ఖలోది గాదు. కాని నీతిసూత్రం...

నటాల్యా: అవును. నీతిసూత్రం...అంతే గానీండి...యిప్పుడింకేదన్నా విషయాన్ని గూర్చి మాట్లాడుకొందాం పట్టండి.

లోమోవు : యింకో యెందుకనంటే, నావద్ద సాక్ష్యాధారముంది. మా పెత్తల్లిగారి అవ్వగారు మీ ముత్తాతగారి కవులుదార్లకి ...ఆ భూమిని...

నటాల్యా : అవునవును. ఆ సంగతలా వుంచండి. (తనలో) యీయన్ని ఆ సంభాషణలోకి దించే దెలాగాంట...(బిగ్గరగా) మీరు త్వరలో వేట మొదలు పెట్టబోతున్నారా ?

లోమోవు : కోత లవ్వ్వ అయినాక కంచె కోళ్ళని వేటాడదామనుకొంటున్నా. విన్నావా, నటాల్యా ? నా కెలాంటి చిక్కొచ్చిందో చూడు. నాకుక్క, గెస్, కుంటిదైపోయింది. ఆ కుక్కని నువ్వెరుగుదువు.

నటాల్యా : పా-హా-పం ! యెందుకనీ ?

లోమోవు : నాకు తెలవదు....కాలు మడతపడి వుండాలి, లేదా, యే కుక్కన్నా కరచివుండాలి ...(నిట్టూర్చుతాడు) ఖర్చులమాటకేమి గానీ, అది నాకున్న కుక్కల్లో కల్లా చాలా మొనగాడైనది. మిర్నోవుకి 125 రూబుళ్లు యిచ్చి దాన్ని కొన్నా.

నటాల్యా : చాలా పెద్ద ధర, ఇవాన్ వాసిలీ విచ్.

లోమోవు : చాలా చౌకని నా ఉద్దేశం. అది మేలుజాతికుక్క.

నటాల్యా : మా నాన్న 85 రూబుళ్ళు యిచ్చి స్క్వ్యజర్ అనే కుక్కని కొన్నాడు. ఐనప్పటికీ మీ గెస్ కంటే మా స్క్వ్యజరే లక్షరెట్లు మెరుగు !

లోమోవు : గెస్ కంటే స్క్వ్యజరు మెరుగా ? భ మాట ! (నవ్వుతాడు) స్క్వ్యజర్, గెస్‌కంటే మెరుగట !

నటాల్యా : అవును. అదే మెరుగు. నిజానికి, స్క్వ్యజర్ యింకా పడుచుది. దేనికన్నా గూడా, ఆఖరికి వాల్ ఖాన్ ట్స్కీ గారి కున్న కుక్కలకంటే గూడా, దాని జాతీ, పుట్టుకా మంచివి.

లోమోవు: క్షమించాలి. ఆ కుక్కగురించి బొత్తిగా లేనిదనే సంగతి మీరు మరిచిపోతున్నారు. గురీగిరీ లేకపోటమంటే వేటకి సరిగా వుపయోగించ దన్న మాట ?

నటాల్యా : అది గురిలేందా ? ఆమాట యింతమట్టుకి యెవరూ అనలేదు.

లోమోవు : దాని కిందిదవుడ పైదవుడ కంటే పొడుగు తక్కువ.

నటాల్యా : మీరు కొలిచి చూశారా ?

లోమోవు : అవును. అది వెంట పరిగెత్తి రమ్మంటే వస్తుంది. కాని, దేన్నన్నా పట్టుకోమని వుసిగొల్పితే....

నటాల్యా : ముఖ్యమైన సంగతేంటంటే, మా స్క్వ్యజరు మేలుజాతికుక్క ; హార్నెస్‌కీ, చిజెల్స్కీకీ పుట్టింది. యిక దాన్తో

మీ కుక్కకి పోలికేలేదు. యిక మీ కుక్క తీసేసిన ముసిలి బండిగుర్రానికిమల్లే వుంటుంది.

లోమోవు : అది ముసలిదే. కాని, అయిదు స్కీ్వజర్ల నిచ్చినా దాన్ని యవ్వరికీ యివ్వను. ఆమాట నువ్వెలా అనగలవు ?...కుక్కంటే గెస్సే కుక్క. యిక ఆసంగతి కాదనటం వొఠ్ఠి తెలివితక్కువ... మీకున్న కుక్కల్లాంటి కుక్కలు అందరికీ వున్నాయి. యెక్కడ బడితే అక్కడ చూడొచ్చు వాటిని. అది 25 రూబుల్లు చేసిందంటే చాలా గొప్పసంగతన్నమాట !

నటాల్యా : యివాళ నిన్నెదో భూతం ఆవహించి అలా యెడ్డెమంటే తెడ్డెం అని పిస్తున్న దనుకొంటా ఇవాన్ వాసిలీ విచ్. మొదట, యెద్దులబీడు నాదని వాదించావు. యిప్పుడేమో, స్కీ్వజరుకంటే గెస్ మంచి దంటున్నావు. లోపల వొకటి పెట్టుకొని, పైకి యింకొకటి చెప్పే మనుష్యులంటే నా కిష్టం లేదు. యెందుకంటే, మీ అలగాజాతి గెస్ కంటే మా స్కీ్వజరు వందరెట్లు మెరుగని నీకు బాగా తెలుసు. యెందుకని నువ్వు ఆసంగతి కాదని వాదించేది ?

లోమోవు : చూడూ, నటాల్యా స్టిపనోవా. నన్ను నువ్వు గుడ్డివాడికిందో, పిచ్చి వెంగళప్పకిందో జమకట్టి నట్లుంది. చూడూ. స్కీ్వజరు గురిలేని కుక్కని నువ్వు వొప్పుకొని తీరాలి.

నటాల్యా : అది నిజంగాదు.

లోమోవు : నిజం !

నటాల్యా : నిజంగాదు.

లోమోవు : యెందుకమ్మా అట్లా అరుస్తావూ ?

నటాల్యా : యెందుకు చెత్తాఖానీ కభుర్లు చెబుతావు ? అసలు మీగెస్ ని యిప్పటికే యీడ్చి దూరంగా పారెయ్యాల్సింది. అలాంటిదానితోనా మా స్కీ్వజర్ ను పోల్చుతున్నావు ?

లోమోవు : క్షమించాలి. యిక నేను వాదన చెయ్యలేను. నాంగుండె అదురుతున్నది.

నటాల్యా : పీసపావుగూడా తెలీని వేటగాళ్లు పెద్దగా వాదిస్తారని నే నెరుగుదును.

లోమోవు : దయవుంచి కొంచెం వూరుకోవమ్మా.... నా గుండె ముక్కలైపోతున్నది...(అరుస్తాడు) నోర్ముయ్ !

నటాల్యా : మీ గెస్ కంటే మా స్కీ్వజరే వందరెట్లని నువ్వు ఒప్పుకొనే దాకా నేను నోరుముయ్యను.

లోమోవు : వందరెట్లు వాని ! నువ్వూనీ స్కీ్వజరూ గలిసి వురిబెట్టుకోండి. దాని తల ... కాళ్లు...,భుజం...

నటాల్యా : అసలు నీ ఛణాసీకుక్కని చంపాల్సిన అవుసరం లేదు; అది సగం చచ్చేవున్నది.

లోమోవు : (యేడుస్తాడు) నోర్ముయ్! నాగుండె బద్ద లవుతున్నది.

(ఛుబుకోవు వస్తాడు)

ఛుబుకోవు : మళ్లీ యేమి గొడవర్రా ?

నటాల్యా : అతని గెస్సా, మన స్కీ్వజరా, యేది మెరుగో చెప్పవే, నాన్నా.

లోమోవు : స్టీపన్ స్టిపానోవిచ్ గారూ, వొక్క సంగతి మాత్రమే చెప్పండని మిమ్మల్ని బతిమాలుతున్నా. మీ స్కీ్వజరు గురిలేనికుక్క అవునా కాదా ?

ఛుబుకోవు : అవుననుకో. ఐతేమాత్రమేమిటి ? యీ జిల్లామొత్తంలో గిత్తంలో దానివంటి మంచికుక్క గించికుక్క లేదు !

లోమోవు : మరి నాగెస్ దానికంటే మెరుగుగాదా ? నిజం చెప్పండి.

ఛుబుకోవు : తత్తర బిత్తర పడమాకుర్రా, చిట్టిబాబూ. నన్ను చెప్పనియ్య...మీ గెస్ కుంటే మంచిలక్షణాలు మీ గెస్ కున్నాయి... అది మేలుజాతిది. మాంచి పక్కటెంకలుగలది. యింకొ అదీ యిదీనూ. అయితే చూడూ. నువ్వూ యదార్థం తెల్సికోవాలంటే దానికి రెండు లోపాలున్నాయి. వొకటి : అది ముసల్ది. రెండోది : దాని మూతి పొడుగు తక్కువ.

లోమోవు : క్షమించాలి. నాగుండె... యదార్థవిషయాలు చూద్దాం పట్టండి. మేరుసిన్ స్కీ గారీ మధ్యాన వేటకెళ్లినప్పుడు, మాకుక్క జమీందారుగారి కుక్కతో సమానంగా పరుగెత్తిందనీ, మీ కుక్కేమో వొక అరమైలుకి వెనకాలపడిందనీ మీకు జ్ఞాపకమే వుండొచ్చు.

ఛుబుకోవు : అది యెందుకు వెనక పడిందంటే, జమీందారు కుక్కలతోటే మనిషి మా కుక్కని కొరడాతో గొట్టాడు గనక.

లోమోవు : అందుకు తగిన కారణముంది గూడాను. తక్కిన కుక్కలన్నీ వొక నక్కని వేటాడుతూంటే, మీస్కీ్వజరు వొక గొర్రెతో కయ్యం బెట్టుకొని కూచున్నది.

ఛుబుకోవు : అది నిజంగాదు...బాబూ, నే నసలే ఖయ్యాళీమనిషిని. కనక యిక వాదన చెయ్యడం ఆపేసెయ్యి. ప్రతివాడికీ రెండోవాడి కుక్కంటే అసూయగాబట్టి, ఆ అసూయతోనే నువ్వుగూడా వాదన యెత్తుకొన్నావు. అవును. మనమంతా అసూయాపరులమే ! సార్. నువ్వు గూడా నిర్దోషివిగాదు. నీగెస్ కంటే మంచి కుక్క వుందని తెలిస్తే. ఇకనువ్వు అదీ ఇదీ...ఇంకొకటీ...మొదలైనవి. యెత్తుకుంటావు. నా కన్నీ జ్ఞాపకమే !

లోమోవు : నాకూ జ్ఞాపకమే !

ఛుబుకోవు : (అతన్ని వుడికిస్తూ) "నాకూ జ్ఞాపకమే !"...యేమిటి నీకు జ్ఞాపకం ?

లోమోవు : నాగుండె...నాకాలు నిద్రపోయింది... నేను...

నటాల్యా : (అతన్ని వుడికిస్తూ) "నా గుండె"...అసలు నువ్వేమి వేటగాడివి ? వంటింట్లోకి పోయి కూచుని, హాయిగా బొద్దింకలు పట్టుతూ వుండాల్సినవాడివి ; అంతే గాని నక్కల్ని వేటాడాల్సినవాడివి గాదు. హుం. "నా గుండె" !

ఛుబుకోవు : అవును. యథార్థంగా, అసలు నువ్వేమి వేటగాడివి ? యింటివద్ద కూచుని గుడ్లని పొదగాల్సిన రకానివి. అంతేగాని, జంతువుల్ని వేటాడటానికి తగినవాడివిగాదు. నువ్వు వేటాడవచ్చు. కాని నువ్వుచేసే పనల్లా యితర్లతో వాదం పెట్టుకోటమూ, వాళ్ల కుక్కల్ని గురించి అదీ యిదీ అనటమూనూ. నేను రేచిక్క మనిషిని. కనక సంభాషణ మార్చుదాం పట్టు. యేమైనా, అసలు నువ్వు వేటగాడివే గాదు !

లోమోవు : నువ్వు వేటగాడివా ? నువ్వు జమీందారుతో స్నేహంకోసమూ, కుట్రలు పన్నటంకోసమూ మాత్రమే వేటకి పోతావు...హబ్బా...నా గుండె...నువ్వు మోసగాడివి.

ఘుబుకోవు: యేమిటీ? నేను మోసగాడ్నా? (అరుస్తాడు) నోర్ముయ్!

లోమోవు: మోసగాడా!

ఘుబుకోవు: భగ్రభ్రాజమానం! భడుద్ధాయీ!!

లోమోవు: మొసలి యెలికా! మోసగాడా!!

ఘుబుకోవు: నోర్మోయ్. పిట్టని గాల్చినట్టు కాల్చి పారేస్తారా, శుంఠా!

లోమోవు: ప్రతివాడూ—హబ్బా, నా గుండె— ప్రతివాడూ నీ భార్య నిన్ను చీపురుకట్టతో సింగారించుతూండేదని యెరుగును...నా పాదాలు...కణతలు...మంటలు ... పడిపోతున్నా ... పడిపోతున్నా...

ఘుబుకోవు: నువ్వు నీ దాసీదాని పాత చెప్పుకింద అణిగిమణిగి వుండేవాడివని అందరూ యెరుగుదురు.

లోమోవు: అది, అది, అది...నా గుండె బద్దలయ్యింది ... నా భుజం వూడిపోయింది...నా భుజం యెక్కడుందీ?... నేను చచ్చిపోతున్నా...(వొక చేతుల కుర్చీలో కూలబడి పోతాడు) డాక్టర్ని పిలవండి! (మూర్ఛపోతాడు)

ఘుబుకోవు: భగ్రభ్రాజమానం! శుంఠా! నపుంసకుడా! నాకు జబ్బు వచ్చింది. (నీళ్లు తాగుతాడు) జబ్బువచ్చింది!

నటాల్యా: నువ్వేమి వేటగాడివి? నువ్వసలు గుర్రంమీద కూచోనుగూడా లేవు. నాన్నా, అదేమిటి, ఆయన అలా వున్నాడూ? నాన్నా! చూడు నాన్నా. (యేడుస్తుంది) ఇవాన్‌వాసిలీవిచ్! ఆయన చచ్చిపోయాడు!

ఘుబుకోవు: నాకు జబ్బుగా వుంది... గాలిగూడా పీల్చలేక పోతున్నా...గాలి!

నటాల్యా: ఆయన చచ్చిపోయాడు! (లోమోవు చొక్కా చేయిని లాగుతుంది) ఇవాన్‌వాసిలీవిచ్! నువ్వు నాకేమి చేశావు! ఆయన చచ్చిపోయాడు (వొక చేతుల కుర్చీలో కూలబడుతుంది) డాక్టర్! డాక్టర్!! (మూర్ఛలు)

ఘుబుకోవు: ఊఫ్!... హో ... యేమిటది? సంగతేమిటో చెప్పూ.

నటాల్యా: (యేడుస్తుంది) ఆయన చచ్చిపోయాడు...చచ్చిపోయాడు!

ఘుబుకోవు: యెవరు చచ్చిపోయారు? (లోమోవువంక చూస్తాడు) అవును. చచ్చిపోయాడు. నిజం! నీళ్లు! డాక్టర్! (లోమోవు నోటివద్దకి వొక పంచపాత్ర అందిస్తాడు) తాగు...వుహూఁ...తాగటం లేదు...అంటే అతను చచ్చిపోయాడూ అదీ యిదీ అన్నమాట...మనుషులందర్లోకీ నేను దౌర్భాగ్యుడ్ని. నేనింకా నా మెదడులోకి తుపాకిగుండు పేల్చుకోలే దెందుకని? నేనింకా నా గొంతు కోసుకోలే దెందుకని? నేనింకా ఆగిన దెందుకు? నాకొక కత్తి యివ్వండి. పిస్తోలొకటి యివ్వండి! (లోమోవు కదులుతాడు) కోలుకొంటున్నాడల్లే వుంది...కొంచెం నీళ్లు తాగవయ్యా...ఆఁ. అదీ సంగతి...

లోమోవు: నాకు చుక్కలు కనపడుతున్నాయి... నీటియావిరి... నే నెక్కడున్నాను?

ఘుబుకోవు: వూఁ త్వరగా లేచి, పెళ్ళి చేసికో. తర్వాత గంగలో దూకు! ఆమె గూడా యిష్టపడింది. (లోమోవుచేతిని తన కూతురు చేతిలో వుంచుతాడు) ఆమె యిష్టపడిందీ యింకా అదీ యిదీను. నేను మిమ్మల్ని ఆశీర్వదించుతున్నా గీశీర్వదించుతున్నా, కాని - బాబూ - నన్నుమాత్రం నామానాన వదలండి.

లోమోవు: (లేస్తూ) ఆ? యేమిటీ? యెవరికీ?

ఘుబుకోవు: ఆమె యిష్టపడింది. సరేనా? ముద్దుపెట్టుకొని మారణమవ్వండి.

నటాల్యా: (మూలుగుతుంది) ఆయన బతికాడు?... అవునవును... నాకిష్టమే.

ఘుబుకోవు: వొకర్నొకరు ముద్దెట్టుకోండీ!

లోమోవు: ఆఁ? ముద్దెట్టుకోనే దెవర్ని? (ఇద్దరూ ముద్దుపెట్టుకొంటారు) చాలా బాగుంది గూడాను. క్షమించాలి. అసలేమిటిదంతానూ? ఆఁనాకిప్ప డర్థమవుతున్నది.. నాగుండె...చుక్కలు ... నాకు సంతోషంగావుంది నటాల్యా ... (ఆమెచేయిని ముద్దుపెట్టుకొంటాడు) నాపాదం నిద్రపోయింది...

నటాల్యా: నాకు... నాకు గూడా సంతోషంగా వుంది.

ఘుబుకోవు: యెంత భారం తొలిగిపోయింది నా భుజాలమీదనుంచి! ఊఫ్

నటాల్యా: కాని...యిక నువ్వు స్క్వజర్ కంటే గెస్ నాసి అని వొప్పుకొంటావు గదూ?

లోమోవు: నాసిగాదు. మెరుగు!

నటాల్యా: నాసి!

ఘుబుకోవు: సరే. సంసారసాగరం యీదటం ప్రారంభించటానికిదొకమార్గం. కొంచెం షాంపేన్ పుచ్చుకోండ్రా ఇద్దరూనూ.

లోమోవు: మెరుగు?

నటాల్యా: నాసి! నాసి!! నాసి!!!

ఘుబుకోవు: (ఆమె నాపేట్లు చేయటంకోసం) షాంపేన్! షాంపేన్!! ★

ఐస్ ఫ్రూట్

(17-వ పేజీ తరువాయి)

తియ్యగా... మజాగా వుంటుంది...! బాబోయ్ కాళ్లు కాలిపోతున్నాయ్! గాజుపు కొడుతోంది... బాబోయ్! ఐస్ ఫ్రూట్!" అని.

అప్పుడే ఇంటికి వచ్చిన తండ్రి ఈమాటల్నివిని చాలా బాధపడ్డాడు. గోపన్నని లేపి అమ్మకం గురించి అడిగేడు.

"అమ్మకంబాగానే వుంది ... నువ్వు చెప్పిన రహస్యం బాగానే పనిచేసింది... కాని చెప్పులు లేకపోతే బతకలేను బాబా" అన్నాడు.

"యీ ఫస్టు రాగానే తప్పక చెప్పులు కొంటానుగా. అంతవరకూ ఓపికపట్టు" అన్నాడు.

"ఓపికపట్టాలి! మీరు డబ్బెట్టి పేకాట్లు ఆడి అర్ధరాత్రిళ్లు యిలాయింటికివస్తుండండి. వాడు చెప్పులులేక కాళ్లు కాయలు కాస్తుంటే అమ్మకం అమ్మి మీకు లాభం చేస్తుంటాడు. ఎండలో అరిచి... అరిచి... ఎప్పుడో గాడుపుకొట్టి గోడకు వాలిపోతాడు" అన్నది తల్లి.

"ఆఁ! నేను కొంటాగా...అన్ని మాటలెందుకు" అన్నాడు గోపన్న తండ్రి.

తల్లి మాట్లాడలేదు. ఆరాత్రి గడిచిపోయింది.

మర్నాడు గోపన్న ఎండలో బయల్దేరేడు. ఎండలో అరిచేడు .... "ఐస్ ఫ్రూట్- మజాగా వుంటుంది... కాళ్లు కాలుతున్నాయ్ బాబోయ్" ... 'బాబోయ్' అన్నమాట గట్టిగా అరిచేడు. హడలిపోయి జనంఅంతా బైటికి వచ్చిచూసేరు.

గోపన్న గోడకు వాలిపోయేడు గాడుపుకి. అతన్ని చూసి అంతా దుఃఖించేరు.

★

సినిమా:

సోవియట్ సినిమాకళా పరిణామం

వి. పుడోవ్కిన్

(జగత్ప్రసిద్ధ సోవియట్ చిత్రనిర్మాత)

★

[సోవియట్ రష్యా నుంచి వి. పుడోవ్కిన్ అనే చిత్ర నిర్మాతా, ఎన్. చెర్కాసోవ్ అనే నటుడూ ఇటీవల మన దేశానికి వచ్చివెళ్లారు. వీరు బొంబాయి, కలకత్తా నగరాలలో అఖండ సన్మానాలు పొంది జనవరి 31 న మద్రాసుకు వచ్చారు. మద్రాసుపౌరులు వారికి అభిమానపురస్సరంగా స్వాగత మిచ్చారు. ఎన్నో సంస్థలవారు సన్మానాలుకూడా, చేశారు. అందులో ఒక సన్మానంలో, పాణిని సంస్కృతభాషకు ఎటువంటి సేవ చేశాడో పుడోవ్కిన్ చలనచిత్రకళకు అటువంటి సేవ చేశాడని ఉద్ఘాటించ బడింది. అందులో అతిశయోక్తి ఏమీ లేదు. చలనచిత్రశిల్పానికి పుడోవ్కిన్ అపూర్వమైన దోహదం చేశాడు. మన చిత్రనిర్మాతలందరూ అతని "ఫిలిం టెక్నిక్" "ఫిలింఆక్టింగ్" అనే పుస్తకాలు చదివేఉన్నారు. అయితే అచ్చగా శిల్పంలోనే గాక సంఘపురోభివృద్ధికి తోడ్పడడంలోనూ, కళను ప్రజలపరం చెయ్యటంలోనూ సోవియట్ చిత్రాలు ఇతర దేశాల చిత్రాలకన్న మిన్నగా ఉండి, అంతర్జాతీయ చిత్రప్రదర్శనలలో అధికమైన బహూకృతులు పొందుతున్నాయి. అటువంటి ఉత్తమ చిత్రాలను నిర్మించడంలో దక్షుడన్నదానికి నిదర్శనంగా పుడోవ్కిన్ రెండు పర్యాయాలు స్టాలిన్ బహూకృతిని పొందిఉన్నాడు. సోవియట్ సినిమాకళ ఎటువంటి పరిణతి పొంది ఉన్నతస్థానానికి వచ్చిందో, పుడోవ్కిన్ ఈ క్రింది వ్యాసంలో వివరిస్తున్నాడు — సంపాదకుడు]

సోషలిస్టు వాస్తవికత:

"సోషలిస్టు వాస్తవికత" ఆధారంతో సోవియట్ సినిమాకళ పురోగమిస్తూ అభివృద్ధి చెందుతున్నది. మా ఉత్తమ చిత్రకారులు సృష్టించే ఉత్తమచిత్రాల బాహ్యాంతర తత్వాలను ఇదే నిర్ణయిస్తున్నది.

"సోషలిస్టు వాస్తవికత"అంటే ఏమిటి? కళాకారుడు తన సృష్టిద్వారా పరిసర వాస్తవికతకు కట్టుబడి ప్రజలందరి పనిలోనూ భాగస్వామిగా ఉండే విధానమే సోషలిస్టు వాస్తవికత. ఈ విధానం ద్వారా కళాకారుడు సోవియట్ వ్యవస్థ నిర్మించడంలో అధికంగా తోడ్పడతాడు. మా కళ జీవితాన్ని సమగ్రంగా ప్రతిబింబిస్తుంది గనక "వాస్తవికత" అంటాం; జీవితాన్ని పరిశీలించడమూ, ప్రతిబింబించడమూ కూడా సోవియట్ వ్యవస్థయొక్క అభివృద్ధికి కట్టుబడి ఉంటుంది గనక "సోషలిస్టు" అంటాం. అక్టోబరు సోషలిస్టు విప్లవం అనంతరం ఏర్పడిన వ్యవస్థలోనే ఈ విధానం అమలు జరిగే అవకాశం లభించటం సహజం. ఈ విధానానికి మా కష్టాలతోనూ, విజయాలతోనూ, ముఖ్యసంఘటనలతోనూ సన్నిహితసంబంధం ఉండటంకూడా సహజమే. అందుచేత, "సోషలిస్టు వాస్తవికత"తో కూడిన కళ యథార్థమైన ప్రజాకళ అనీ, ప్రజాస్వామిక కళ అనీ అనటానికి మాకు అధికార మున్నది. వివిధ దేశాలలో అమలులోఉన్న కళారీతులలో "సోషలిస్టు వాస్తవికత" ఒకటి అనుకోవటానికి వీలు లేదనటానికికూడా మాకు అధికార మున్నది. ఇతర రీతులవలె అది చావదు. అది ప్రజాజీవితంతో పుట్టి, ప్రజలవలెనే ఎల్లప్పుడూ అభివృద్ధి చెందుతూ, నిత్యయౌవ్వనియై, తరగనిదిగా ఉంటుంది.

అక్టోబరు విప్లవానంతరం మొలకెత్తిన నూతన సినిమాకళ ఆకాశంనుంచి ఊడిపడిందని నా భావంకాదు. ప్రాచీన రష్యను సంస్కృతితో దానికి వారసత్వ సంబంధం లేకపోలేదు. ఈ ప్రాచీనసంస్కృతిని చూసి మే మిప్పటికీ గర్విస్తూనే ఉన్నాం. పుష్కిన్, గొగోల్, బెలిన్‌స్కీ, దొబ్రోలుబోవ్, చెర్నిషెవ్‌స్కీ, టాల్‌స్టాయ్, గోర్కీలవంటి కళాకారుల భావాలను యువక కళాకారులు చాలావరకు వాడుకున్నారు. ఈ నూతనకళకు రష్యను అభ్యుదయభావ పరంపరతో సంబంధమున్నది.

జారు పరిపాలనలో జాతీయ సినిమాకళ ఉండే అవకాశం లేదు. జారు ప్రభుత్వం స్వార్థంకోసమై జాతీయతను వదలి విజాతీయతను ఆశ్రయించింది. విదేశీ సినిమా నిర్మాతలు జాతీయ సినిమాకళను అణచిపెట్టి లాభాలు పొందారు. అక్టోబరు విప్లవంతో సినిమా రంగంలో అరాజకానికి స్వస్తి చెప్పబడింది. జాతీయ స్వరూపమూ, సోషలిస్టు భావాలూగల సోవియట్ సినిమాకళ ఆరంభ మయింది.

అప్పటికి సోవియట్ సినిమాకళ ఇంకా గర్భస్థశిశువు ప్రాయంగా ఉన్నప్పటికీ

లెనిన్, ప్రజల సంస్కృతిని పెంపొందించటంలో సినిమాకు లభించగల ప్రాముఖ్యాన్ని సరిగా ఊహించి, "అన్ని కళలలోకి సినిమా ఉత్తమమైనదని నా ఉద్దేశం," అని చెప్పాడు.

సోవియట్ వ్యవస్థయొక్క చరిత్రకు కట్టుబడి, ఆ వ్యవస్థతోబాటే సోవియట్ సినిమా కళ అభివృద్ధి చెందింది. అందుచేత సోషలిస్టు నిర్మాణదశలకు అనుగుణంగా సోవియట్ సినిమా చరిత్రను విభజించవచ్చు.

ప్రజాజీవితంలో కలిగిన చారిత్రకసంఘటనలనుబట్టి వివిధ దశలలో సినిమా కళ తాలూకు వివరాలు ఏర్పడ్డాయి. విప్లవంతో మేధావులలో చీలిక ఏర్పడింది. వారిలో ఉత్తమోత్తములు నిర్భయంగా విప్లవ పక్షం అవలంబించారు. ఇతరులుపస్థాయించటమో, శాశ్వతంగా వెన్ను చూపటమో జరిగింది.

ప్రారంభదశ:

ప్రజాస్వామిక భావాలు గల సినిమా నిపుణులు ప్రజలతోకలిసి పనిప్రారంభించారు. సినిమా పరిశ్రమ జాతీయమై వారికి అనుకూల వాతావరణం ఏర్పడింది. సోవియట్ ప్రభుత్వం సినిమాకు కావలిసిన ఉపకరణా లిచ్చి, స్టూడియోలను, థియేటర్లనూ చక్కబెట్టింది, లెనిన్ శ్రద్ద చూపాడు. ఆయన ప్రోత్సాహంతో డాక్యుమెంటరీలు చురుకుగా పనిచేశాయి. వీటి ఆధారంతో నూతన సినిమా కళ ప్రారంభం కావటం అవసరమని ఆయన భావించాడు. వీటి ద్వారానే భావి సినిమా కళకు సోషలిస్టు వాస్తవికత సిద్ధిస్తుందని ఆయన ఉద్ఘాటించాడు. లెనిన్ ఆదేశంతో ఫిలిందళాలు ఏర్పడి దేశమంతా చుట్టు ముట్టాయి. యువకులైన ఆపరేటర్లూ, నిర్మాతలూ, నటులూ వీటిలో చేరి పనిచేశారు. అంతర్యుద్ధరంగాలలో జరిగే సంఘటనలనూ, ప్రజాజీవిత నూతన వ్యవస్థాపనా యత్నంలో జరిగే సంఘటనలనూ వీరు చిత్రాలుగా తయారుచేశారు. ఈ డాక్యుమెంటరీ చిత్రాల ప్రభావం వల్లనే తొలిస్వతంత్ర చిత్రాలలో ప్రచారం జాస్తిగా ఉండేది. వివిధప్రాంతాలలో తయారైన డాక్యుమెంటరీ చిత్రాలకు చెందిన దృశ్యాలను కలిపి గుచ్చటానికి రచయితలు ప్రయత్నించారు. సోవియట్ డాక్యుమెంటరీ చిత్రాలు సినిమాకళకు ప్రజా జీవితంతో లంకె కలిగించాయి. తొలి డాక్యుమెంటరీ చిత్ర నిర్మాతలు జీవితాన్ని యథాతథంగా చూపటానికి తమ సర్వశక్తులూ ధారపోశారు. సినిమా ప్రచారచిత్రాలు నిర్మించిన తొలి నిర్మాతలు డి. వెర్టోవ్ అనే వాడూ, ఈ. షుబ్ అనే ఆమే. ఈ "వాస్తవ" చిత్రాలు విశేష ప్రజాదరణ పొంది ప్రజల నిర్మాణకృషిని ఉన్నదున్నట్టుగా చూపాయి. సోవియట్ డాక్యుమెంటరీ చిత్రాలకూ, కళాన్వితమైన సినిమా చిత్రసృష్టికీగల సన్నిహిత సంబంధం తెలుసుకో దగినది. కాని ప్రజాజీవితంతో సన్నిహిత సంబంధాలు అభివృద్ధి పరచుకోవటమూ, సోషలిస్టు వ్యవస్థ విజయవంతం కావడానికి జరిగిన కృషిలో కళాకారుడు నేరుగా పాల్గొనడమూ అంత సులభంగా జరగలేదు.

అవాంతరాలు:

కళాన్వితమైన సినిమా రంగానికి చెందిన



సోవియట్ సినిమా కళాకారులకు మద్రాసులో అభినందనసన్మానం జరిగింది. ఆ సందర్భంలో తియబడిన ఈచిత్రంలో సభకు అధ్యక్షత వహించిన మద్రాసుహైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గౌ. పి. వి. రాజమన్నారు, ప్రఖ్యాత సోవియట్ సినిమా చిత్రనిర్మాత వ్సెవొలోడ్ పుడోవ్కిన్, ప్రసిద్ధ సోవియట్ సినిమా-స్టేజినటుడు నికొలాయ్ చెర్కాసోవ్, రష్యారాయబారవర్గంలోని సాంస్కృతిక సంబంధాల కార్యదర్శి మదాం ఎర్జినా గార్లున్నారు.

నిర్మాతలూ, నటులూ ప్రజా జీవితాన్ని సరిగా ప్రతిబింబించడానికి చాలా అవాంతరాలు ఏర్పడ్డాయి. జీవితాన్ని గురించి సరిగా తెలియకపోవడం, జీవితంతో సంబంధంలేని ప్రేక్షకులలాగా దూరాన్నుంచి జీవితాన్ని సందర్శించడం, నూతన పరిస్థితులలో పనికిరాని కరడుగట్టిన శిల్పవిధానాలను విసర్జించకపోవడం, కొత్త మనస్తత్వం అవలంబించి నూతనవిధులు నిర్వర్తించేశక్తి సంపాదించకపోవడం జరిగింది. అయినప్పటికీ పాతకాలపు నిపుణులు నూతన ఇతివృత్తాలను చిత్రాలకు ఉపయోగించగలిగారు. ఇట్టివారిలో ప్రథముడు జార్జియాకు చెందిన పెరిస్టియానీ. కళాన్వితమైన సినిమా చిత్రాలలో ఈయన తయారుచేసిన "రెడ్ ఇంప్స్" అనే చిత్రం సోషలిస్టు వాస్తవికతతో కూడిన తొలిచిత్రం. ప్రజాసేవచేసిన ఒక శ్రామికుడు తన పిల్లలను సోవియట్ రాజ్యానికి కైంకర్యం చేస్తాడు. వారు రెడ్ ఆర్మీతో కలిసి పోరాడతారు. ఈ చిత్రంలో హాస్యంకూడా ఉన్నది. కాని నూతన సినిమాకళకు ప్రాణం పోసినది పాతకాలపువారుకారు. సోవియట్ ప్రభుత్వం ప్రజలందరికీ కళాప్రవేశం కలిగించింది. రకరకాల వృత్తులలో ఉన్న యువకులు సినిమాలో ప్రవేశించారు. ఐజెన్‌స్టయిన్ ఇంజనీరు, రోమ్ వైద్యుడు, పుడోవ్కిన్ కెమిస్టు, ఎర్మ్లర్ రెడార్మీలో సైనికుడుగానూ, రాజకీయ కార్యకర్తగానూ పనిచేసినవాడు. వీరంతా సినిమాలో ప్రవేశించారు. యుక్రేన్‌లో డూజెన్కో అనే చిత్రకారుడూ, జార్జియాలో చియారెలీ అనే శిల్పి సినిమాలో ప్రవేశించారు.

వీరంతా యువకులు, దృఢకాయులు, పని చెయ్యటానికి తహ తహ లాడుతూ, నిశ్చల ధైర్యంతో కూడుకున్నవారు. తీవ్రమైన చర్చలుజరిగి, ప్రయోగాలు సాగాయి. కాని సోవియట్ సినిమా కళకు జీవితవాస్తవికత తెచ్చిపెట్టిన విధులను నిర్వర్తించే పరిపాకమూ అనుభవమూ, జ్ఞానమూ వీరికింకా లేదు. అమెరికాలో తయారయే డిటెక్టివు చిత్రాలనుకులెషావ్ ఆదర్శంగాతీసుకున్నాడన్నది ఒక ఉదాహరణ. అట్లాగే, విడ్డూరమైన చిత్రాలు తీసే ఆశయంతో కోజిన్‌త్సెవ్, ట్రౌబెర్గ్ అనే నిర్మాతలు లెనిన్‌గ్రాడ్‌లో ఒక సంఘాన్ని స్థాపించారు. ఐజెన్‌స్టయిన్ తీసిన తొలి చిత్రం "సమ్మె"లో గారడీ తప్ప ఇంకేమీ లేదు. కాని ఈ క్లిష్ట పరిస్థితులలో ఉండి సోషలిస్టు వాస్తవికతను అర్థంచేసుకోవటానికి యత్నం జరిగింది.

1924–27 మధ్య అనేక చిత్రాలు విప్లవ సంఘటనలను నూతనదృష్టితో చిత్రించాయి. అట్టి తొలిచిత్రాలలో ఐజెన్‌స్టయిన్ తయారుచేసిన "పోటెమ్కిన్" ఒకటి. తొలి శదలో తయారైనచిత్రాలలో ఇది ప్రతిభావంతమైనది 1905 లో "ప్రిన్స్ పొటెంకిన్" నౌకపై నావికులుచేసిన తిరుగుబాటు ఇందులో చిత్రించ బడింది. ఈ చిత్రంలోని నూతనత్వమూ, శక్తికూడా విప్లవ ఆదర్శాలలో ఉద్భవించినవే. వీటిని ఈ యువకనిర్మాత బాగా అవగాహన చేసుకున్నాడు. ఈ చిత్రం ప్రపంచమంతటా కీర్తిసంపాదించడమేకాక భావి నిర్మాతలపైతన ప్రభావం పరిపి తోడ్పడింది. అనేకమంది ఏకమై, ఏకదీక్షతో, ఏకలక్ష్యంతో పనిచేసిన ఫలితం ఈచిత్రం. ఇందులో ఒక ప్రధానపాత్ర ఉండటమూ, మిగిలినవారు ఆ పాత్రకు హంగుగాఉండటమూ అనేదిలేదు. అన్ని పాత్రలనూ వివరంగానూ, వ్యక్తిత్వంతోనూ చిత్రించటం సాధ్యమన్నది రుజువయింది. "పొటెమ్కిన్" అనంతరం నేను గోర్కీనవల ఆధారంతో "అమ్మ" అనే చిత్రమూ, "సెయింట్ పీటర్స్ బర్గ్," "ఆసియాలో తుఫాను" అన్న చిత్రాలు వరుసగా తయారుచేశాను

యుక్రేన్‌లోనూ, జార్జియాలోనూ కూడా మంచిచిత్రాలు నిర్మాణం కాసాగాయి. కొత్త చిత్రాలుతీసే వారందరూ "పొటెమ్కిన్"లో ఉపయోగించిన సృష్టి విధానాలను ఉపయోగించుకొంటూ నటననూ, పాత్రపోషణనూ అభివృద్ధి చేశారు. తెరమీద కనిపించే పాత్రకు సోషలిస్టు వ్యవస్థకు చెందిననాయకుడి లక్షణాలు ఆపాదించబడ్డాయి. ఈ నాయకుడి సమగ్ర స్వరూపం ఇంకా చిత్రించ బడవలసి ఉన్నది.

సోవియట్ సినిమాయొక్క తొలిదశ ముగిసే కాలానికి కళాసృష్టి కేంద్రీకరణ చక్కగా జరిగింది. వ్యవసాయాన్ని చక్కబెట్టి, దేశాన్ని పారిశ్రామికం చెయ్యడానికి ప్రజలు చేస్తున్నకృషిని డాక్యుమెంటరీ చిత్రాలూకూడా ప్రతిబింబించాయి.

కాని సోషలిస్టు వాస్తవికతమీద ఇంకా విజాతీయ, విధ్వంసాత్మక శక్తులప్రభావం ఉంటూ వచ్చింది. వాటిమూలంగా అనేకమంది ప్రతిభావంతుల సృష్టి దెబ్బతింటూ వచ్చింది. ఈ మాలిన్యాన్ని కడిగివెయ్యవలసిన అవసరంగుర్తించ బడింది.

టాకీ చిత్రాలు:

1930 లగాయతు సోవియట్ వ్యవస్థలో నూతనాధ్యాయం ప్రారంభమై దానితోబాటు కళను ఎదుర్కొనే సమస్యలుకూడా పెరిగాయి. ఈ దశలోనే టాకీలుకూడా వచ్చాయి. ఈ దశలో ప్రభుత్వం సాంస్కృతిక, విద్యాకార్యక్రమాన్నీ, శాంతియుత ఆర్థిక వ్యవస్థాపనలనూ సాగించింది.

ఈ కారణంచేత చిత్రాలు ప్రజల సంస్కృతిని శీఘ్రంగా అభివృద్ధిచేసి బోధించవలసిన అవసరం జీవితంనుంచే ఏర్పడింది. ప్రజల సామాన్య కార్యకలాపాలలో కళాకారులు చేరి పనిచేయవలసిన అగత్యంకలిగింది. అయినప్పటికీ నేనన్నట్టు కళాకారుల్లోనుంచి కేవల స్థూల బాహ్య స్వరూపాల మీదనూ, నిరుపయోగమైన విధానాలమీదనూ మోజుపోలేదు.

శుష్కశిల్ప వాదంగురించి తీవ్రమైన సంఘర్షణ చెలరేగింది. ఇదిబహుముఖాలుగా దేశమంతటా వ్యాపించింది. ఈ సంఘర్షణ ద్వారా సినిమాకళాకారులు చాలా నేర్చుకున్నారు.

శుష్కశిల్పవాదం కళాకారుణ్ణి ప్రజల యథార్థ జీవితంనుంచీ, దాని సమస్యలనుంచీ ఎడంచేస్తుంది. ఒక ఉదాహరణ చెబుతాను. వాస్తవికతకు చెందిన ఒక అమూల్యమైన విషయాన్ని తీసుకోండి. దానిని కళాదృష్టితో వీక్షించండి. ఈ పని రెండు విధాలుగా చెయ్యవచ్చు. ఒకపద్ధతిలో మిమ్మల్ని మీరు మళ్లీ మళ్లీ పరిశోధించుకుంటూ, మీరు చేస్తున్న సృష్టి యథార్థ పరిణామాలకు అనుగుణంగా ఉన్నదీ లేనిదీ చూడటానికి మళ్లీ మళ్లీ జీవితాన్ని పరిశీలిస్తూ, మీ భావాలూ, ఆశయాలూ ప్రజలభావాలతోనూ, ఆశయాలతోనూ సామ్యంకలిగి ఉన్నాయో లేదో అని మథనపడవచ్చు. ఈ విధంగా మీరు ముందుకుపోతారు. ఇది వాస్తవికత పద్ధతి. రెండోపద్ధతికూడా ఉన్నది. కళాకారుడు తన ఆత్మ ప్రపంచంతప్ప ఇంకేమీ తెలుసుకోగోరడు. అదే అతనికి సమస్తమూ అయిఉంటుంది. అట్టి కళాకారుణ్ణి యథార్థ జీవితంలో ఒక పార్శ్వం తన బాహ్య సౌందర్యంతోనో, అంతర్లయతోనూ ఆకర్షించవచ్చు. అట్టికళాకారుడు క్రమంగా తనకే తెలియకుండా వాస్తవ ప్రపంచాన్ని విడిచిపెట్టి తన భావనలో మాత్రమే గల నిస్సారప్రపంచంలో చిక్కుకుపోయి, మానవ సంస్కృతికి దూరమవుతాడు. ఈ ప్రపంచంలో సజీవసంఘటనలు నిర్జీవ ఛాయలుగా మారతాయి. వాస్తవ సంఘట

(38–వ పేజీ చూడండి)



బొమ్మరిల్లు

చిగురుటాకులు: 2

మా చెల్లాయి

శ్రీ అడివి బాపిరాజు

మా చెల్లా యెల్లా దొరికిందో
    నాకు తెలుసునూ,
మాయిల్లంత నవ్వింది
    నాకు తెలుసునూ.

*   *   *

చందమామ కొండపైన
    అందగాడూ,
ముందు వెనక వచ్చారు
    చుక్కల్ల పాపలూ.

*   *   *

ముందు తోటలో మల్లె
పందిరిపై పూలతీగ;
తీగకింద మా నాన్న
మూగగా ఉన్నాడు.

*   *   *

మా నాన్న ఒళ్లో నే నున్నా;
మా నాన్న నన్ను ముద్దెట్టి
'ఎవరు వస్తారమ్మా చెప్మా,
ఇదిగో వేళ్లు పట్టు' మనెను.

*   *   *

'చెల్లే కావాలి నాన్న!
చెల్లీ నేను బువ్వాలాట
ఆడుకొంటా' మంటిని;
అదుముకొనెను నన్ను నాన్న.

*   *   *

మల్లెపూలు, మాలతులు,
విల్లివిరిసే కేరాణీ,
పూలన్నీ చేరినాయి;
పూల గుత్తులన్ని కలిపి,
పూలరంగు లన్ని కలిసి
పురిటింటికి తేలిపోయె;
కేరుమంటు మా చెల్లీ
చేరుకుంది మా యిల్లూ.

మా చెల్లా యెల్లా దొరికిందో
    నాకు తెలుసునూ,
మా యిల్లంత నవ్వింది
    నాకు తెలుసునూ.



టామ్ సాయర్ ... మార్క్ ట్వేన్

టామ్ చాలాసేపు దీక్షగా ఆలోచించాడు. చివరికిలాగన్నాడు:

"ఒకపని చేద్దాం. ఆ రెండో నంబరు గదికి ఒక దొడ్డితలుపు వుంది. హోటలుకూ, ఇటికల దుకాణపు మొండిగోడలకూ మధ్య వుండే ఒక ఇరుకు సందు? ఆ సందు వెంబడే వెడితే నంబర్ 2. దొడ్డితలుపును చేరుకోవచ్చు. నువ్వు నీకు దొరికినన్ని తాళం చెవుల గుత్తులు తీసుకు రా. నేను మా పెద్దమ్మ తాళంచెవులన్నీ ఎత్తుకొస్తాను. ఏ రాత్రయితే కటిక చీకటిగా వుంటుందో, ఆ రాత్రే వెళ్లి దొడ్డితలుపుగుండా లోపలికి దూరదాం. ఇదిగో ఒక మాట. పగతీర్చుకోటానికి ఇంజన్ జో ఊళ్లో సంచారం చేస్తానన్నాడు. వాడు కనిపిస్తేమాత్రం వదలకు; వెంట పడు. వాడు నంబర్ రెండులోకి వెడితే సరేసరి; లేకపోతే అది కాదన్నమాట."

"అమ్మో! నేను ఇంజన్ జోని ఒక్కణ్ణే వెంబడించలేను."

"హాక్! రాత్రిపూట చీకట్లో వెంబడిస్తే ఏం ఫర్వాలేదు. ఒకవేళ వాడు నిన్ను చూసినా ఏమీ అనుకోడు."

"సరే; బాగా చీకటిగా వుంటే వెంటపడతా. ఏమో తెలియదు ఎల్లా వుంటుందో, చూస్తాను."

"పందెం. నేనైతే చీకట్లో వాణ్ణి వెంబడించగలను."

"అయితే వెడతానులే టామ్!"

"ఆ, అదీ మొగతనమంటే; అల్లాగుండాలి. భయపడబోకు హాక్! నేనున్నా నిన్ను రక్షించటానికి."

* * *

ఆ రాత్రి మన వీరు లిద్దరూ ఇంజన్ జో అంతు కనుక్కోటానికి సిద్ధమయ్యారు. తొమ్మిదింటిదాకా హోటలు చుట్టుపక్కలే తచ్చాడారు. ఒకళ్లు సందు మొగలోనూ, ఇంకొకళ్లు ఇంకొంచెం దూరంలోనూ గస్తీ తిరిగారు. సందులోకి ఎవరూ వెళ్లలేదు; అందులోనుంచి బయటికి ఎవరూ రాలేదు. అల్లాగే గదిలోనుంచి ఎవరూ ఇవతలకీ రాలేదు; లోనికీ పోలేదు.

ఆ రాత్రి అనుకూలంగా ఉండేటట్లే ఉన్నది. అందుచేత టామ్ ఇంటికి వెళ్లిపోయాడు. చీకటి దట్టంగా ఉండేపక్షంలో హాక్ వచ్చి 'మ్యావ్' మనాలి. వెంటనే టామ్ లేచి తాళంచెవుల గుత్తులతోసహా తయారవుతాడు. అది ఒడంబడిక.

కాని, దురదృష్టవశాత్తు ఆ రాత్రి వెన్నెల పుచ్చపువ్వులా కాసింది. అందుచేత కొంతసేపు హాక్ కాపలా కాశాడు; చివరికి నిద్ర ఆపుకోలేక పన్నెండుగంటల వేళ ఒక ఖాళీషెడ్డులో దూరి నిద్రపోయాడు.

మంగళవారంనాడు కూడా అదృష్టం కలిసిరాలేదు. బుధవారమూ అంతే. గురువారంరాత్రి కొంచెం ఆశాచిహ్నాలు కనిపించాయి. అదను కనిపెట్టి టామ్, పెద్దమ్మ పాతలాంతరును సంగ్రహించి బయటికి వచ్చాడు. లైటు వెల్తురు కనపడకుండా దుప్పటి కప్పుకున్నాడు. లాంతరు హాక్ ఖాళీషెడ్డులో దాచాడు. గస్తీ ప్రారంభమయింది. పదకొండు గంటలవేళ హోటలులోని లైట్లన్నీ ఆరిపోయాయి. ఇక చుట్టుపక్కల ఎక్కడా దీపమన్నమాటే లేదు. స్పెయిన్‌దేశస్థుడి వేషంలో వున్న దౌర్భాగ్యు డెవరూ సందులోకి పోలేదు; ఇవతలకి రాలేదు. అంతా అనుకూలంగానే వుంది. గాఢాంధకారం రాజ్యం చేస్తోంది. అప్పుడప్పుడు దూరంగా ఉరుముల మోత తప్ప మరే శబ్దమూ వినిపించటంలేదు.

షెడ్డులో లాంతరు వెలిగించాడు టామ్. దుప్పటి కప్పుకుని లోపల లాంతరు దాచాడు. మెల్లిగా ఇద్దరు యోధులు సందును సమీపించారు. సందుమొగలో హాక్ కాపలా వున్నాడు. టామ్ సందులో ప్రవేశించాడు.

తరవాత కొన్ని నిముషాలు గడిచాయి. నిముషా లేమిటి? అవి యుగాలుగా కనిపించాయి ఒంటరిగా కాపలా కాస్తున్న హాక్‌కి. పర్వతమంత బరువుగల ఒక ఆందోళన అతని గుండెలమీద కూర్చుంది. ఆ చీకట్లో దీపం కనిపిస్తే బావుండును; టామ్ ఇంకా బతికే వున్నాడని ధ్రువపడుతుంది. టామ్ వెళ్లి చాలా గంటలై వుంటుంది. బహుశా మూర్ఛపోయి వుంటాడు; లేక చచ్చిపోయి వుండచ్చు. భయంవల్ల అతని గుండె 'బెలూన్' మల్లే టప్పుమని బద్దలై వూరుకుంటుందేమో.

ఇల్లా ఆలోచిస్తూ హాక్ తనకు తెలియకుండానే సందులోకి నడిచి వచ్చి హోటలుకేసి వెడుతున్నాడు. చాలా భయంకరమైన ఆలోచనలు వస్తున్నాయి. ఏ నిమిషంలోనైనా ప్రళయంలాంటిది సంభవించవచ్చునని అనుమానిస్తున్నాడు. అతని గుండె కొట్టుకునే పద్ధతి చూస్తే, అది రొమ్ము చీల్చుకుని ఊడిపడుతుందేమో ననిపించింది.

హఠాత్తుగా మెరుపు మెరిసినట్లు దీపంవెల్తురు! టామ్ పరుగెత్తుకొచ్చి హాక్ మీద పడి,

“పారిపో! పారిపో బతికుంటే బలుసాకు తినచ్చు,” అన్నాడు.

టామ్ ఈ రెండుముక్కలు అనే లోపలే హాక్ కాలు జాడించాడు. గంటకి ముప్పయి, నలభై మైళ్ల వేగంతో పరుగుపుచ్చుకున్నాడు. ఊరిచివర కసాయి దుకాణపుషెడ్డు చేరిందాకా ఇద్దరూ పరుగు ఆ. లేదు. షెడ్డులోకి వచ్చి పడ్డారో లేదో, బ్రహ్మాండమైన తుపాను ప్రారంభమైంది. టామ్ కాస్త తేరుకోగానే ఇలా గన్నాడు:—

“హాక్! ఏం చెప్పను రా....... రెండు తాళంచెవులు పెట్టి ప్రయత్నించాను. ఎంత మెల్లిగా తిప్పానో! అయినా అవి గర్రుమన్నాయి. బలే భయంవేసింది. తాళం రాలేదు. నాకు తెలియకుండానే గొళ్ళెం పట్టుకున్నాను. తలుపు ఇట్టే వచ్చేసింది. అసలు తాళంవేసి లేదు. నెమ్మదిగా లోపల కడుగుపెట్టాను. దుప్పటి తీసివేశాను...వెంటనే వెయ్యి పిడుగులు పడినట్టయింది...”

“ఏమిటి? ఏంజరిగింది. టామ్?”

“ఇంజన్‌జో చేతిని దాదాపు తొక్కేశాను.”

“నిజంగా?....”

“అక్కడ నేలమీద కాళ్లు, చేతులు బారచాచుకుని కొండచిలవలా పడుకుని ఉన్నాడు వాడు. బాగా, దిట్టంగా నిద్రపోతున్నాడు.”

“బాప్ రే! నువ్వేం చేశావ్? వాడు లేచాడా?”

“ఊహూ. బాగా తాగినట్టున్నాడు; లేవలేదు. ఆ దుప్పటి తీసుకుని పరుగెత్తుకొచ్చాను.”

“నేనైతే ఆ దుప్పటిమాటమర్చిపోయి పారిపోయి వచ్చేసేవాణ్ణి.”

“అది పోతే మా పెద్దమ్మ చర్మం వొలిచేస్తుంది.”

“ఆ పెట్టె కనిపించిందా?”

"చుట్టూ చూసేదాకా నేను ఆగలేదు. పెట్టె కనిపించలేదు; "శిలువ" కనిపించలేదు. ఇంజన్‌జో పక్కన ఒక సీసా, రేకు గ్లాసు మాత్రం కనిపించాయి. రెండు పెద్ద పీపాలు, బోలెడు సీసాలు కూడా కనిపించాయి. ఆ గదిలో దెయ్యాలున్నట్టు హోటలువాళ్లు భయపడటానికి కారణం ఇప్పటికైనా తెలిసిందా?"

"తెలవలా."

"ఆ గదిలో విస్కీ దెయ్యాలున్నాయన్నమాట."

"కావచ్చు. కాని టామ్! ఇంజన్‌జో మత్తెక్కి పడుకునుంటే, ఇదేసమయం ఆ పెట్టె ఎత్తుకురావటానికి."

"అవును. నువ్వు మరి వెళ్లొస్తావా?"

హక్ మోకాళ్లు గజగజ కొట్టుకున్నాయి.

"నేను వెళ్లలేను."

"నేనూ వెళ్లలేను. హక్! ఇంజన్‌జో పక్కన ఒకటే సీసా ఉంది. కనీసం మూడు సీసాలైనా వుంటేగాని వాడికి మళ్లీ లేవలేనంత మత్తెక్కదు. అప్పుడు నే నొక్కణ్ణే వెళ్లి పెట్టె ఎత్తుకొచ్చేవాణ్ణి."

కాసేపు మౌనంగా ఇద్దరూ దీర్ఘాలోచన చేశారు. టామ్ ఇలాగన్నాడు:—

"హక్! ఆ గదిలో ఇంజన్‌జో ఉన్నంతకాలం మన మటుకేసి వెళ్లగూడదు. అది ప్రమాదం. ప్రతిరాత్రీ మనం కాపలాకాస్తే ఎప్పుడో ఒకప్పుడు వాడు అవతలికి వెళ్లటం చూస్తాం. అప్పుడు కన్ను మూసి కన్ను తెరిచేటంతలో పెట్టె నెత్తుకు రాగలం."

"నేను ఒప్పుకుంటున్నా దానికి. ఈ రాత్రే కాదు, ప్రతిరాత్రీ—తెల్లవారేదాకా నేను గస్తీ తిరుగుతాను. ఆ మిగతాపనిమాత్రం నువ్వే చెయ్యాలి."

"ఆల్‌రైట్! నువ్వు ఒక పని చెయ్యాలి. హూపర్ వీధికివచ్చి "మ్యావ్" అనాలి. నే నింకా లేవకపోతే కిటికీమీద బెడ్డలు వెయ్యి. నేను చెంగున లేస్తాను. వాన వెలిసింది. నేను ఇంటికి పోతాను. ఇంక రెండుగంటల్లో తెల్లారుతుంది. ఈ రెండుగంటలూ నువ్వు కాపలా కాస్తావుకదూ?"

"టామ్! కాస్తానని అన్నాను. కాసి తీరుతాను. ఏడాదిదాకా ప్రతిరాత్రీ ఆ హోటల్ని దెయ్యంలాగా పట్టుకుని వదలను."

"సరే. కాని నీ పడక ఎక్కడా?"

"బెన్‌రోజర్సువాళ్ల గడ్డివాము చాటున. నే నక్కడ పడుకున్నా బెన్ ఏమీ అనడు. వాళ్ళ నీగ్రో నౌకరు జేక్ కూడా ఏమీ అనడు. జేక్ బలే మంచివాడు. అత నడిగినప్పుడల్లా నీళ్ళు మోసుకు తెచ్చిపెడుతూవుంటాను. నే నడిగినప్పుడల్లా తింటానికేమన్నా పెడుతూ వుంటాడు తనదగ్గిర వుంటే. నేనంటే అతని కిష్టం. ఎందుకంటే 'అతనికంటె గొప్పవాణ్ణి' అని ఎప్పుడూ అనుకోను. అతను నీగ్రో అయినా ఒకోసారి అతనితో కలిసి అన్నం తింటాను లోపల ఆకలి మాడుస్తుంటే ఎంత గొప్ప మనిషైనా కొన్ని కొన్ని నీచపు పనులు చెయ్యాల్సివస్తుంది."

"పగటిపూట పనేమీ లేకపోతే నువ్వు నీ యిష్టం వచ్చినంతసేపు పడుకో. నేనువచ్చి లేపను. రాత్రిళ్లు ఏమన్నా కనిపిస్తే మాత్రం వెంటనే వచ్చి "మ్యావ్" మనాలి. ఏం?"

* * *

శుక్రవారం పొద్దున నిద్ర లేచి లేవగానే టామ్‌కి ఒక గొప్ప శుభవార్త తెలిసింది. జడ్జి థాచర్ గారు పెళ్లాంబిడ్డలతోసహా విదేశాలనుంచి తిరిగివచ్చారు. వెంటనే ఇంజన్‌జో గుప్తధనం వగైరాలన్నీ టామ్ మనస్సులో ఒకమూలకి నెట్టివేయబడ్డాయి. బెకీథాచర్ ఆ ఖాళీ స్థలాన్నంతా ఆక్రమించుకుంది. బెకీని కలుసుకున్నాడు. మిగతా స్కూలుపిల్లల్తో కలిసి దాగుడుమూతలు మొదలైన ఆటలు చాలాసేపు ఆడారు.

బెకీ ఇదివరకు స్కూలు పిల్లలందర్నీ "పిక్‌నిక్" కి తీసికెడతానని వాగ్దానం చేసిందికదూ. ఇప్పుడు వాళ్ళమ్మని వేధించుకుతింది, ఆ మర్నాడే 'పిక్‌నిక్' కి పంపించవలసిందని. బెకీ పోరుపడలేక వాళ్ళమ్మ ఒప్పుకుంది. ఇక బెకీ ఆనందం వర్ణించతరం కాదు. టామ్‌కూడా తన సంతోషాన్ని దాచుకోలేదు. చీకటి పడకముందే అందరికీ ఆహ్వానాలు వెళ్లాయి. స్కూలుపిల్లలు వెంటనే 'పిక్‌నిక్' ప్రయత్నాలు, ఏర్పాట్లు ప్రారంభించారు. టామ్ సంతోషంతో ఉక్కిరి బిక్కిరై పోయి ఎంతసేపటికీ నిద్రపోనేలేదు.

హాక్ వచ్చి 'మ్యావ్' అంటాడేమో నని ఎదురు చూశాడు. ఎందుకంటే ఆ రాత్రి ఇంజన్ జో డబ్బును ఎత్తుకు వచ్చి మర్నాడు బెకీని, మిగతా పిల్లల్ని ఆశ్చర్యంలో ముంచెయ్యాలని అతని ఆశ. కాని ఆ రాత్రి ఎలాంటి సిగ్నలూ రాలేదు.

ఎలాగైతే నేం తెల్లవారింది. పది, పదకొండు గంటలకల్లా జడ్జి థాచర్ గారి యింటివద్ద పిల్లల కోలాహలం చెలరేగిపోతోంది. పెద్దవాళ్లు కూడా వెడితే పిల్లలకి సరదా చస్తుందని బెకీ తలిదండ్రులు బయల్దేరలేదు. పిల్లలని పద్ధెనిమిదేళ్ల ఆడపిల్లలు కొందరికీ, ఇరవై రెండు, ఇరవై మూడేళ్ల యువకులు కొందరికి అప్పచెప్పి 'భద్రం సుమా!' అని హెచ్చరించారు. నది దాటటానికి స్టీముబోటును అద్దెకు తీసుకున్నారు. తినుబండారాలు, ఇతర సామానులు చేతబట్టుకుని యాత్రికులు వీధుల్లో ఊరేగింపు మల్లే తర్లి వెళ్లారు. సిక్ కు ఒంట్లో బాగుండనందున అతనికి ఈ అదృష్టం పోయింది. అతన్ని చూస్తూ వుండటానికి మేరీకూడా ఇంటివద్దే ఉండిపోయింది. బెకీ తల్లి ఇలా చెప్పింది:—

"బెకీ! ఈ రాత్రి నువ్వు ఇంటికి రావద్దు. రేవు దగ్గిరగా వున్న స్నేహితుల యిళ్లల్లో ఎక్కడన్నా పడుకో. తెల్లవారిన తరవాత వద్దువుగాని."

"అయితే సుసీ హార్పర్ వాళ్ల యింట్లో ఉంటానమ్మా," అంది బెకీ.

"సరే. కాని జాగ్రత్తగా మసులుకో. ఎవ్వర్నీ ఇబ్బంది పెట్టకు."

కొంతదూరం పోయాక టామ్ బెకీతో ఇలా అన్నాడు:

"చూడు బెకీ! జో హార్పర్ ఇంటికి పోయే బదులు మనం డగ్లస్ అమ్మగారింటికి పోదాం. అక్కడ బలే బావుంటుంది. ఆవిడ మనకి ఐస్క్రీమ్ పెడుతుంది. ఆవిడ దగ్గర ఎప్పుడు చూసినా తట్టలు తట్టలు ఐస్క్రీమ్ వుంటుంది. మన నావిడ బాగా ఆదరిస్తుందికూడా."

"రైట్. బలే సర్దాగా వుంటుంది... కాని అమ్మ ఏమన్నా అంటుందేమో?"

"మీ అమ్మకి ఈ సంగతి ఎలా తెలుస్తుంది?"

బెకీ కాస్త ఆలోచించింది.

"మనం అమ్మకి చెప్పకుండా పోవటం మంచిది కాదనుకుంటా."

"ఫరవాలేదు బెకీ! మీ అమ్మకి తెలియదుగా? నువ్వు క్షేమంగా వుంటే ఎక్కడికెళ్లినా ఆవిడ ఏమీ అనుకోదు. అసలు ఆవిడకీ ఆలోచన తట్టితే అక్కడకే వెళ్లమనేది. పందెం."

డగ్లస్ అమ్మగారి అద్భుతమైన ఆతిథ్యం తలుచుకునేటప్పటికి బెకీకి నోరూరింది. అందువల్లనూ, టామ్ బలవంతంవల్లనూ బెకీ ఒప్పుకోక తప్పలేదు. కనుక, ఆ రాత్రి తమ కార్యక్రమాన్ని గూర్చి ఎవ్వరికీ చెప్పగూడదని నిశ్చయించుకున్నారు.

కాని హాక్ ఈ రాత్రే వచ్చి సిగ్నల్ ఇస్తాడేమో నని టామ్ అనుమానించాడు. దీంతో కొంత సరదా చచ్చింది. అయినా అమ్మగారి ఇంట్లో జరగబోయే వేడుకలను వదులుకోనటానికి టామ్ ఇష్టపడలేదు. కాకపోయినా కిందటిరాత్రి ఎంత ఎదురు చూసినా హాక్ రాలేదు. ఈ రాత్రి మాత్రం వస్తాడని నమ్మకమేముంది? రాత్రికి తప్పకుండా రాగల వేడుకని వదులుకుని, వస్తుందో రాదో అనుమానంగా వున్న గుప్త ధనంకోసం వెళ్లటం ఏమి వివేకం?

స్టీమ్ పడవ పోయి పోయి గ్రామానికి మూడు మైళ్ల దిగువన వున్న ఒక చోట లంగరు దింపింది. అక్కడ చాలా అందమైన అరణ్యం వుంది. కొద్దిసేపట్లోనే జనసంచారం ఎరగని ఆ అడవి యాత్రికుల నవ్వులతో, కేరింతలతో మారుమోగింది. వళ్లు వేడెక్కి, అలిసిపోవటానికి ఎన్ని మార్గాలున్నాయో అన్నీ పూర్తయ్యాక వాళ్లు తిరిగి తమ క్యాంపుకు వచ్చారు. వెంటనే తినుబండారాలమీద యుద్ధం ప్రకటించారు. రొట్టెలు, మాంసం మొదలైన శత్రువులనందర్నీ ధ్వంసం చేసే శాక చెట్ల నీడల్లో తృప్తిగా కాళ్లు చాచుకుని, తాపీగా ఆవులించారు.

ఇంతలో ఎవరో అన్నారు:

(35-వ పేజీ చూడండి)



తెల్లదొర...దుంగదొర

వరాలమ్మ చెరువులో వందలకొద్దీ కప్పలు చేరాయి. ఎప్పుడు చెరువునిండా నీళ్లుంటంవల్ల అవి అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకొన్నాయి. కొన్నాళ్లకు వాటిలో వాటికే తగాదాలు వచ్చి బ్రహ్మదేవునిగూర్చి తపస్సు చేసినై. బ్రహ్మ ప్రత్యక్షమయి "ఏం వరం కావాలి" అని అడిగాడు. అడిగిందే తడవుగా "మమ్మల్ని పాలించే ప్రభువు కావాలి దొరా" అన్నాయి. వెంటనే తెల్లదొర ప్రత్యక్ష మయ్యాడు.

కప్పప్రముఖులు తగాదాలు పడినపుడెల్లా, పొడుగుకాళ్ళ తెల్లదొరదగ్గరకు వెళ్ళి మనవి చేసుకొనేవి. తెల్లదొర వాళ్ళను పిలిచి, "మీరు తగాదా పడినపుడు, ముందుగా మీ రొకరు వచ్చి నాకు మనవి చేయాలి. అప్పుడు నేనొచ్చి పరిష్కారం చేస్తాను" అని ఆజ్ఞాపించాడు. ఆవిధంగానే మండూకాలు తగాదా పడినపుడెల్లా, వివాద పరిష్కారనిమిత్తం వంటరిగా వెళ్ళి మనవిచేసుకోవటం మొదలుపెట్టినై.

రచన:

శ్రీ అక్కాల బాబురావు

తెల్లదొరవారు సూక్ష్మమయిన నివారణమార్గం కనిపెట్టారు. వంటరిగా వచ్చి వినతి చేసుకొనే మండూకబాబులను స్వేచ్ఛగా భుజిస్తుండేవారు. ఈ విధంగా కొన్నాళ్లు గడిచినై. వెళ్ళిన తమ తోడికప్పలు వెళ్లినట్లుగానే మాయమవటం చూసి, కప్పలన్నీ బహిరంగసభ చేసికొని "మా కొద్దు ఈ తెల్లదొరతనం" అనే నినాదాలతో, తెల్లదొరకు వుద్వాసన యివ్వాలని సంకల్పించుకొని, బ్రహ్మనుగూర్చి ఘోరతపస్సు చేసినై. బ్రహ్మ వాళ్ళ మొరాలకించి, వాళ్ళలో వాళ్ళకు ఐకమత్యం లేనందుకు విచారించి, తెల్లదొరస్థానే "దుంగ దొర" ను నియమించాడు.

యధాప్రకారంగా తగాదాలు పడినపుడెల్లా, కప్పప్రముఖులు వచ్చి తమ దొరతో మనవిచేసుకుంటూ వుండేవాళ్లు. "దుంగదొర" కదలడు, మెదలడు. కొన్నాళ్లు చూసినై. తమ ప్రభువుమౌనాన్ని చూసి సహించలేక సమీపించినై. మెల్లిగా నెత్తిమీద కూడా యెక్కినై. కాని దుంగదొం కదల్లేదు; మెదల్లేదు.

అక్కణ్ణించీ కప్పల్లో మళ్ళీ అరాజకం ప్రారంభమైంది. బలవంతులు దుంగదొర నెత్తిమీద ఎక్కి మిగతా వాళ్ళందర్నీ ఇష్టమొచ్చినట్టు పరిపాలిస్తున్నాయి. బలహీనులు "ఎంతపని చేస్తివయ్యా, బ్రహ్మదేవుడా!" అని ఏడుస్తూ "ఇంతకంటే తెల్లదొరతనమే నయమే," అనుకున్నాయి. ★

తండ్రి ప్రేమ



సత్రాజయపురంలో రామయ్య అనే ఒక రైతు ఉండేవాడు. అతడు చాలా ధనవంతుడు. అతనికి ఇద్దరు కుమారులు కలరు. పెద్దవానిపేరు పాపయ్య, చిన్నవాని పేరు సీతయ్య. రామయ్య ఇద్దరు కొడుకులను కడు గారాబంతో పెంచుతుండేవాడు. కాని చిన్న కొడుకు సీతయ్య చాలా సోమరిపోతు. పనిదొంగ, బూటు, సూటులేసి బజారుల వెంటపోకిరి ముఠాలతో కలసి తిరుగుట సీతయ్యకు చాలా సరదా.

ఒకరోజున పాపయ్య చేనికివెళ్లి వస్తూతమ్ముడు సీతయ్య ఊరిబయట పోకిరిముఠాతో ఉండటంచూచాడు వాడెక్కడ చస్తేమానెలే అని పాపయ్య తనలో తాను అనుకొన్నాడు. మళ్లీ, ఈ విధంగా చెడిపోతే ఎట్లా అనుకొని పాపయ్య సీతయ్యతో "తమ్ముడూ, నాన్న ముసలివాడాయె, ఇంట్లోపనిచేసే దెవరు? మరి ఇట్లా తిరిగితే కడుపులోకి అన్నం ఎట్లా వస్తుంది"అని జాలితో అన్నాడు. "నీవు నాకు చెప్పేదేమిటి? నా భాగంలోనిది నేను తింటున్నాను. మీరు నాకు వ్రారికేపెట్టటంలేదు" అని కోపంతో మాట్లాడాడు సీతయ్య. "నీ భాగం ఉన్నప్పటికిన్నీ కష్ట పడి పనిచేసికొంటే నేనా" అన్నాడు మళ్లీ పాపయ్య. "అతిగా వాగేవా అంటే వీపు పగులుతుంది" అని సమాధానమిచ్చాడు సీతయ్య. కిక్కురు మనకుండా ఇంటికి వచ్చి జరిగిన సంగతంతా పాపయ్య తండ్రితో చెప్పాడు. తండ్రి చాల చింతిస్తూ వచ్చిన తరువాత కనుక్కొందాములే అని కొడుకుతో అన్నాడు.

సీతయ్య ఊరంతా తిరిగి ప్రొద్దుగూకేసరికి ఇంటికి చేరుకున్నాడు. "పని చేయకుండా ఇంట్లోఅందరితో తగాదా పెట్టుకొంటూ, గాలితిరుగుడు దేనికిరా" అని రామయ్య కొడుకును గట్టిగా మందలించాడు.

"ఈ ఇంట్లో మీరు నన్ను బ్రతకనివ్వరు. నన్ను చంపాలని చూస్తున్నారు. నాది నాకు పంచిపెట్టండి, నా దారిన నేనుపోతాను" అని ఇల్లంతా నానాగోల చేశాడు సీతయ్య.

కాకి బిడ్డ కాకికి ముద్దు. తండ్రి కనుక కొడుకు పైనున్న ప్రేమవలన వాని పనులను చూచి దుఃఖించాడు రామయ్య. రామయ్య చాల తెలివైనవాడు. పుట్టిన పుండును ఏవిధంగానైన తుడిచి పారవేయవలెనని తలచి కొడుకు సీతయ్య కోర్కెపైన అన్నదమ్ము లిద్దరికి సమానంగా పంచిపెట్టాడు.

సీతయ్య తన భాగమునకు వచ్చిన పొలము అమ్ముకొని, మొత్తం డబ్బు చేతపట్టుకొని ఒక పట్నం చేరాడు. పట్నం సీతయ్యకు స్వర్గపురంవలె కన్పించింది. ఒక రంగుల మేడను అద్దెకు తీసికొన్నాడు. రకరకాల దుస్తులు కొన్నాడు. పట్నాన్ని ఇంద్రలోకం లాగా పోల్చుకుంటూ పల్లెటూరుని

శ్రీ మైలవరపు వెంకటేశ్వరరావు

శ్మశానవాటికవలె తలచాడు. అగ్నికి వాయువు తోడైనట్లు సీతయ్యవద్ద చాల డబ్బున్నదని తెలియగానే చాలామంది 'సీతయ్యలు' అతనికి స్నేహితులైనారు.

సీతయ్య వీరందరిని తన ప్రాణమిత్రులవలె భావించి డబ్బు విస్తారంగా ఖర్చు జేస్తూ పట్నమంతా తిరుగసాగాడు. స్నేహితుల మూలమున నెమ్మది నెమ్మదిగా జూదము, త్రాగుడుకూడ నేర్చుకొన్నాడు. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు ఉన్న డబ్బంతయు కట్టతెగిన నదీప్రవాహమువలె పట్నమునకు అంకితంచేశాడు.

డబ్బు లేదని తెలిసికోగానే ఏనుగు మింగిన వెలగకాయలోని గుజ్జు మాయమైనట్లే ఎక్కడి స్నేహితులక్కడే మాయమైనారు. రంగులమేడ యజమాని ఆనెల అద్దె ఇవ్వలేదని తిడుతూ బయటకు గెంటాడు. తొడుక్కోవటానికి సరియైన చొక్కా దొరకలేదు. పట్నమంతా తిరిగినా పిడికెడు మెతుకులు దొరకలేదు. కడుపులో మంట మండిపోతోంది. వెంటనే తండ్రి, ఇల్లు జ్ఞాపకం వచ్చినవి. నానా రభసచేసి ఏమఃఖంపెట్టుకొని ఇంటికి వెళ్లాలని తనలో అనుకొన్నాడు.

అన్ని మంటలకంటె, ఆకలి మంటకు అన్నీ లోకువన్నట్లుగానే, ఏదన్నా ఒక పని చేసికొని బ్రతుకుదామని ఒక ఊరు బయలుదేరాడు. సీతయ్య షోకిల్లా అగుటవలన అతనికి ఏపని చేయటంరాదు. పైగా ఆ ఊరులో అతనికి ఏపనీ దొరకలేదు. చివరికి ఎరుకలవాని ఇంట్లో పందులు కాయుటకు కుదిరినాడు. ఒకరోజున పందులు ఒక చేలో పడగా రైతు పందిని చంపివేశాడు. ఎరుకలవానికీ వార్త తెలియగానే వాడు సీతయ్యను పట్టుకొని తన్ని వెళ్లగొట్టినాడు.

ఏమి చేయవలెనో సీతయ్యకు ఏమీ తోచలేదు. ఇంటికే వెళ్లి చేసినతప్పులనుమన్నించమని తండ్రి కాళ్లపైబడి ప్రార్థిస్తానని బయలుదేరాడు. సంజయపురం ఊరుబయటకు రాగానే పుత్రవియోగంలో మునిగివున్న రామయ్యతో ఎవరో మీకుమారుడువస్తున్నాడనిచెప్పారు.

రామయ్య పోయే ప్రాణములను తిరిగి తెచ్చుకొని సంతోషంతో ఊరుబయటికి పరుగెత్తాడు. తండ్రీ కొడుకులు ఒకరినొకరు చూచుకొని కౌగలించుకొంటూ బావురుమన్నారు. "తండ్రీ! నేను పాపిని, నీ విచ్చిన డబ్బంతయు పాడుచేసితిని, నన్ను క్షమించుము" అని కొడుకు తండ్రి కాళ్లపై పడినాడు. రామయ్యలో తండ్రిప్రేమ తొణికిసలాడింది. ఆయన కొడుకును లేవదీస్తూ సంతోష బాష్పములు విడిచాడు. పోయిన పుత్రుడు లభించుటవలన రామయ్య సంతోషసూచకముగ ఊరంతటికి గొప్ప విందు చేసినాడు.

పగలంతా పొలములో పనిచేసి వచ్చిన పాపయ్యకీవిషయమంతా తెలిసింది. పాపయ్య తండ్రితో "నీ వా వెధవను ఇంటికి రానీయటమే కాకుండా పెద్దవిందు చేశావట. చూడబోతే నీకు నామీద ఏమాత్రం ప్రేమ లేదని" కోపంతో మాట్లాడాడు. తండ్రియైన రామయ్య పాపయ్యతో. "నీమీద నాకు ప్రేమ లేక కాదు. పోయినవాడు తిరిగి లభించటం మన అదృష్టం. ఇప్పుడు వాడి మనస్సు మారిన"దనిచెప్పతూ కొడుకును బుజ్జగించాడు. ఆనాటినుండి పాపయ్య సీతయ్య లిద్దరూ ఎంతో అన్యోన్యంతో కలసిమెలసి పనిచేయటం ప్రారంభించారు. సంజయపురవాసులందరూ నాటినుండి నేటివరకు మిక్కిలి పొగుడుతుంటారు రామయ్య 'తండ్రిప్రేమ' ను.

టామ్ సాయర్

(-31వ పేజీ తరువాయి)

"గుహకు వచ్చే వాళ్లెవరో చేతు లెత్తండి."

అందరూ చేతు లెత్తారు. కొవ్వొత్తులు కట్టలుకట్టలు చేత పుచ్చుకున్నారు. కొండ ఎక్కారు. గుహాద్వారం కొండ కొంతఎత్తు ఎక్కితేగాని రాదు. ఆ ద్వారం ఇంగ్లీషు అక్షరం 'A' లాగా వుంటుంది. లోపలకి వెళ్లగానే ఒక గదిలాంటిది కనిపిస్తుంది. అక్కడ మంచుమీద నిలబడినంత చల్లగా వుంది. చుట్టూ సున్నపురాళ్ల గోడలను ప్రకృతే కట్టి వుంచింది. గోడలు చెమటపట్టినట్టు తేమగా వున్నాయి. ఆ కటికచీకట్లో నుంచుని కింద మధ్యాహ్నపు ఎండలో తళతళలాడే పచ్చని లోయను చూస్తుంటే చాలా తమాషాగా వుంది. రెండు నిమిషాలు అలా నిశ్శబ్దంగా చూశారో లేదో, కోలాహలం ప్రారంభమయింది. ఎవరో ఒకళ్లు కొవ్వొత్తి వెలిగించటం, మిగతావాళ్లు అతనిమీద పడి ఆర్పెయ్యటం; ఇదీ ఆట. ఈ ఆటలో ఉత్సాహంకూడా ఖర్చుకాగానే, అందరూ సందడిచేస్తూ గుహలోపల్లోపలికి నడిచారు. గుహమధ్యలో దాదాపు పది అడుగుల వెడల్పైన మార్గం వుంది. అది అంతకంతకి కొండఅడుగుకి పోతున్నట్టుంది. కొవ్వొత్తుల వెలుతురు కాంతికిరణం ఎప్పుడూ సోకి ఎరగని ఆ చీకటిగుహని, అందులోని రహస్యాలని వెలిగిస్తున్నది. అరవై అడుగుల దూరాన కలుసుకునే గోడలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతి అయిదారు అడుగులకీ ప్రధానమార్గంలోనుంచి చిన్న చిన్న సందులు లెక్కలేనన్ని చీలుతున్నాయి.

ఆ గుహపేరు 'మెక్డుగాల్ గుహ.' అందులో ఎన్ని చిన్న చిన్న దారులు, రహస్యసొరంగాలు ఉన్నాయో చెప్ప తరంగాదు. ఏ దోవన వెళ్లినా గుహకి అంతం కనిపించదు. ఎన్ని రోజులు తిరిగినా దాని అవతల చివర కనిపించదని ప్రజలు చెప్పుకుంటూ వుంటారు. పొరకింద పొరగా పాతాళ లోకం వరకూ వెళ్ళినా ఆ గుహకి అంతం లేదు. ఎవ్వరికీ ఆ గుహనుగూర్చి తెలియదు. యువకుల్లో చాలా మందికి, కొంత భాగంమాత్రమే తెలుసు. ఆ 'కొంత భాగం' దాటి అవతలకి వెళ్లటం ఆచారంలో లేదు. టామ్ సాయర్కి కూడా యువకులకి తెలిసినంతా తెలుసు.

ఈవిధంగా ముప్పాతిక మైలు దాకా వాళ్లు నడిచారు. తరవాత కొందరు కొందరు ముఠాలుగానూ, జతలుగానూ చీలి పక్క దారుల్లోకి పోయారు. ఆ దారులు కలిసే చోట మళ్లీ హఠాత్తుగా ఎదురుపడి "బా" అని ఒకరి నొకరు జడిపించుకున్నారు. ఒక్కొక్కసారి కొందరు అరగంటసేపటిదాకా కనిపించకుండా దాక్కో గలిగేవాళ్లు. ఇదంతా ఆ 'తెలిసిన భాగం' లోనే జరిగింది.

క్రమంగా యాత్రికులు నవ్వుతూ, తుళ్లుతూ, ఆయాసపడుతూ గుహాద్వారాన్ని తిరిగి చేరుకున్నారు. బయటికి వచ్చి చూసుకునేటప్పటికి వాళ్లకి ఒళ్లంతా దుమ్ము, బూజు, గబ్బిలాల పెంటికలతో నిండిపోయివుంది. గుహలో ఉన్నంతసేపూ వాళ్ళకి టైము ఎంత జరిగిపోయిందో తెలియనే లేదు. బయటికి వచ్చి చూస్తే సూర్యాస్తమయం కావస్తున్నది. అయినా ఇంత వినోదంగా ఆ రోజు గడిపినందుకు అంతా సంతృప్తి పడ్డారు. వీళ్ళ కోసం పడవవాళ్లు అరగంటనించీ కాచుకు కూర్చున్నారు. పడవ నదిలో తిరుగు ప్రయాణం చేయసాగే సరికి ఎవ్వరూ కాలం వ్యర్థమై పోయిందని చింతపడలేదు, ఒక్క పడవ యజమాని తప్ప.

పడవ ఊరి పెద్దరేవు దగ్గిర ఆగకుండా ముందుకు పోయింది. ఆ ప్రాంతంలో అప్పటికే కాపలాకోసం వచ్చిన హక్ ఈ పడవని చూశాడు. అది ఈ రేవుదగ్గిర ఎందుకు ఆగలేదో, అందులోఉన్న దెవరో అతని కర్థం కాలేదు. పడవలో యాత్రికులు తెగ అలిసి ఉంటంవల్ల కిక్కురుమనకుండా కూర్చున్నారు. పడవ సంగతి వదిలేసి హక్ తన విధి తాను నిర్వర్తిస్తున్నాడు. దట్టంగా మబ్బులు పట్టి రాత్రి కారుచీకటిగా వుంది. పది గంటలయింది. వీధుల్లో జనసంచారం, దీపాల వెలుతురు తగ్గిపో

యింది. మన ఒంటరి కాపలావాణ్ణి దెయ్యాలకి, నిశ్శబ్దానికి వదిలిపెట్టి గ్రామం నిద్రపోయింది. పదకొండు అయింది. హోటలు దీపాలు కూడా ఆరిపోయాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా అంధకారమే.

హాక్ అలాగే ఎదురుచూస్తున్నాడు; కాని ఏమీ జరగలేదు. అతని నమ్మకం సడలిపోతోంది. ఈ కాపలావల్ల ఏమైనా ఉపయోగం వుందా? నిజమైన ఉపయోగం ఏమైనా వుందా? ఈ వెధవ కాపలా వదిలేసి పోయి పడుకుంటే?...

హఠాత్తుగా ఒక ధ్వని వినబడింది. హాక్ ఒళ్లంతా చెవులు చేసుకుని విన్నాడు. హోటలుసందులోని తలుపు నెమ్మదిగా తెరుచుకుంది. ఇటుకల పురాణపు గోడచాటున దాక్కున్నాడు. మరో నిమిషంలో ఎవరో ఇద్దరు వ్యక్తులు అతన్ని రాసుకునేంత దగ్గిరగా వెళ్లారు. ఒకడి చంకలో ఏదో వుంది... అది డబ్బుపెట్టె కావచ్చును. కనక ఆ డబ్బును ఎక్కడో మరోచోట దాస్తున్నారన్నమాట. ఇప్పుడు టామ్‌కోసం పరిగెత్తటంవల్ల లాభమేముంది? ఈలోగా వాళ్లు ఎటో పోతారు; ఇక వాళ్లని పట్టుకోవటం దేవుడితరం కాదు. కాదు! తను వాళ్లని వెంబడిస్తాడు. చీకటిలో వాళ్లు తన్ను చూడలేరు.

పిల్లివలె అడుగులువేస్తూ హాక్ వాళ్లని అనుసరించాడు, కొంతదూరంలో.

వాళ్లు సందులు, గొందులుతిరిగి, శివారికి కార్డిఫ్‌మెట్టకు పోయేదారిని పడ్డారు. పుట్టమీద వేల్సుదేశస్థుడొకని యిల్లు వుంది. జంకూ, గొంకూ లేకుండా వాళ్లు ఆ యింటినికూడా దాటి ఇంకా పైకి ఎక్కారు. బలే బావుందనుకున్నాడు హాక్. కొంచెం ఎగువగా ఒక చిన్న కందకం వుంది. అందులో డబ్బు దాస్తారనుకున్నాడు. కాని వాళ్లు దాన్ని దాటి ఇంకా పైకి పోయారు. ఎత్తుగా ఒత్తుగా పెరిగి వున్న పొదల మధ్య సందుగుండా పోయారు. ఆ తరవాత హఠాత్తుగా చప్పుడాగిపోయింది. హాక్ ఇంకా పైకి నడిచాడు. అతని కెవ్వరూ కనిపించలేదు. ఆగాడు. మళ్ళీ మెల్లిగా అడుగులు వేశాడు; హఠాత్తుగా మళ్ళీ ఆగాడు. అంతా నిశ్శబ్దం. తన గుండె కొట్టుకునే చప్పుడు తప్ప మరే శబ్దమూ లేదు. కొండకొసన ఒక గుడగూబ అరిచింది. అడుగుల అలికిడిమాత్రం వినబడలేదు.

హారి ! ఛాన్సు పోయినట్టేనా? ఉన్నట్టుండి వాళ్లేమయిపోయారు? గమ్మత్తుగా వుందే? వెనక్కి తిరిగి పారిపోదామనుకున్నాడు. ఇంతలో అతనికి నాలుగు అడుగుల అవతలనుంచి దగ్గు వినిపించింది. హాక్ గుండెకాయ ఎగిరి నోట్లోకి వచ్చేసింది. కాని మళ్ళీ దాన్ని మింగేశాడు. డజను మలేరియా జ్వరాలు ఒక్కసారి పట్టుకున్నట్టు వణికిపోతూ ఉన్నచోటే నిలబడి పోయాడు. తను ఎక్కడ నుంచున్నాడో హాక్‌కి తెలిసింది. డగ్లస్ అమ్మగారి ఇంటికి వెళ్లే దోవలో నుంచున్నాడు. అచ్ఛా! డబ్బు ఇక్క డెక్కడ పాతిపెట్టినా తేలిగ్గా కనుక్కోవచ్చు.

ఇంజన్ జో గొంతుక అతిమెల్లిగా వినిపించింది :

"దీని దుంప దెగిరి! ఇంకా మేలుకునే వున్నట్టుందే ఆమె? రాత్రి యింత పొద్దుపోయినా లైట్లు వెలుగుతూనే వున్నాయి."

"లైట్లు కనిపించవేం?"

ఈ రెండోగొంతిక దెయ్యాల ఇంట్లో కనిపించిన కొత్తవాడిది. మెరుపులాంటి ఆలోచన హాక్ మెదడులో మెరిసింది. ఈ ఇద్దరు దొంగలూ అనుకున్న "పగ" ఇదేనన్నమాట. వెంటనే పారిపోవాలనుకున్నాడు. కాని డగ్లస్ అమ్మగారు ఎన్నోసార్లు తనపై చూపించిన దయ, ఆమె చేసిన ఉపకారాలు జ్ఞాపకం వచ్చాయి. వీళ్లు ఆమెని చంపబోతున్నారేమో? త్వరగా వెళ్లి ఆమెను హెచ్చరిస్తే?... ఊహూ వీళ్లు వచ్చి నన్ను పట్టుకోవచ్చు. ఇంజన్ జో మళ్లీ సమాధానమిచ్చేలోపుగా హాక్ చాలా ఆలోచన చేశాడు.

'సీకు పొద అడ్డంగా వుంది. ఈ పక్కకి రా లైట్లు కనిపిస్తాయ్"

"ఆ. ఆ ఇంట్లో ఎవరో జనం ఉన్నట్టే వుంది. మానేద్దాంలే."

"మానేద్దామా? అందులో నేను ఈ దేశం శాశ్వతంగా విడిచి పోతుండగా "పగ" తీర్చుకోకుండా మానెయ్యటమా? ఇదుగో, నీతో ఒక మాట చెబుతా విను. ఆమె డబ్బు చిల్లిగవ్వకూడా నా కక్కర్లేదు. నువ్వు తీసుకో. ఆమె మొగుడు బతుకున్నప్పుడు నన్ను చాలా బాధించాడు. అతడు జడ్జీగా

వున్నప్పుడు నన్నొకసారి గుర్రం కొరడాతో కొట్టించాడు. ఎక్కడనుకున్నావ్? జైలు ముందు, అందరి ఎదుటా. కొరడాతో కొట్టించాడు! వింటున్నావా? అర్థమైందా నే చెప్పేది? కొరడాతో కొట్టించాడు! నేను "పగ" తీర్చుకోకుండానే చచ్చాడు. ఇప్పుడతని భార్య 'మీద నా పాత పగ సాధించకుండా వదలి పెడతానా?

"వద్దు జో! ఆమెని చంపవద్దు."

"చంపటమా? చంపుతా నని ఎవరన్నారు? అతన్నైతే చంపేసే వాణ్ణి. ఆమెని చంపను. ఆడదాని మీద పగతీర్చుకోవాలంటే చంప కూడదు. ముక్కులు, చెవులు కత్తిరించాలి."

"జో! చాలా ఘోరం అది...

"నోరు ముయ్. నీ సలహా నాక్కర్లేదు. ఆమెను మంచానికి కట్టేస్తాను. చస్తే చావనీ. నువ్వు నాకు ఈ పనిలో తోడుపడాలి. అందుకే నిన్నిక్కడికి తీసుకొచ్చాను. నా కొక్కడికీ యీ పని కుదరదు. నువ్వు గనక కదిలావంటే చంపేస్తాను. నిన్ను చంపితే దాన్నికూడా చంపాల్సివస్తుంది. ఇక తరవాత ఈ హత్యలు, చేసినవాణ్ణి కనుక్కోవటానికి భూమి తలకిందులు కావలసిందే! హుం!"

"సరే! చేసి తీరాలంటే నా అభ్యంతరం ఏమీ లేదు. కానియ్. ఎంతదబ్బున చేసేస్తే అంతమంచిది."

"ఇప్పుడా? అక్కడ లైట్లు ఉండగానా? నీమీద నాకు అనుమానం కలుగుతోంది. జాగ్రత్త! హె!...తొందర లేదు. దీపాలారనీ."

తరవాత నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దం వాళ్ళ మాటలకంటే భయంకరంగా వుంది. హాక్ ఊపిరి బిగపట్టి వెనక్కి అడుగు వేశాడు. మరొక అడుగు వేశాడు. కాలికింద ఎండిన పుల్ల ఒకటి విరిగినచప్పుడైంది. హాక్ కి ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. విన్నాడు; అలికిడి ఏమీ లేదు అంటే వాళ్లు కదల్లేదన్న మాట. నెమ్మదిగా పొదల ఇవతలకి వచ్చాడు. ఇంకొకటి చిన్న కేద కాన్ని చేరుకున్నాడు. ఇక భయం లేదనుకున్నాడు. రివ్వున బాణం లాగా పరుగెత్తాడు కొండకిందకి. వేల్సు దేశస్థుడి ఇంటిముందుకి వచ్చే వరకూ దోవలో ఎక్కడా ఆగకుండా పరిగెత్తాడు.

గతః కుల దారి

(15-వ పేజీ తరువాయి)

"అయితే తలపులోనేనా ఉన్నామే!" అంది.

"అసలు ఉండేదే తలపులో!"

"మాబోటివాళ్లమీద అమాత్రం దయ ఉన్నా చాలు."

"నీకుమాత్రం పిసరంతేనా దయ లేదు. నేనే వెయ్యివిధాల నయం! ఏమంటావు?"

"నీభావంమాత్రమే అది. నిజం కాదు!"

"ఉట్టిమాటలకేం గాని నువ్వు నాకు ఏం ఉపకారంచేస్తావో చెప్పదూ? ఇంతకీ నాకు కావలసింది అది" అని స్పష్టంగా అడిగాడు.

"నువ్వు ఏం చెయ్యమంటే ఆ పని చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను."

"మా నాన్న మళ్లీ ఒక పిల్లని చూడమని పోరు పెడుతున్నాడు. ఏలాగు చావడం!" అని విసుగుకొన్నాడు.

"వెంటనే చూడమని నా సలహా" అంది.

"ఒకరూపం నా కళ్లఎదుట కట్టి ఉండగా నేను మరొక వస్తువులో ఏమి సౌందర్యం చూడగల" నని తల చేతితో పట్టుకొన్నాడు.

"అదే కనబడుతుంది, ఒక పిసరు బుద్ధి తెచ్చుకొంటే!" అంది.

"నేను గుణాగుణాలు పరిశీలించలేను" అన్నాడు వెనకటి భావం పూర్తిచేస్తూ.

"అయితే నన్నేమి చెయ్యమని ఆజ్ఞ!"

"నువ్వు వెళ్లి చూసిరా. నీకు నచ్చితే నాకు నచ్చినట్టే!"

"ఓ! అదెంతసేపు! నిమిషాలమీద!" అంది పార్వతమ్మ చిటికెలు వేస్తూ.

"పెళ్లి అంతా నువ్వే దగ్గిర ఉండి చేయించాలిసుమా. అదే మొదటి షరతు!"

"ఓ! దివ్యంగా! కావలసినన్ని పాటలు పాడతాను. పాన్పుమీద పాటలు కూడా పాడతాను. కావలిస్తే ఆడపడుచు ముడికూడా ఒకటి వయ్యమంటే వేస్తాను" అంది సంతోషంతో.

పాపారావుకంటినుంచి రెండు వెచ్చని కన్నీటిచుక్కలు రాలాయి. అతను దుఃఖాన్ని దిగమింగాడు.

"వెర్రివాడా! గతాన్ని మరిచిపో! ఇది అజ్ఞానప్రపంచం! సంసారమే అటువంటిది! దగ్గిర ఉన్న సౌఖ్యమే కాని దూరంలోవున్న బాధలని గుర్తించలేదీ మనస్సు. ఎదుట ఉన్న ఎరని మింగుదామనే ఆత్రపడుతుంది కాని బోనులో పడి చస్తామని భావించదు జీవి. ప్రపంచదృష్టికి తాత్వికదృష్టికి అంత తేడా ఉంది బాబూ!" అంది

"నీకు సాధువమ్మ గురువయితే, నాకు నువ్వు గురువు!" అన్నాడు పాపారావు.

"సరే! నువ్వే నన్ను మెచ్చుకోవాలి. ఆమె జ్ఞానోపదేశం లేశమంతే చేసిన మాత్రాన్నే కలిగిన వివేక మిది. ఆమె యొక్క పరిపూర్ణజ్ఞానం సామాన్యమానవులకి పొందడానికి సాధ్యమా!"

పాపారావు లేచి నమస్కరించి "వెళుతాను" అన్నాడు.

"నాకా నువ్వు నమస్కారం చెయ్యడం! బాగు బాగు," అంది.

"ఎంతో తెలిసిన మా స్నేహితుడే నీతో మారు మాటాడలేక నమస్కరించాడు. ఇంక నామాట చెప్పాలా! అయ్యో!" అని మళ్లీ నమస్కరించి వెళ్లిపోయాడు. *

మళ్లీ సాయంత్రమే పాపారావు పార్వతమ్మ ఇంటికి కొట్టుకువచ్చాడు.

"ఇదేమిటి అప్పుడే వచ్చావు!" అని ఆమె ఆశ్చర్యపోయింది.

"ఇవాళే వెళ్లి నన్ను పిల్లని చూసుకొని రమ్మని మా అమ్మ, నాన్న ఒత్తిడిచేస్తున్నారు. పేరయ్య తోడువస్తారు. నిన్ను కూడా నాతో తీసుకొని వెళతానని మా ఇంటిలోవాళ్లకి చెప్పాను. మీ అమ్మకి కూడా చెప్పాను. అంతా ఒప్పుకొన్నారు. మరి బయలుదేరు రా. మరి మా ఇంటికి రా"! అని పసివాడిలాగు తొందరపడ్డాడు.

పార్వతమ్మ ముస్తాబయి, బయలుదేరగా, ఆమె చేతిలో సంచి పాపారావు తీసుకుని దారితీశాడు. [అయిపోయింది]★

సోవియట్ సినిమా కళాపరిణామం

(26-వ పేజీ తరువాయి)

నలస్థానే సమగ్రతలేని కాల్పనిక సంఘటనలు నిలుస్తాయి. ఈ రకం సృష్టి వాస్తవ ప్రపంచపు జీవితంతాలూకు శకలం కాజాలదు. ఇదే శుష్క శిల్పవాదం. ఇది సోషలిస్టువాస్తవికతకు పూర్తిగా విరుద్ధం. ఎందుకంటే ఇది జీవితానికి కళకూగల సంబంధాలను తెంచేస్తుంది.

ఈ రెండు రీతులకూ గల వ్యత్యాసాన్ని సిద్ధాంతరీత్యా ఇంత విస్పష్టంగా చెప్పాను గాని ఆచరణలో ఈ వ్యత్యాసం ఇంత తేలికగా అవగాహనకాదు.

శుష్క శిల్ప ధోరణి

శుష్క శిల్ప వాదాన్నేగాక శుష్క శిల్పధోరణిని కూడా ఒక కంట కనిపెట్టి ఉండాలి. ఈ ధోరణి రకరకాలుగా ఉంటుంది. చారిత్రకమైన ఇతి వృత్తంగల చిత్రాన్ని తీసుకోండి. ఒక సంఘటన యొక్క బాహ్యస్వరూపాన్ని వివరించాలనే ధోరణి కలుగవచ్చు. ఇందువల్ల ఆ సంఘటనలో గల చారిత్రక అంతరార్థం వ్యక్తంగాక దాని అనంతరం జరిగిన ఉత్సవాలూ, ఊరేగింపులూ ప్రాముఖ్యం సంపాదిస్తాయి. ప్రేక్షకుడికి వినోదం కలిగించటానికి ప్రణయమూ, హాస్యమూ ప్రవేశపెట్టవచ్చు. ఇవి చరిత్రను వివరించవు. ఇంకా రచనానైపుణ్యం ఎంతయినా వినియోగించవచ్చు. ఇట్టి నైపుణ్యంతోనే అమెరికావారు "చారిత్రక చిత్రా" లని పేరు పెట్టిపనికిమాలిన చెత్త ఉత్పత్తి చేస్తున్నారు.

శుష్క శిల్ప ధోరణి ఇంకా సూక్ష్మమార్గాలకూడా కళా నిర్మాణంలోకి ప్రవేశించి అపకారంచెయ్యవచ్చు. అందం మాత్రం ఉండి శక్తిఏమీలేని నటిని ప్రముఖపాత్రకు వినియోగించటం. స్క్రిప్టులో ఇడికట్టు పద్ధతులు రచించటం, అర్థంలేని హాస్య సన్నివేశమూ, మాటిమాటికీ గ్లిసరిన్ కన్నీళ్ళతో హృదయబాధ చిత్రించటం మొదలైనవాటికి కారణం ఏమంటే ప్రజలమీద ఏమాత్రమూ గౌరవం లేకపోవటమూ, జీవితాన్ని అర్థంచేసుకోకపోవటమూ, ఆసక్తి లేకపోవటమూ, సమష్టి పనిలో పాల్గొనే ఇచ్ఛ లేకపోవటమూనూ.

ఈ రెండవదశలో సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు పరిపాలన సాధించిన సర్వతోముఖ విజయాల ఫలితంగా సినిమా కళ నూతనాభివృద్ధి పొందింది. 1933 లో జరిగిన సోవియట్ రచయితల తొలి సమావేశంలో గోర్కీ ఈవిధంగా చెప్పాడు: "మన పుస్తకాలలో శ్రమకు ప్రధానపాత్ర ఉండాలి. అంటే శ్రామిక విధానాలలో ఉత్పన్నమై, ప్రస్తుత శిల్పాన్ని హస్తగతం చేసుకుంటూ, తానే శ్రమను సంధానపరిచి దానిని మరింత సుగమంగానూ, ఫలప్రదంగానూ చేసుకొంటూ, శ్రమను కళతో సమానస్థాయికి తెచ్చేమానవుడు ప్రధాన పాత్రగా ఉండాలన్నమాట. శ్రమను కళగా అవగాహన చేసుకోవటం మనం నేర్చుకోవాలి."

సోవియట్ వాస్తవికతకు పునాది అయిన నూతన శ్రామిక స్వరూపంగురించి గోర్కీ మాట్లాడాడు. సోషలిస్టు వ్యవస్థకు శ్రమే పునాది.

తమ శ్రమచేత జీవిత వ్యవస్థను నిర్మించే సోవియట్ పౌరులను చిత్రిస్తూ ఈ దశలో అనేక సినిమాచిత్రాలు వెలువడ్డాయి. ఈ శతాబ్దపు మూడవ దశాబ్దం అంతంలో డోడ్‌ఝెంకో "భూమి" అనే చిత్రం తీశాడు. యుక్రేన్ కర్షకులు సాముదాయక వ్యవసాయం కొరకుపడ్డ శ్రమ ఇందులో చిత్రించబడింది. ఆధునిక ఇతివృత్తాలతో ప్రారంభమైన సినిమా చిత్రాలలో మొదటిది "మీటింగ్" అన్న చిత్రం. దానిని ఎర్మ్లర్, యుట్కెవిచ్ అనే నిర్మాతలు తయారుచేశారు. మొదటి టాకీచిత్రాలలో అది ఒకటి. ఈ నిర్మాతలు సంభాషణనూ, సంగీతాన్నీ ఇతివృత్తానికి అండగా తీసుకున్నారు. దేశంలో జరిగిన సాంఘిక పరివర్తన మొట్టమొదటిసారిగా ఈ చిత్రంలో చూపబడింది. సోషలిస్టు స్వరూపంగల శ్రమ మనిషికి ఎటువంటి విజ్ఞానం ఇస్తుందో మనస్తత్వం కలిగిస్తుందో, సోషలిస్టు వ్యవస్థలో ఎలా సభ్యత్వం కలిగిస్తుందో ఈ చిత్రం చూపింది.

సమష్టి వ్యవసాయ క్షేత్రాలలో జరిగే పనిని చిత్రిస్తూ డజన్లకొద్దీ చిత్రాలు వెలువడ్డాయి. ఈ రెండవ దశలో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థాపన దేశంయొక్క ప్రధాన కర్తవ్యంగా ఉండేదని మరువరాదు. వ్యవసాయ జీవితాన్ని కాచి వడబోసిన పిర్యేవ్ చిత్ర నిర్మాతలలో ప్రముఖస్థానం ఆక్రమించుకున్నాడు. "క్యూబన్ కొసాక్స్" "డబ్బుగల వధువు", "ట్రాక్టర్ ఆపరేషన్", "పసులకాపరి" అనే ఇతని చిత్రాలలో నూతన జీవితమూ, దానితాలూకు భావాలూ అతి సూక్ష్మంగా చిత్రించబడి జాతీయమైన సోషలిస్టు కళ సమగ్రం కావడానికి దోహదం జరిగింది.

ఈ రెండవదశలో చెప్పుకోదగిన మరొక ముఖ్యపరిణామం సోషలిస్టు నాయకపాత్ర సృష్టికావటం. ఈ పాత్రలో సమాజధర్మం నిర్వర్తించే శీలమూ, సహృదయతా, నిశిత బుద్ధీ, ఏకత్వం సిద్ధించిన భావవికాసతా మూర్తీభవిస్తాయి. స్వధర్మానికీ, సంఘ ధర్మానికీ మధ్య ఈపాత్ర నలగదు.

ఛపాయెవ్ పాత్ర ఇట్టిపాత్రలలో మొట్టమొదటిది. సినిమా చిత్రాలలో ఈ పాత్ర క్రమంగా పుష్టిపొందింది. డ్జిగాన్ తీసిన "మాది క్రాన్‌స్టాట్" అనే చిత్రంలో ఈ పాత్ర కనిపిస్తుంది. ఎర్మ్లర్ తీసిన "గ్రేట్ సిటిజన్" అనే చిత్రంలో ఈపాత్ర అభివృద్ధికి తేబడింది. దీనికి నాయకుడైన స్చాచోవ్ పాత్ర మూడు మూర్తులా కిరోవ్ దే. కిరోవ్ ను ప్రజాద్రోహులు చంపారు. అటుతరవాత గొప్ప ప్రజానాయకులను చిత్రించటానికి కళాకారులు పరిశ్రమించి విజయం పొందారు. "గ్రేట్ గ్లో", "అక్టోబరులో లెనిన్," "1918లో లెనిన్." "రైఫిల్ ధరించిన మనిషి" మొదలైన చిత్రాలలో లెనిన్ స్టాలిన్‌లు పూర్వంచేసినపనీ, ప్రస్తుతం చేస్తున్నపనీ ప్రజలు చూసే అవకాశం కలిగింది. మూడవ దశాబ్దంలో వరుసగా వెలువడిన చిత్రాలు దినదినాభివృద్ధి చెందే సోవియట్ సంస్కృతిని ప్రతిబింబించాయి. వీటన్నిటిలోకి ఉత్తమమైనది "ప్రభుత్వసభ్యుడు." దీనిని తయారుచేసిన వారు హేఫిట్స్, జార్ఖీ అనేవారు. సామాన్యకుటుంబానికి చెందిన రష్యన్ కన్య సమష్టి వ్యవసాయ క్షేత్రానికి అధ్యక్షురాలు కావటం ఈ చిత్రంలో చూపబడింది. అనంతరం ఈమె ప్రభుత్వ సభ్యురాలుగా అసంఖ్యాక కర్షకుల ప్రతినిధిగా ఎన్నుకోబడుతుంది.

ఆనందమయ జీవితం:

"జీవితం సుఖవంత మవుతున్నది, ఆనందమయ మవుతున్నది." అని స్టాలిన్ ఈ కాలంలో అన్నాడు. ఈ మాటలు రుజువు చేస్తున్నాయా అన్నట్టు ఆనందమయమైన సోవియట్ చిత్రాలు ఒకదానివెంట ఒకటి వెలువడ్డాయి. పిరియెవ్ చిత్రంగురించి ముందే చెప్పాను. "కులాసా కుర్రాళ్లు," "సర్కసు", "వోల్గా - వోల్గా" అన్న అలెగ్జాండ్రోవ్ చిత్రాలు ఇటువంటివే. వీటిలో చక్కని సంగీతమూ, కొంటెతనంతో కూడిన విమర్శా, భవితవ్యమందు విశ్వాసమూ ఉన్నాయి. అలెగ్జాండ్రోవ్ చిత్రాలలోని పాటలు ఈ నాటికీ పాడుతున్నారు.

చారిత్రక చిత్రాలు:

నానాటికి వృద్ధిపొందే ప్రజాసంస్కృతి వల్ల ఏర్పడిన అవసరాలనుబట్టి చరిత్రకు సంబంధించిన చిత్రాలకు ఒక విశిష్టత ఏర్పడింది. చారిత్రక చిత్రం తాలూకు ఇతివృత్తాన్ని ఒక వ్యక్తియొక్క స్వంత కథగా తయారు చేయటానికి వీలులేదు. చారిత్రకపురుషుల బహిరంగ జీవితాన్నీ, ప్రజలకూ, తనకూ మధ్య ఆ వ్యక్తి కనబరిచిన సంబంధాన్నీ, ఆ కాలపు అభ్యుదయ శక్తులను గురించి అతనికి గల అవగాహననూ సోవియట్ నటులు ప్రధానంగా తీసుకున్నారు. ఐజెన్‌స్టయిన్ తీసిన "అలెగ్జాండర్ నెవ్‌స్కీ", పెట్రోవ్ తీసిన "ప్రథమపీటర్", పుడోవ్కిన్ తీసిన "మినిన్, పోర్ఝార్‌స్కీలూ," "సువొరోవ్" చిత్రాలు ఈదృష్టితో తీసినవే.

ఉత్తమ సాహిత్యానికి చెందిన ఇతివృత్తాలు చారిత్రక చిత్రాలతో అతి నైపుణ్యంగా జతజేయబడ్డాయి. గోర్కీ కథల ఆధారంతో డోన్‌స్కోయ్ తయారు చేసిన "బాల్యం", "ప్రజలలో", "నా విశ్వవిద్యాలయాలు" అన్న చిత్రాలు ఇటువంటివి.

యుక్రేన్, జార్జియా, అర్మేనియా రిపబ్లికులలో జాతీయసినిమా కళ ఏర్పడింది. ఆజర్బయిజాన్‌లో పెద్ద స్టూడియో తయారయింది. యుద్ధంతో ప్రారంభమైన మూడవ దశనుగురించి చెప్పక పూర్వం ఒక ముఖ్యవిషయం చెప్పాలి. ప్లానింగ్, అనగా ఆర్థికవ్యవస్థపై వ్యక్తులకు అధికారం లేకుండా చెయ్యటం, సోవియట్ సినిమా అభివృద్ధికి చాలా తోడ్పడింది. సోషలిస్టు నిర్మాణానికి ప్లానింగ్ ప్రాణం. ఇట్టి ఆర్థిక వ్యవస్థలో ప్రతివాడూ సమష్టి క్షేమానికి గాను సేవచేయటం స్వాభావికం. ఈ మనస్తత్వం కళలోకి, ముందుగా సినిమాలోకి, ప్రవేశించింది. వ్యక్తుల నిర్ణయాలూ, నటుల అభిరుచులూ, ఆకాంక్షలూ కలగలిపి ప్రజలపట్ల సమష్టి బాధ్యతగా పరిణమించాయి.

కొందరు నటులు జీవితానికి సంబంధించిన విషయాలను గురించి తమలో తాము స్వేచ్ఛగా చర్చించుకున్నారు. కళాకారులు విషయాన్నిగాని, విధానాన్నిగాని నిర్ణయించుకోవటంలో పైనుంచి ఒత్తిడితెచ్చి తద్వారా కళాసృష్టి నిర్దిష్ట ప్రణాళిక ఏర్పడిందనుకోవటం చాలా పొరపాటు. ప్రణాళిక పరస్పర సమన్వయంతో జరుగుతుంది గాని ఒత్తిడిచేత జరగదు. మా కళాసృష్టిని శాసించే దేమైనా వుంటే, అది కళాప్రయోజనం గురించి మాకుగల సమష్టి భావాలూ, ప్రజాసేవ చేయాలని మాలో ఉండే వాంఛామాత్రమే. ప్రజల అభివృద్ధితోబాటు నూతన కర్తవ్యాలూ, అవసరాలూ కలగడంలో ఆశ్చర్యంలేదు. సోషలిస్టు వ్యవస్థకు నాయకులైనవాళ్లు ఈ కర్తవ్యాలు నిర్వచించి, అవసరాలు తీర్చటానికి ప్రయత్నించారు. వారు కళాకారులను ఈ పనికి నియమించారు. ఏయే విషయాలు ఎత్తుకోవాలో, ఎటువంటి మార్గాలు అవలంబించాలో నాయకులు స్థూలంగా నిర్దేశిస్తారు. తమతమ విజ్ఞానానుభవాలనుబట్టి నటులు తమ కార్యక్రమాన్ని ప్రకటిస్తారు. ఒక్కొక్కసారి నటుడుచేయ కుతూహలపడేపనికి నాయకులు నిర్దేశించిన విషయాలలో స్థానం లేకపోవచ్చు. కాని అతను ఆపని ప్రారంభించి చెయ్యటానికి ఎట్టి ప్రతిబంధకమూ ఉండదు. అయితే ఇటువంటి పరిస్థితి అరుదుగాగాని కలగదు. సోవియట్ యూనియన్‌లోని జీవిత విధానం వ్యక్తి జీవితాలను ప్రజా జీవితంతో గట్టిగా ముడిపెడుతుంది. ప్రణాళికలు మంత్రుల బల్లలవద్ద ఉత్పత్తికావు. నటులూ, డైరెక్టర్లూ జరిపే చర్యలలో అవి ఉత్పన్నమవుతాయి. అవి వ్యక్తిత్వాన్ని కుంగదీయవు. వ్యక్తులప్రతిభ అభివృద్ధికావడానికి అవి దోహదం చేస్తాయి. "క్యూబన్ కొసాక్స్", "స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం", "బెర్లిన్ పతనం" ఒకే రకం చిత్రాలని ఎవరనగలరు? పనిలోనూ, పనితనంలోనూ చిత్ర నిర్మాతల ప్రత్యేకతా, కొత్తదనమూ ఎంతైనా ఉంటుంది. ఈ చిత్రాలలో ఆయా నిర్మాతల సృష్టిజనితోత్సాహం వ్యక్తం కావటం లేదా? ఇది స్వాతంత్ర్యంద్వారా సాధ్యమవుతుంది గాని ప్రోద్బలంవల్ల సాధ్యం కాజాలదు. ప్లాను కళాకారులందరినీ ఒక కుటుంబంగా కూడగట్టుతుంది. సినిమా ఒక విశాలమైన, అభేద్యమైన, సమైక్య శ్రేణిగా తయారై ముందుకు సాగుతుంది.

యుద్ధకాలం:

యుద్ధకాలంతో ప్రారంభమైన మూడవ దశలో ఈ ఐక్యత చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించింది.

యుద్ధం ప్రారంభమైన కొద్దిరోజులలోగానే మా సినిమా పరిశ్రమ దేశ రక్షణకు అనుకూలంగా పునర్నిర్మాణం పొందింది. స్టూడియోలు యుద్ధరంగానికి దూరంగా తీసుకుపోబడ్డాయి. వార్తాచిత్రాలు తయారుచేసే ఛాయాచిత్రగ్రాహకులు ఎర్రసేనలో ప్రవేశించి, ప్రాణాలను ఒడ్డి, ఎర్ర సేన యొక్క ఘనకార్యాలను తీశారు. "మాస్కో సమీపంలో జర్మనుల పరాజయం," "స్టాలిన్‌గ్రాడ్", "నల్ల సముద్రం తాలూకు మనుష్యులు", "లెనిన్‌గ్రాడ్ యుద్ధం," "సోవియట్ యుక్రేన్ యుద్ధం" మొదలైన మహత్తర వాస్తవ చిత్రాలు ఈ సమయంలో తయారయాయి.

డాక్యుమెంటరీ చిత్రాల అభివృద్ధికి నూతన అవకాశం లభించింది. యుద్ధంలో నేర్చుకొన్న అనేకవిషయాలు జీవితాలలో ఉపయోగపరుచుకున్నాం. సోవియట్ ప్రజల ఉత్తమ లక్షణాలను యుద్ధం బయటికి తీసింది. సినిమా కళ వారిని నాయకులు చేసింది. ఈ నాయకుడు యుద్ధరంగంలోనూ, ఇవతలా, ఎక్కడ బడితే అక్కడే ఉన్నాడు. ఇతడు ప్రజలలోని దేశాభిమానాన్ని రెచ్చగొట్టి, ఫాసిస్టులను నిర్మూలించడానికి వారి శక్తులను కూడగట్టుతున్నాడు. యుద్ధానికి సంబంధించిన చిత్రాల పూర్తిజాబితా ఇవ్వను, కొన్నిటిని మాత్రమే వివరిస్తాను. ఎర్మ్లర్ తయారుచేసిన "టర్నింగ్‌పాయింట్" స్టాలిన్‌గ్రాడ్‌కు సంబంధించినది. ఆయనే తయారుచేసిన "షి డిఫెండ్స్ హర్ కంట్రీ" గెరిల్లాలకు సంబంధించినది. పిరియెవ్ తీసిన "జిల్లాపార్టీ కమిటీ కార్యదర్శి," డాన్‌స్కోయ్ తీసిన "ఇంద్రధనుస్సు," ఆర్న్‌ష్టామ్ తీసిన "జోయా," రోమ్ తీసిన "ఇన్వేజన్." పుడోవ్కిన్ తీసిన, "మాతృదేశంకొరకు" మొదలైన చిత్రాలన్నిటిలోనూ ప్రధానాంశం దేశాభిమానమే.

యుద్ధకాలంలో యుద్ధానికి సంబంధించిన చిత్రాలేగాక దేశాభిమానాన్ని రేకెత్తించే చారిత్రక చిత్రాలుకూడా తీయబడ్డాయి. "కుటుజోవ్" అనే చిత్రాన్ని పెట్రోవ్ తీశాడు. 1812 లో రష్యాపై నెపోలియన్ చేసినదాడి ఈ చిత్రంలో చిత్రించబడింది. "ఛపాయెవ్" చిత్రంతీసిన వాసిలియెవ్ సోదరులు "ట్సారిట్సిన్ రక్షణ" అనే చిత్రం తీశారు. ప్రస్తుత స్టాలిన్‌గ్రాడ్ పరిసరాలలో జరిగిన అంతర్యుద్ధం వివరాలను ఈ చిత్రం చిత్రించింది.

"ఇవాన్ ది టెరిబిల్" మొదటిభాగంపై ఐజెన్‌స్టయిన్ పనిప్రారంభించాడు. జార్జియాలో చియారెలీ "జార్జియా సాకడ్జే" అనే చిత్రమూ, ఆర్మేనియాలో బెక్‌నజరావ్ "డేవిడ్ బెక్" అనే చిత్రమూ తీశారు.

చియారెలీ తీసిన "ప్రమాణం" అన్న

చిత్రాన్ని ముఖ్యంగా పేర్కొనాలి. ఇది స్టాలిన్ కు సంబంధించిన తొలిచిత్రం. ఇందులో స్టాలిన్ కథ ఎంతో చాకచక్యంతోనూ హృదయ్యతతోనూ ప్రజలకు చూపబడింది. చిత్రం ఉదాత్తంగా ఉండి, పాత్రలు అతి సహజంగా ఉన్నాయి. దీనితో కొత్తరకం సినిమా కథ ప్రారంభమయింది. ఈ చిత్రం యుద్ధకాలంలోనే ప్రారంభించబడింది.

యుద్ధకాలంలో సోవియట్ సినిమాకళ నేర్చుకున్నదేమిటి ? సోవియట్ కళాకారులలోగల ఐక్యమత్యాన్ని యుద్ధంపరీక్షకు పెట్టింది, వారికి ప్రజలపట్లగల ఆదరాన్ని వ్యక్తం చేసింది. ప్రజలకు అవసరమైన ఉత్తమకళాఖండాలను సమష్టిగా తయారుచేసేబలాన్ని వారికి చేకూర్చింది.

యుద్ధానంతరదశ:

యుద్ధానంతరం నాలుగవదశ ఆరంభమయింది. ఇప్పటివరకూ ఈ దశ నడుస్తున్నది. నాజీ జర్మనీని జయించిన అనంతరం సోవియట్ యూనియన్ కొత్తదైన, తీవ్రమైన సమస్యలను ఎదుర్కొన్నది. నాజీ దురాక్రమణదార్లు కల్లోలపరిచిన ఆర్థికవ్యవస్థను చక్కబరిచి శాంతియుత పునర్నిర్మాణం సాగించ వలసివచ్చింది.

సోవియట్ వ్యవస్థలోనూ ముఖ్యంగా యుద్ధకాలంలోనూ సోవియట్ ప్రేక్షకులు కొంత పరిపాకం పొందారు.

సోషలిస్టు వాస్తవికత విజాతీయ ప్రభావాలనుంచి విముక్తి పరచబడి నూతనస్థాయి అందుకున్నది. దీని ఫలితంగా, పెరియెవ్ తీసిన "సైబీరియాకథ", రోమ్ తీసిన "రష్యను సమస్య", డోన్‌స్కోయ్ తీసిన "గ్రామోపాధ్యాయుడు", గెరాసిమోవ్ తీసిన "యంగ్ గార్డ్", స్టోల్పర్ తీసిన "యధార్థమైన మానవుడికథ", రోమ్‌తీసిన, "కోర్ట్ ఆఫ్ ఆనర్" వంటి ఉత్తమచిత్రాలు వెలువడ్డాయి.

ఈ కాలంలో డాక్యుమెంటరీ కళాచిత్రాలనబడేవి తయారయాయి. ఈ చిత్రాలు నిర్మించటానికి అవసరమైన అనుభవాన్ని యుద్ధకాలపు డాక్యుమెంటరీ చిత్రాలిచ్చాయి ఈ చిత్రాలలో యధార్థ సంఘటనలు నిర్దుష్టమైన వాస్తవికతతో చిత్రించబడ్డాయి. ఈ సంఘటనలలో పాల్గొన్నవారు సజీవులైఉండి తమ అనుభవాన్ని వివరంగా అందించగలిగిఉంటారు. క్రిమియా విమోచనానికి సంబంధించిన "మూడవ దెబ్బ" అనే సావ్చెంకో చిత్రమూ, పెట్రోవ్ తీసిన "స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం" అన్న చిత్రమూ ఇటువంటివే.

శాస్త్రపరిజ్ఞానాన్ని విస్తరింపజేసే చిత్రాలకు ప్రస్తుతం శ్రద్ధచూపబడుతున్నది. కోసిన్‌త్సెవ్ తీసిన "పిరొగోవ్", రోషాక్ తీసిన "పావ్లోవ్", దొవ్జెంకో తీసిన "మిచురిన్" చిత్రాలు ఇటువంటివే.

ఇటీవలనే నేను "జుకోవ్‌స్కీ" అన్న చిత్రాన్ని పూర్తిచేశాను. ఇది నా తొలివర్ణచిత్రం. మా ప్రసిద్ధ గణితశాస్త్రవేత్త చేసిన శాస్త్రసృష్టి ఇందులో చూపబడింది. ఎగిరే విమానం రెక్కలకు బలంఇచ్చే శక్తిని మొట్టమొదటగా అంచనాకట్టినవాడీయనే.

గడచిన కొద్దిసంవత్సరాలుగా సోవియట్ ప్రజలు ప్రపంచ శాంతికొరకూ, ప్రపంచ ప్రజలమధ్య స్నేహసహకారాల కొరకూ యావచ్ఛక్తులు ధారపోస్తున్నారు. సోవియట్ ప్రజలు యుద్ధమంటే భయపడరు. కాని మానవజాతికి భౌతికసంపద సృష్టించటం వారి ఆశయం కనక యుద్ధం కోరరు. మేము నిర్మాణం కోరుతాముగాని, విధ్వంసం కోరం. మేం కొత్త అరణ్యాలు నాటుతున్నాం, బ్రహ్మాండమైన కాలువలు తవ్వుతున్నాం, లక్షలకొద్దీ ఎకరాల భూమి సాగులోకి తెస్తున్నాం, మహత్తరమైన విద్యుత్కేంద్రాలూ, ఫాక్టరీలూ, కార్ఖానాలూ నిర్మించి ఇంకా మంచి వస్తువులు, మరింత చౌకగా తయారుచేయటానికి కృషి చేస్తున్నాం. గతమూడు సంవత్సరాలకాలంలో మేము ముఖ్య ఆధార పదార్థాల ధరలు మూడుసార్లు తగ్గించాం. మరొకసారి తగ్గించటానికి సిద్ధంగా ఉన్నాం. అందరూ సుఖంగా ఉండాలని కోరుతున్నాం గనక శాంతికోసం కృషిచేస్తున్నాం. ఇటీవలి మా చిత్రాలలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ భావం కనిపిస్తుంది. ఇటీవల సినిమా ప్రదర్శనంలో బహుమతి పొందిన కలటగోవ్ చిత్రం "కాన్‌స్పిరసీ ఆఫ్ ది డూమ్డ్", రోమ్‌తీసిన చిత్రం "సీక్రెట్ మిషన్" శాంతి విద్రోహుల కుట్రలను బయటపెడుతున్నాయి. "బెర్లిన్ పతనం," "స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం" లాంటి ఇతర చిత్రాలు దురాక్రమణదారులకు పట్టే గతి నిరూపిస్తున్నాయి. "క్యూబన్ కొసాక్స్," "మిచురిన్" లాటి చిత్రాలు సృష్టియుతమైన శ్రమయొక్క ఘనతనూ, అజేయత్వాన్నీ చాటుతున్నాయి.

ఇంత కొద్ది అవకాశంలో నేను సోవియట్ సినిమా అభివృద్ధిని గురించి పూర్తిగా వివరించటం సాధ్యంకాదు. దానితాలూకు ప్రధానఘట్టాలుమాత్రమే వివరించుతూ, సోషలిస్టు వాస్తవికత ప్రజా జీవితంతో సన్నిహిత సంబంధం కలిగిఉంటుందనీ, అది శిథిలం కాకపోగా దినదినాభివృద్ధి చెంది నానాటికీ నూతన శక్తిని చేకూర్చుకొంటున్నదనీ, నూతన విజయాలు సాధిస్తున్నదనీ మీకు తెలియజేయ ప్రయత్నించాను.

ఈవిషయంతో ముగిస్తాను. ★



బర్‌హా కి రాత్ చిత్రంలో దేవ ఆనంద్, నర్గస్.



"[illegible]" చిత్రంలో జి. వరలక్ష్మి

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(6-వ పేజీ తరువాయి)

సెంట్ నికలాస్ కోటవద్ద బండి మలుపు తిరిగి అదృశ్యమయింది.

"మీరు ఇక్కడే ఉండండి" అన్నాడు ఓడయజమాని. "వెంటనే ఏ బండి దొరికితే దానిమీద మార్సేల్స్ వెళ్ళి మీకు కబురు తీసుకువస్తాను."

మిగిలిన అతిథులందరిలోనూ గాఢ నిస్తబ్ధత వ్యాపించింది. దుఃఖం ఉబికివచ్చి మాట రాక వృద్ధుడు, మర్సిడా నిలబడిపోయారు. కొంతసేపటికి ఇద్దరి కన్నులు కలుసుకున్నాయి. కఠోరమైన ఒక్క అఘాతానికి ఇద్దరూ గురైనట్లు ఒకరిచేతులలో ఒకరు వాలిపోయారు.

ఆ సమయానికే ఫెర్నాండో ప్రవేశించాడు. ఒక గ్లాసు మంచినీరు గబగబ తాగి కుర్చీలో కూచున్నాడు.

కాడరూస్ అతనివంక చూసి డాంగ్లర్‌తో "వాడే చేశాడు" అన్నాడు.

"అది కాదని నా నమ్మకం" అన్నాడు డాంగ్లర్. "ఆ దద్దమ్మ కాపాటి తెలివి లేదు. ఏమయినప్పటికీ, ఈ దుర్మార్గాని కొడిగట్టినవాడికి శాస్తి జరిగితీరుతుంది."

"ఆహా! అయితే సలహా ఇచ్చిన దుష్టుడిమాట చెప్పవేం?" అన్నాడు కాడరూస్.

ఈలోగా చేరిన అతిథులంతా డాంటే అరెస్టునుగురించి పరిపరివిధాల చెప్పుకోవటం మొదలుపెట్టారు.

ఒకడన్నాడు: "డాంగ్లర్! నీ ఉద్దేశ మేమిటి?"

"నా ఉద్దేశం, తీసుకురాకూడని సరుకేదో అతను ఓడలో తెచ్చిఉంటాడని."

"అదయితే, ఓడలో సరుకుమీద అజమాయిషీ చేసే నీకు తెలియాలి కదా!"

"అవును. కాని నాకు ఒప్పగించిన సరుకైతేనే నాకు తెలుస్తుంది. అలెగ్జాండ్రియానుంచి, స్మిర్నానుంచీ పత్తి వేసుకువస్తున్నాం. నాకు అంతవరకే తెలుసును. ఆపైన నన్నడక్కండి."

"అదా! నా కిప్పుడు జ్ఞాపకం వచ్చింది" అన్నాడు వృద్ధుడు, గొణుగుతూ. "నాకోసం కాఫీ, పొగాకు తెచ్చానని నిన్న నాతో అన్నాడు."

"ఆ! ఇంకేం! చూడండి" అన్నాడు డాంగ్లర్. "అదీ సంగతి. మేము లేనప్పుడు రేవుఅధికారులు ఫరావోనౌకను తనిఖీ చేసి ఈ రహస్యం కనిపెట్టారన్నమాట."

కాని మర్సిడా ఇదంతా నమ్మలేకపోయింది. ఆమెకు దుఃఖం పొంగివస్తున్నది.

"ఊరుకో. ఊరుకో. మేలు జరుగుతుందనే ఆశతోనే ఉండాలి మనం" అన్నాడు వృద్ధుడు. కాని నిజంగా ఈమాటలు అతనికే బోధపడలేదు.

పరామర్శచెయ్యాలని ఫెర్నాండో ప్రయత్నించాడు. కాని మాటలు నోటినుంచి వెలిరా లేదు. పెదవులుమాత్రం కదిలాయి.

"ఆగండాగండి. ఇదుగో ఏదో బండి వచ్చింది." అన్నాడొక అతిథి. "మొరెల్ వచ్చారు. మంచి కబురు తెచ్చి ఉంటారు."

వృద్ధుడు, మర్సిడా గబగబా ద్వారం సమీపించారు. ఓడ యజమానిముఖం వాలిపోయి ఉంది. ప్రవేశిస్తూ శిరఃకంపన చేస్తూ అన్నాడు. "విషయం మనం అనుకున్నంత సులువైంది కాదు. బోనపార్టిస్ట్ గూఢచారి అని అతని పైన నేరం ఆరోపిస్తున్నారు."

ఆ రోజుల్లో ఈ నేరం ఎంత ఘోరమైనదో అందరికీ తెలుసును.

మర్సిడా దీనంగా ఆర్తనాదం చేసింది. వృద్ధుడు కుర్చీలోకి ఒరిగిపోయాడు.

"ఓ! నన్ను మోసపుచ్చావా డాంగ్లర్?" అన్నాడు కాడరూస్. "మీఆట ఆడారన్నమాట. ఈ వృద్ధుడూ, యువతీ, ఇలా దుఃఖంలో మునిగిఉన్నప్పుడు నేను చూస్తూ ఊరుకోలేను. జరిగినదంతా వాళ్లకి చెప్పేస్తాను."

"నువ్వు నోరు నొక్కుకుని ఊరుకోవోయ్ నిర్భాగ్యుడా!" అన్నాడు డాంగ్లర్ అతని చెయ్యి పట్టుకు లాగుతూ. "లేకపోతే, నీ వొళ్లు నువ్వే కాపాడుకోవలసివస్తుంది. డాంటే నేరం చెయ్యలేదని నీ కెల్లా తెలుసు? ఓడ ఎల్బాద్వీపందగ్గర ఆగింది. ఫెరాజో రేవులో అతను ఒకరోజంతా ఉన్నాడు. అతనిదగ్గర ఏదైనా ఉత్తరం దొరికి, నేరం స్థిరపడితే ఏమౌతుంది? అతన్ని వెనక వేసుకువచ్చిన వాళ్లు అతనితో చేరి కుట్రపన్నా రనుకుంటారు."

సహజంగా తన మేలు ముందు గమనించుకునే కాడరూస్ ఈ వాదంలోని బలాన్ని వెంటనే గ్రహించాడు. "సరే అయితే, ఏమౌతుందో చూద్దాం" అని గొణిగాడు.

"అవును చూద్దాం." అన్నాడు డాంగ్లర్. "ఏ దోషం ఎరగనివాడైతే అతన్ని విడిచిపెడతారు. నేరంచేసినవాడైతే, నేరస్థునికోసం పరితపించడం అనవసరం"

క్రమంగా జనం లేచి వెళ్లిపోతున్నారు. ఫెర్నాండో మర్సిడాప్రక్క చేరి ఓదార్చుతున్నాడు. ఆమెను చెయ్యిపట్టి కాటలన్స్ నివాసగ్రామానికి నడిపించుకు వెళ్లాడు. డాంటేమిత్రులు వృద్ధుని చుట్టూ చేరి సానుభూతి తెలిపి, మెల్లిగా మేలన్ వీధికి తీసుకువెళ్లారు.

బోనపార్టిస్ట్ గూఢచారి అని డాంటేని అరెస్టుచేసిన వార్త పట్టణమంతా ఇట్టే వ్యాపించింది.

ఎడ్మండ్‌నుగురించిన సమాచారాన్ని న్యాయాధికారి విల్ ఫర్ట్‌వల్ల తెలుసుకునే ఉద్దేశంతో, పట్టణానికి బయలుదేరిన మొరెల్, దారిలో డాంగ్లర్, కాడరూస్‌లను కలుసుకున్నాడు.

"డాంగ్లర్! నువ్విది నమ్మగలవా? ఇది నమ్మడానికి శక్యమేనా?" అని ప్రశ్నించాడు మొరెల్.

"నేను మీతో చెప్పాను కదా! పనేదీ లేకుండా ఎల్బా ద్వీపంలో ఓడ ఆపాడని. దానివల్ల నాకు కొంచెం అనుమానం కలిగినమాట నిజమే."

"అయితే నీ అనుమానాన్ని మరెవరిదగ్గరైనా వెలిబుచ్చావా?"

డాంగ్లర్ అతిరహస్యంగా చెప్పాడు: "నేను అతిజాగ్రత్తగా ఉన్నానండీ. ఎందుకంటే బోనపార్టిస్టులకింద పనిచేసిన మీ పినతండ్రి పాలికర్ మొరెల్ ఉన్నారు కదా! ఆయన తన అభిప్రాయాల్ని ఎన్నడూ రహస్యంగా దాచుకోలేదు. అందువల్ల నెపోలియన్ స్థితి చూసి మీరు చింతపడుతున్నట్లు ఎవరైనా అనుమానిస్తారేమో ననీ, దీనివల్ల మీకూ ఎడ్మండ్‌కీకూడా ఏమి ముప్పు వస్తుందో ననీ, నేను చాలా జాగ్రత్తగా ఉన్నాను."

"అవును డాంగ్లర్. మంచిపని చేశావు. నువ్వు మంచివాడవని నాకు తెలుసు. డాంటేని ఫరావోకెప్టెన్ గా నియమించడానికి ఆలోచించినప్పుడు, నీ బాగోగుల్ని గురించి కూడా ఆలోచించాను. నీతో అతను స్నేహంగా ఉంటున్నాడో, నీపట్ల అయిష్టమేమైనా ఉందేమో నని అతన్ని అడిగాను. ఎందుకో తెలియదు; కాని మీ యిద్దరిమధ్యా సఖ్యత కుదరలేదని కనిపెట్టాను. ఒకసారి అతనే నీపట్ల సరిగ్గా ప్రవర్తించలేదని ఒప్పుకున్నాడు. అయితే

యజమానుల విశ్వాసం పొందినవాళ్ళపట్ల తనూ నమ్మకతో ఉంటూ నన్నాడు."

"ద్రోహి" అని గొణిగాడు డాంగ్లర్.

"డాంటీ పాపం! నిజంగా చాలా మంచివాడు" అన్నాడు కాడరూస్.

మారెల్ అన్నాడు, "అవును. కాని ఈలోగా ఫారావోకి కెప్టెన్ లేకపోయాడే!"

"ఇంకా మూడుమాసాలవరకూ ఓడ బయలుదేరదు కాబట్టి, అప్పటికి విడుదలౌతాడని ఆశతో ఉండాలి" అన్నాడు డాంగ్లర్.

"అవు ననుకో. కాని అప్పటివరకూ?"

"మీ రేది చెయ్యమన్నా నేను సిద్ధమే. అనుభవం ఉన్న ఏ కెప్టెన్ చేసేపాటి అయినా, నేను చెయ్యగలనని మీకు తెలుసును. ఓడబాధ్యతంతా నిర్వహించగలను. నన్ను పయోగించుకుంటే మీపని తీరిపోతుంది. ఎడ్మండ్ జైలునుంచి విడుదలై రాగానే మీ కెవరిసహాయం అవసరం ఉండదు. అతని పనిలో అతను చేరతాడు, నా పనిలో నేను చేరతాను."

"బాగుంది డాంగ్లర్, బాగుంది. అలా చేస్తే సరిపోతుంది. ఓడ బాధ్యతంతా నీ కప్పగిస్తున్నాను. సరుకు దించేటప్పుడు నువ్వే అంతా చూడాలి. ఎలాటి దుర్ఘటనలు సంభవించినా వ్యాపారం మాత్రం ఆగకూడదు."

"దాన్నిగురించి మీ రాట్టే బెంగపడకండి. కాని మన మిత్రుడు డాంటేని ఇప్పుడు చూడ్డానికి వీలుపడుతుందా?"

"అది త్వరలోనే తెలుసుకొని చెప్తాను డాంగ్లర్. విల్ ఫర్ట్‌ని దర్శించడానికి ప్రయత్నం చేసి, డాంటేకి సహాయం చెయ్యడానికి చూస్తాను. నువ్వు ఓడకి వెళ్ళు. నిన్నక్కడ కలుసుకుంటాను."

మారెల్ ఆ యిద్దరినీ దారిలో విడిచి న్యాయస్థానం దిక్కుగా నడిచాడు.

"చూశావా?" అన్నాడు డాంగ్లర్ కాడరూస్‌తో.

"వ్యవహారా లెలా మారాయో? ఇంకా డాంటేకి సహాయం చెయ్యాలనుందా నీకు?"

"అబ్బె లేదు. కాని ఒక పరిహాసంవల్ల ఎంత మూడిందో చూస్తే ఘోరంగా ఉంది."

"నేను ఆ కాగితాన్ని కింద పారేశాను. అసలు చించేశాననికూడా అనుకుంటాను."

"లేదు లేదు. అది గట్టిగా చెప్పగలను. దాన్ని ఉండగా చుట్టి కింద పడేశావు. ఇప్పుడుకూడా అది అక్కడే ఉండి ఉంటే బాగుండును."

"అవును. పోనీ అల్లాగే అనుకుందాం. ఫెర్నాండో దాన్ని తీసిఉండవచ్చు. దానికి నకలు రాసిఉంటాడు. ఏమో నకలుకూడా తియ్యలేదేమో—అరి దేవుడా! ఇప్పుడు తల్పుకుంటే తట్టుతోంది. తీరా నేను రాసిన కాగితాన్నే పంపించాడేమో! నిజంగా నేను మారు దస్తూరీతో రాయడం అదృష్టమే సుమా!"

"అయితే నిజంగా డాంటే కుట్రలో చేరాడని నీకు తెలుసునా?".

"నాకా? అసలు నాకేం తెలియదు. నేను చెప్పానుగా! ఊరికే పరిహాసంకోసమే అన్నాను. అంతే. తెలియకుండా ఊరికే అన్నమాట నిజమై ఊరుకుంది కాబోలు."

"ఏమయితే నేం? మనకి ఉసురు తగుల్తుంది."

"ఉసురు తగిల్తే దుర్మార్గంచేసిన ఫెర్నాండోకి తగుల్తుంది. మనకి కాదు. మన కెందుకు తగుల్తుంది? మనం మాట్లాడక ఊరుకుంటే చాలు. వచ్చే గుడక వచ్చి దానంతటదే పోతుంది."

"అలాగే పోనీ." అన్నాడు కాడరూస్. మిత్రునివద్ద సెలవు తీసుకొని మేలాన్‌వీధివైపు తిరిగాడు. తనలో తనేదో గొణుక్కుంటూ తల పంకిస్తూ నడిచాడు.

డాంగ్లర్ తనలో ఇలా అనుకున్నాడు: "బాగుంది. చక్కగా జరిగింది. అంతా అనుకున్నప్రకారం జరిగింది. ఈలోగా నేను కెప్టెన్. ఆ దద్దమ్మ కాడరూస్ నోరుమూసుకుని ఊరుకొంటే, ఈలోగానే కాదు, శాశ్వతంగా నేనే కెప్టెన్. ఒక్కటే చిక్కు వస్తుంది; అది డాంటేని అధికారులు విడిచిపెట్టినప్పుడు. అయినా అదేం ఫరవాలేదని నేను ధైర్యంగా ఉండవచ్చు. న్యాయశాసనం న్యాయశాసనమే." అనుకుంటూ, తీరంవద్ద ఒక బోటులోకి దుమికి ఫరావోనౌకదిశగా వెళ్ళాడు.

6

సరిగ్గా పై సంఘటన సమయంలోనే, గ్రాండ్ కోర్ వీధిలో ఒక భవనంలో మరొక పెండ్లి ప్రధానపు విందు జరుగుతోంది. ఈ విందులో మార్సేల్స్‌నగరంలో పేరుమోసిన పెద్దలంతా ఉన్నారు. నెపోలియన్ పరిపాలనలో ఉద్యోగాలకు రాజీనామా లిచ్చిన న్యాయాధికారులు, సైనికోద్యోగంనుంచి విరమించుకొన్న వృద్ధులు అక్కడ ఉన్నారు. అయిదేళ్ళ దేశాంతరవాసంవల్ల త్యాగపరులని కీర్తిగడించి, పదిహేనేళ్ళ ఫ్రెంచి సింహాసన పునఃప్రతిష్ఠాపనవల్ల (రెస్టొరేషన్) ఆరాధ్యదైవం కాగలిగిన వ్యక్తి (నెపోలియన్)పట్ల ద్వేషం మప్పిన కుటుంబాల యువకులున్నారు.

వివిధ ప్రసంగాలు జోరుగా సాగిపోతున్నాయి. ఆనాటి రాగద్వేషోద్వేగాలు అక్కడి సంభాషణలలో వెలరేగాయి. యూరప్‌లో అత్యధిక ప్రాంతానికి సార్వభౌముడై పరిపాలించి, నేడు ఎల్బాద్వీపంలో పరిమితంగా రాజరికం చేస్తున్న చక్రవర్తి (నెపోలియన్) ఇంక సింహాసనానికిగాని ఫ్రెంచిదేశానికిగాని ఎన్నటికీ రాగల ఆశ లేదనే అభిప్రాయంతో అందరూ మాట్లాడుతున్నారు. నెపోలియన్ చేసిన రాజకీయ దోషాలను న్యాయాధికారులు చర్చిస్తున్నారు. మాస్కో, లీప్జిగ్ యుద్ధములనుగురించి సైనికోద్యోగులు మాట్లాడుతున్నారు. జోసెఫిన్‌తో అతని వివాహవిచ్ఛేదాన్నిగురించి స్త్రీలు ప్రసంగిస్తున్నారు. బోనపార్టిస్టుల ఆశలన్నీ భగ్నమైపోయినందుకు విజయగర్వంతో ఈ రాజరికపక్షసమాజంయావత్తూ ఆనందిస్తున్నట్లుంది. పీడకలనుంచి మేలుకొన్నట్లు, వారికి తిరిగి జీవితం నూతనోల్లాసంతో వికసిస్తున్నట్లుంది.

సెంట్‌లూయీ సిలువచిహ్నం ధరించిన ఒక వృద్ధుడు లేచి,పద్దెనిమిదవ లూయీ మహారాజుకు శుభాకాంక్షలు పలికాడు. అతనిపేరు మార్క్వెస్ ఆఫ్ సెంట్ మిరాన్. అతిథిసమూహమంతా హర్షధ్వానాలు చేసింది. ఇంగ్లీషు సమాజసాంప్రదాయాను సారం గ్లాసులు ఖణఖణ మన్నాయి. వనితలు పుష్పగుచ్ఛాలను విచ్చి పూలను మేజాపై చల్లారు.

"ఓహోహో!" అంది మార్క్వెస్ భార్య. వికాసంలేని నిశ్చలమైన ఆమె నేత్రాలు, బిగిసిన పలుచని పెదవులు, ఉత్తమ వంశసంజాత అని ప్రకటిస్తున్నాయి. ఏభైయేళ్లు నిండినా ఆమె ఠీవి సడలలేదు. "మనల్ని తరిమిన ఆ విప్లవకారులు ఇప్పుడు ఇక్కడుండి, ఇది చూసినట్లయితే, మనదే నిజమైన దేశభక్తి అని

తెలుసుకుంటారు. కూలిపోతున్నదైనా రాజరికాన్ని భక్తితో అంటిపెట్టుకున్న వాళ్ళం మనం. మనం మన భాగ్యాన్ని పోగొట్టుకోగా, కొత్తపొద్దును చూసి దోసిలొగ్గి అదృష్టం పోగుచేసుకున్నది వాళ్లో. మన ప్రభువు లూయీ అనీ, సింహాసనాన్ని అన్యాయంగా ఆక్రమించినవాడు దైవమూరుడైన నెపోలియన్ అనీ, అంగీకరించగలరు. ఏమంటారు విల్‌ఫర్ట్?"

"నిజమే. కాని వారు ఉద్రేకపూరితులు సుమా! పాశ్చాత్యులకు నెపోలియన్ దైవనియుక్తుడైన ప్రవక్త. లోభపూరితులైన సామాన్యజనుల దృష్టిలో అతడు కేవలం శాసకుడు, పరిపాలకుడు మాత్రమే కాదు; సర్వజనసమత్వసూత్రానికి చిహ్నమైన అదోకరహా వ్యక్తి."

"సమత్వం! నెపోలియన్‌కా సమత్వం?" అన్నది మార్క్విస్ భార్య. "అయితే, రోబ్‌స్పియర్‌నిగురించి ఏమంటారు? అతన్ని గెంటివేసి, ఆ స్థానాన్ని కార్సికన్‌కి (నెపోలియన్‌కి) ఇస్తున్నారన్నమాట. ఇదికూడా ఒకరకం దురాక్రమణక్రిందికే వస్తుందే."

"లేదండీ లేదు. ఎవరిస్థానంలో వారినే ఉంచుతున్నాను. ఉరికంబానికి రోబ్‌స్పియర్‌ని, వెండోమ్‌వద్ద నెపోలియన్‌ని ఉంచుతాను. ఒకరు సమత్వంకోసం అందరినీ అధోగతికి ఈడ్చివేశారు. మరొకరు సమత్వంకోసమే ఉన్నతస్థానం ఆక్రమించారు. ఒకరు మహారాజుల్ని ఉరికంబాలకు దించారు. మరొకరు ప్రజానీకాన్ని సింహాసనానికి ఉద్ధరించారు. అయితే ఇద్దరూకూడా దుర్నీతిపరులైన విప్లవకారులు కారని నేననడం లేదు. 1814లో థర్మిడర్ 9వ తేదీ కాని, (మొదటి ఫ్రెంచి రిపబ్లిక్ కాలెండర్‌లో జూలై 19 మొదలు ఆగస్టు 17 వరకూ ఏర్పరచుకున్న పన్నెండు మాసాలలో, పదకొండో మాసాన్ని థర్మిడర్ అంటారు) ఏప్రిల్ 4వ తేదీ కాని, ఫ్రాన్సుదేశానికి పండుగ చేసుకోవలసినరోజులు కావనడం లేదు. రాజరిక పక్షమిత్రులందరూ పండుగ చేసుకోవలసినవే. తిరిగి తలెత్తకుండా శాశ్వతంగా కూలిపోయిన నెపోలియన్‌కి ఇంకా అనుచరవర్గం ఉన్నదంటే నేను చెప్పినదే కారణమంటున్నాను. ఇంతకంటె మరేమాటుంది? నెపోలియన్‌తో పోల్చడానికైనా వీలుకాని క్రామ్‌వెల్‌కే అనుచరవర్గం ఉండేవారు కదా!"

"విల్‌ఫర్ట్! మీరు చెప్పినమాటల్లో విప్లవాంశకూడా ఉందని మీకు తెలుసునా? కాని అందుకు మిమ్మల్ని అనలేను. వంశపరిమళం కొంచెమైనా మిగలకుండా, గిరాండిస్టుల (రిపబ్లికన్లు) కుమారులైనవారెవరూ ఉండలేరు."

విల్‌ఫర్ట్ అన్నాడు. "నా తండ్రి గిరాండిస్ట్ అన్నమాట నిజమే. కాని మహారాజుకు విధించబడిన మరణశిక్షకు నాతండ్రి ఆమోదించలేదు. మిమ్మల్ని తరిమివేసిన ఆనాటి భయంకర పాలకులే, నా తండ్రినీ తరిమివేశారు. మీ తండ్రి శిరచ్ఛేదం జరిగిన చోటనే, నా తండ్రికికూడా శిరచ్ఛేదం జరగవలసింది; కొద్దిలో తప్పిపోయింది. అంతే భేదం."

"అవును, నిజమే. కాని ఇద్దరినీ నేరవిచారణ చేసినది పరస్పర విరుద్ధహేతువులపైన సుమా! దేశాంతరగతులైన రాజవంశంపట్ల మా వంశం ఎన్నడూ భక్తిప్రపత్తులు విడిచిపెట్టలేదు. మీ తండ్రి నూతన పరిపాలకులకు అండగా నిలిచారు. సామాన్యపౌరుడైన నయిర్‌టైర్, గిరాండిస్ట్ అయినతర్వాతనే కదా, కౌంట్ నయిర్‌టైర్‌గా సెనేట్‌సభ్యుడైనాడు?"

"దైవవిధే ప్రతికూలించిన విషయాలనుగురించి వాగ్వాదాలవల్ల మన కేం ప్రయోజనం? భవిష్యత్తునైతే దైవమైనా మార్చగలడు కాని, గడిచినదానిని మార్చలేడుకదా! నాకు సంబంధించినంతవరకూ, నేను నా తండ్రిఅభిప్రాయాలనే కాదు; నా తండ్రి ఇంటిపేరునుకూడా త్యజించాను. ఆయన ఒకప్పుడే కాదు, ఇప్పుడుకూడా బోనపార్టిస్టే కావచ్చును. ఆయనపేరు నయర్‌టైర్. నేను రాజరికపక్షానికి చెందినవాడిని. నాపేరు విల్‌ఫర్ట్. కుళ్ళి కృశిస్తున్న వృక్షంతోపాటు, విప్లవాల చిలవలను పలవలను నశించనివ్వండి. ఇంకా తగినబలం కూర్చుకోలేక, ఇప్పుడిప్పుడే తల్లివేరునుంచి పుట్టి ఎదుగుతున్న కొత్తమొక్కను ఆదరించండి."

"బలే, బాగా చెప్పావోయ్ విల్‌ఫర్ట్!" అన్నాడు మార్క్విస్. "గతాన్ని విస్మరించాలని నా భార్యకి నేనెంతగానో బోధిస్తున్నాను. కాని ఇంతవరకూ ఆమె తలకెక్కలేదు. నువ్వైనా నచ్చచెప్పగలుగుతావని ఆశపడుతున్నాను."

"అలాగే మరచిపోతాను" అన్నది మార్క్విస్ భార్య. "గతాన్ని మరచిపోడానికి నాకేలాటి అభ్యంతరం లేదు. కాని విల్‌ఫర్ట్, ఇకనుంచి మీరు మీ వృత్తిలో దృఢచిత్తంతో పని చెయ్యాలి సుమా! మీ చేతులలో ఒక కుట్రదారుడు చిక్కాడంటే, మిమ్మల్ని వెయ్యికళ్లు కనిపెట్టిచూస్తున్నాయన్న విషయం మరచిపోకండి. బహుశా కుట్రదారులతో మీ కుటుంబం చేరి ఉంటుందని అందరూ అనుమానిస్తారు."

"నిజం చెప్పాలంటే, నా వృత్తిసర్మంవల్లనైతేనేం కాలగతినిబట్టి అయితేనేం, నేను కఠినంగా ఉండక తప్పదు. నేను అలాగే నిర్వర్తిస్తాను. ఇప్పుడు నావద్దకు అనేక రాజకీయనేరాలు విచారణకు వచ్చాయి. తగిన సాక్ష్యబలంకూడా చేరింది. దురదృష్టవశాత్తు ఈ వ్యవహారాలింకా అంతం కాలేదు. నెపోలియన్ ఫ్రాన్సుదేశానికి అతిసమీపంలోనే ఉన్నాడు. మన తీరానికి కనుచూపుమేరలో, ఎల్బాద్వీపంలో అతడున్నందువల్ల, అతని అనుచరుల బలోత్సాహాలు ఇంకా అంతరించలేదు. అర్ధవేతనాలు పొందుతున్న అధికారులు మార్సేల్స్‌లో అనేకులున్నారు. రాజరికపక్షంవారితో చీటికీ మాటికీ కయ్యాలకు కాలుదువ్వుతున్నారు. అందువల్ల ఉన్నత తరగతులలో ద్వంద్వయుద్ధాలు, నీచతరగతులలో హత్యలు విరివిగా సాగుతున్నాయి."

"అవును" అన్నాడు కౌంట్ సాల్వో. ఇతడు మార్క్విస్ ఆఫ్ సెంట్‌మిరాన్ మిత్రుడు. "కాని అతన్ని సెంట్ హెలెనా ద్వీపానికి పంపాలని పవిత్రరాజ్యకూటం (హోలీ ఎలయన్స్) నిర్ణయించిందని మీకు తెలుసు కదా!"

"సెంట్ హెలెనా? అంటే అదెక్కడుంది?" అని ప్రశ్నించింది మార్క్విస్ భార్య.

"భూమధ్యరేఖకు ఆవలివైపున; మనకి ఆరువేలమైళ్ల దూరంలో ఉంది."

విల్‌ఫర్ట్ అన్నాడు: "కాని మన దురదృష్టంకొద్దీ 1814 ఒడంబడిక ఒకటుంది. దానిమూలంగా నెపోలియన్‌జోలికి మనం పోలేం."

"అయితే ఒడంబడికల్ని పాటించనేవద్దు." అన్నాడు కౌంట్ సాల్వో. "ఫ్రెంచిరాజకుమారుణ్ని చంపడానికి నెపోలియన్‌కి ఏ ఒడంబడికా అడ్డురాలేదు."

"అవును. అయితే అది స్థిరపడినట్లే" అన్నది మార్క్విస్ భార్య. "పవిత్రరాజ్యకూటం నెపోలియన్‌ని యూరప్‌నించి విరగడచేసుకుంటుంది. దాంతో మార్సేల్స్‌లో అతని అనుచరుల బాధ విల్‌ఫర్ట్‌కి విరగడౌతుంది. మహారాజు పరిపాలించాలా, వద్దా? పరిపాలించాలంటే, ప్రభుత్వం బలీయంగా ఉండాలి. అధి

కారులు దృఢచిత్తులై పనిచెయ్యాలి. ముప్పరాకుండా కాపాడా లంటే అంతే."

విల్‌ఫర్ట్ చిరునవ్వుతో అన్నాడు: "అపకారం జరిగిపోయిన తరవాతనే ఎప్పుడూ న్యాయాధికారి కర్తవ్యాని కుపక్రమించడం మన దౌర్భాగ్యమే."

కౌంట్‌సాల్వో కుమార్తె సంభాషణలోకి ప్రవేశించింది. ఈమె మార్క్వెస్ కుమార్తెకు ప్రియమిత్రం. సుందరి. "మేము మార్సెల్సునించి వెళ్లిపోయేలోగా గొప్ప నేరవిచారణ ఒకటి జరిపించండి విల్‌ఫర్ట్! నే నెప్పుడూ న్యాయస్థానం చూడలేదు. చాలా సరదాగా ఉంటుం దంటారు" అంది.

"నిజంగా సరదాగానే ఉంటుంది. నాటకాలలో అభినయించే విషాదం కాదిది. జీవితంలోని వాస్తవమైన విషాదం, దుఃఖం చూడవచ్చును. ఉద్వేగహృదయులైనవారు, ఉద్రేకపూరితదృశ్యాల్ని చూడగోరితే, ఇంతకంటె అద్భుతదృశ్యం ఉండబోదు. తరుణం రాగానే, మీరు చూసి ఆనందించగలరు."

వధువైన మార్క్వెస్ కుమార్తె రినీ అంది: "అది తల్చుకుంటే దడ వస్తుంది సుమా! కాని ఆశ్చర్యం! ఎంత చులకనగా మాట్లాడుతున్నాడు!"

"అవును. ఎందుకు మాట్లాడకూడదు? అది నా దృష్టిలో ద్వంద్వయుద్ధంవంటిది. ఇప్పటికి అప్పుడే అయిదారుసార్లు రాజకీయ నేరస్థులకు మరణశిక్షలు విధింపచేశాను. నాకోసం కత్తులు నూరుతున్నవా రెందరున్నారో ఎవరికి తెలుసును?"

వధువు కలవరపడింది: "నిజం చెప్తున్నారా?"

చిరునవ్వుతో వరుడన్నాడు. "ఇదీ ఒక నిజమేనా? ఈ అద్భుత నేరవిచారణలే లేకపోతే, పరిస్థితి మరింత దుర్భరంగా ఉండేది. ప్రత్యక్షశత్రువుని చంపడంకంటె, ఎన్నడూ కంటితో చూడని రష్యన్, ఆస్ట్రియన్, హంగేరియన్ సైనికుల్ని చంపడం ప్రధానంగా నెపోలియన్ సైనికులు పరిగణిస్తారని మీ ఉద్దేశమా? అసలు ఈ కొండ ఎంతో అవసరం. ఇదే లేకపోతే మా వృత్తి ఎక్కడుంటుంది? నామటుకు నాకు నేరస్థుని కళ్లలో రౌద్రాన్ని చూస్తున్నకొద్దీ ఉత్సాహం అధికమౌతుంది. పట్టుదల ఎక్కువౌతుంది. అది నేరవిచారణ కాదు. ఒకరకం ద్వంద్వయుద్ధం. ఒడుపు చూసి వాడొక వేటు వేస్తాడు. అది కాసుకుని నేను తిరిగి దెబ్బతీస్తాను. విజయమో, పరాజయమో, అక్కడే తేలిపోతుంది. వాద ప్రతివాదాలంటే అలా ఉంటాయి. ప్రమాదమనేది వాగ్ధార నుత్పన్నంచేస్తుంది. నా ప్రతివాదం విని నవ్వే నేరస్థునిచూస్తే నే, చెప్పిన దానిలో లోపముందని, నా వాదంలో బలం చాలదని భావిస్తాను. నేరంలో నిజాన్ని గ్రహించి, దోషి ముఖం పాలిపోగా, సాక్ష్యబలానికి తలొగ్గినప్పుడు, వాడిని చూస్తుంటే న్యాయాధికారి పొందే గర్వం ఎలా ఉంటుందో ఆలోచించండి! అనతికాలంలో ఛేదించబడనున్న శిరస్సు వాలిపోతుంది..."

రినీ చీత్కారం చేసింది.

అతిథులలో ఒకరన్నారు: "కిందటి కేసులో మీ నేర్పు అద్భుతంగా ఉంది విల్‌ఫర్ట్. తండ్రిని చంపిన ఆ నేరస్థుడు మీకు జ్ఞాపకమేనా? ఉరితియ్యకముందే మీరు వాణ్ణి అక్షరాలా చంపేశారు."

"పితృహంతకులైతే అది వేరు" అంది రినీ. వాళ్లని ఎంత బాధపెట్టినా చాలదు. కాని పాపం రాజకీయ నేరస్థుల సంగతి అలా కాదు."

"వీళ్లు మరింత ఘాతకులు రినీ," అన్నాడు విల్‌ఫర్ట్. "మహారాజంటే జాతికంతకీ తండ్రి. అటువంటి మహారాజును పదభ్రష్టుని చెయ్యడం, హత్యచెయ్యడం అంటే ఏమిటి? మూడుకోట్ల ఇరవైలక్షల ప్రజలకు పితృసమానుడు మహారాజు."

"అది సరే. నేను చెప్పినప్పుడుమాత్రం నేరస్థుల్ని కొంచెం కరుణతో చూస్తే చాలు" అంది రినీ.

"తప్పకుండా," అన్నాడు విల్‌ఫర్ట్, చిరునవ్వు ముఖమంతటా వికసింపచేస్తూ.

"అమ్మాయి, నీ చిలకలు, గోరింకలూ, సీమకుక్కపిల్లలు, అలంకారాలసంగతి నువ్వు చూసుకో" అంది మార్క్వెస్ భార్య. "నీ కాబోయే భర్తని అతని వ్యవహారాలకి అతన్ని విడిచిపెట్టు. ఈరోజుల్లో ఆయుధాల్ని మూలపారేశారు. న్యాయస్థానాలలో పోరాటాలు జరుగుతున్నాయి."

"నువ్వు వైద్యుడివైతే బాగుండునని నా ఉద్దేశం" అంది రినీ, విల్‌ఫర్ట్‌తో. "ఎంతటి కరుణార్ద్రహృదయుడైనా, దండనాధికారి కఠోరుడే నని నా అభిప్రాయం."

ప్రేమార్ద్రమైన దృష్టితో విల్‌ఫర్ట్ యువతివంక చూశాడు. "పాపం, పిచ్చిపిల్ల" అనుకున్నాడు.

మార్క్వెస్ అన్నాడు: "అమ్మాయ్. విల్‌ఫర్ట్ మన రాష్ట్రానికి నైతికంగా, రాజకీయంగా చేసేది వైద్యమే ననుకో. అదీ ఉత్కృష్ట కర్తవ్యమే."

"దీనివల్ల అతని తండ్రి చేసినవన్నీ మరిచిపోడానికి వీలౌతుందికూడా" అంది మార్క్వెస్ భార్య.

కొంచెం అనుతాపసూచకంగా చిరునవ్వు నవ్వాడు విల్‌ఫర్ట్: "నా తండ్రి ఇదివరలో చేసిన దోషాలను దిద్దుకున్నాడని ఇప్పుడే మనవి చేశాను. ఇప్పుడు ఆయన ప్రస్తుత పాలకవర్గంపట్లనూ, మతంపట్లనూ విధేయుడు. నాకంటె మేలైన రాజరికపక్షవాదిగా మారినా సంభవమే. నా విషయంలో ఇది నా ఇష్టానికి సంబంధించినది మాత్రమే. నా తండ్రివిషయంలో అది పశ్చాత్తాపం"

"మీరు చెప్పినది నిజమే విల్‌ఫర్ట్" అన్నాడు కౌంట్ సాల్వో. "ఈమధ్య ఒక రోజు మహారాజునివాసంలో అంతఃపురవ్యవహారాలమంత్రితో మాట్లాడినప్పుడు నేనది గమనించాను. ఇదివరలో కాండ్ సైన్యంలో పనిచేసిన ఉద్యోగి కుమార్తెకూ, గిరాండిన్ కుమారునికీ వివాహప్రసంగం జరుగుతున్న దేమిటని నన్ను మంత్రి ప్రశ్నించారు. సరిగ్గా ఈ పద్ధతినే ఉభయపక్షాలమధ్యనూ సామరస్యం చేకూర్చడం మహారాజుగారి అభిలాష అని నాతో చెప్పారు. మా సంభాషణ మహారాజు వింటున్నట్లు మేం గమనించలేదు. మహారాజు మధ్యలో వచ్చి 'విల్‌ఫర్ట్ వృద్ధిలోకి వచ్చేవాడే' అన్నారు. మహారాజు విల్‌ఫర్ట్ అనే పేరు వాడారుకాని, నయర్‌టైర్ పేరు వాడలేదు సుమా! 'ఇప్పుడే అతనికి మంచి విచక్షణ' వివేచన ఉన్నాయి. సెంట్‌మిరాన్ దంపతులు అతన్ని అల్లుడుగా స్వీకరిస్తున్నారంటె నాకూ సంతోషమే. వారు ఇంకా నిర్ణయం చేసిఉండకపోతే, నేను సరిగ్గా ఇటువంటి బాంధవ్యమే తెచ్చుకోవాలని సలహా ఇచ్చేవాడిని' అని కూడా అన్నారు మహారాజు."

"నిజంగా, మహారాజు అలా అన్నారా?" అన్నాడు విల్‌ఫర్ట్, మహదానందంతో. "నిజంగా నే నీ మహారాజుకు ఎంత ఋణపడిఉన్నాను? ఆయన కొలువుచెయ్యడానికి దేనికైనా నేను సిద్ధమే."

"బాగుంది" అంది మార్క్విస్ భార్య. "మీ మాటలు వింటే నాకు సంతోషంగా ఉంది. ఇంక ఇప్పుడు రానివ్వండి, ఏ కుట్రదారు వస్తాడో! తెలుస్తుంది మన ప్రభావం."

సరిగ్గా ఈ వాంఛ తీర్చడంకోసమే అదృష్టదేవత నిరీక్షించి ఉన్నట్లు, అదే సమయంలో ఒక దర్వాన్ వచ్చాడు. విల్‌ఫర్ట్ చెవిలో ఏదో చెప్పాడు.

వెంటనే విల్‌ఫర్ట్ అతిథులను క్షమార్పణ కోరి వెళ్ళిపోయాడు. వెళ్ళిన కొద్దిసేపటిలోనే నవ్వుముఖంతో తిరిగివచ్చాడు. రినీ అతనివంక ప్రేమతో చూసింది. అతని సౌష్ఠవశరీరం, వికసించిన వదనం, అమాయకురాలైన ఆ కన్య ప్రశంసాభావాన్ని ఇనుమడింపచేశాయి.

"ఇప్పుడే కదా మీ రన్నారు, వైద్యుడైనవానిని పెళ్లిచేసుకుంటే బాగుండు నని? క్షుద్రగ్రహంతో పోల్చుకోదగినదొక లక్షణం నాకూ ఉంది. రెండు వ్యక్తులూ క్షణం తీరిక నివ్వవు. నేను మీ సమక్షంలో ఉన్నా సరే, నా వివాహానికి ప్రధానపు విందులో ఉన్నా సరే, నన్ను విడిచిపెట్టరు."

కొంచెం కలవరపాటుతో ఆమె ప్రశ్నించింది: "మిమ్మల్ని ఎందుకు పిలిచారు?"

"నాకు చెప్పినది నమ్మదగినదైతే, ఒక ప్రమాదమైన రోగాన్ని నివారించవలసినపని వచ్చిందన్నమాట. ఈమారు ఇది చాలా ప్రమాదమైనది. మందు మరణదండనే ననుకుంటాను."

"ఏమిటి?" అన్నారు అతిథులంతా ఒక్కసారిగా.

"ఇప్పుడే బోనపార్టిస్టుల కుట్ర ఒకటి బైటపడిందిట. ఇదిగో నేరమారోపించే ఉత్తరం చదువుతాను వినండి: 'మహారాజుగారొక్క హితంకోరిన ఒక మిత్రుడు రాజశాసనాధికారి నీ క్రిందివిధంగా హెచ్చరిస్తున్నాడు: స్మిర్నా నుంచి బయలుదేరి, నేపుల్స్, ఫెరాజో రేవులగుండా ప్రయాణం చేసి, ఇవాళ ఉదయమే మార్సేల్స్ చేరిన ఫరావోనౌకలో మేట్‌గా పనిచేస్తున్న ఎడ్మండ్ డాంటే అనే ఒక యువకుడు, నేపుల్స్‌రాజు (నెపోలియన్ బావమరిది) వద్దనుంచి నెపోలియన్‌కు ఒక ఉత్తరం ఇచ్చి, పారిస్‌లో బోనపార్టిస్టు కమిటీకి ఇవ్వడానికి నెపోలియన్ వద్దనుంచి ఒక ఉత్తరం తీసుకువెడుతున్నాడు. ఆ యువకుని అరెస్టుచేసినట్లయితే రుజువు దొరుకుతుంది. నెపోలియన్ ఉత్తరం అతనివద్ద కాని, అతని తండ్రిఇంటిలో కాని, ఫరావోనౌకలో అతని గదిలో కాని దొరుకుతుంది."

"ఈ ఉత్తరం ప్రధానన్యాయాధికారికి వ్రాసినది. పైగా పేరూ, దస్కతూ లేనిది కదా?" అంది రినీ.

"అవును. కాని ప్రధానన్యాయాధికారి ఇక్కడిప్పుడు లేడు. అందువల్ల ఉత్తరాన్ని అతని కార్యదర్శి తీసుకున్నాడు. దీన్ని చూసి నాకు కబురు పంపాడు. నేను వెంటనే దొరక్కపోవడంవల్ల అరెస్టుకు ఆజ్ఞ ఇచ్చాడు."

"అయితే దోషి అరెస్టయినాడా?" అని ఆత్రంతో ప్రశ్నించింది మార్క్విస్ భార్య.

"ఎక్కడున్నాడు?" అని ప్రశ్నించింది రినీ.

"నా ఇంటివద్ద."

"మీ రింక కర్తవ్యవిలంబనం చెయ్యకండి" అన్నాడు మార్క్విస్, "రాజకార్యం ముందుగా నిర్వర్తించి తీరవలసినది."

ఆవేగంతో రెండు చేతులూ గుండెలపై చేర్చి రినీ అంది, "విల్‌ఫర్ట్! ఇవాళ మన ప్రధానంరోజన్నమాట మరిచిపోకు" మరీ కఠినంగా ఉండవద్దు"

విల్‌ఫర్ట్ ఆమెను సమీపించి అన్నాడు: "నేను చెయ్యగలిగినదంతా చేస్తాను. నువ్వు ఆందోళనపడవద్దు. వార్త నిజమై, నేరం ధృవపడితే, ఈ దుష్టాంగాన్ని ఖండించక తప్పదు."

"అబ్బే! చిన్నపిల్ల మాటలు వినకండి విల్‌ఫర్ట్" అంది మార్క్విస్ భార్య. "క్రమక్రమంగా ఆమె వీటికి అలవాటుపడుతుంది."

"నిర్బలుడైన రాజరికవాదిని క్షమించండి. నా కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో, విధేయతతో నిర్వర్తించగలను. కఠినంగా ఉండవలసినప్పుడు వెనుదీయను." అన్నాడు విల్‌ఫర్ట్. మురిపెంతో వధువు వంక అతడు చూసిన చూపులోమాత్రం, "నీ ప్రేమకోసం నీ మనోవాంఛను మన్నిస్తాను" అన్నట్లు స్ఫురించింది.

కాంగ్రెస్: తెగనిసమస్య

(8-వ పేజీ తరువాయి)


కాబట్టి కాంగ్రెస్ సంస్థలోనే, నాయకత్వంలోనే మార్పువస్తేగాని దేశ క్షేమాన్నీ ప్రజల క్షేమాన్నీ కోరేవారికి పాలనాధికారం రాదు. కేంద్రప్రభుత్వాన్ని గమనించినా, రాష్ట్రప్రభుత్వాల్ని గమనించినా ఈ మార్పు అవసరం గోచరించక మానదు. ఇప్పుడున్నవి కేవలం అభిప్రాయభేదాలు కావు. కాంగ్రెస్ సంస్థలోనే ఉండి అధికారం సాధించడానికి ప్రచ్ఛన్న సంఘర్షణ లారంభమైనాయి. ఏది నష్టమైనా సరే కాంగ్రెస్‌లో ఐక్యతకోసం దేశాన్ని ఒడ్డి కృషిచేయాలన్న భావం ఈ చాటుమాటు పోటీవర్గాలను బలపరుస్తోంది. కాంగ్రెస్ పట్ల విధేయులు కానివారిని వెళ్లగొట్టడమా ఉంచడమా అనే చర్చకంటె, దేశ ఆర్థిక వ్యవస్థానిర్మాణాశయాలను గురించి చర్చ చెయ్యడం మేలు. దేశక్షేమందృష్ట్యా, పాలనాధికారాన్ని వినియోగించే విధానం అన్వేషించడం మేలు. ఆర్థికంగా సాంఘికంగా దేశాన్ని పునర్నిర్మించడానికి విస్పష్టమైనవీ, ఆచరణయోగ్యమైనవీ కార్యక్రమాలను స్థిరపరుచుకోవలసిన అగత్యాన్ని పండిట్ నెహ్రూ జ్ఞప్తికి తెచ్చారు. ఆ కార్యక్రమాలు నిర్ణయమైనప్పుడు, ప్రభుత్వాలకు ప్రజల తోడ్పాటు లభిస్తుంది.

[సీతారామ్]

★



పారిస్‌లో గతమాసం పండిట్ నెహ్రూతో సంప్రదించిన భారతరాయబారులు: బి. ఐ. సేన్; విజయలక్ష్మీపండిట్, బి. యన్. రావు, సర్దార్ మాలిక్, సర్ గిరిజాశంకర్ బాజ్‌పాయ్‌గార్లు.



ఆంధ్రదేశంలో రాష్ట్రకాంగ్రెస్ కమిటీ ఎన్నికలు జరిపిన శ్రీ జి. ఓ. మహేశ్వర్,
రాష్ట్రకాంగ్రెస్ కార్యాలయోద్యోగులు, తదితరులు.

Regd. No. M. 4479

ఆంధ్రపత్రిక

శ్రీ ఖర నామ సంవత్సర

పంచాంగం

శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి సిద్ధాంతిగారిచే గుణించబడిన

ఈ సంవత్సరపంచాంగంలో చాంద్రమాన, దృక్సిద్ధాంతాల ప్రకారం గుణింపబడిన రెండుపద్ధతుల తిథి, నక్షత్రాదులు వేర్వేరుగా చూపబడినవి.

కొత్తపంచాంగాలు సిద్ధమౌతున్నవి

---

100 పుటలు

వెల

ప్రతి 1-కి 0-4-0

100-కి 16-0-0

1000-కి 150-0-0

రైలు ఖర్చులు ప్రత్యేకం.

1000 కాపీలు ఒకే దఫా కొనువారి చిరునామా ముఖపత్రమున ముద్రించబడును.



వివరాలకు వ్రాయండి:

మేనేజరు - ఆంధ్రపత్రిక, మద్రాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, ThambuChetty St Madras